# గ్రంథాలయ సర్వస్వము

ధాత - కార్తికము — డిసెంబరు ౧౯౩౬.



సంపుటము ౧౦

సచిత్రమాసపత్రిక

సంచిక. ౭

# ఉత్తమ గ్రంథముల కానుక

ఆంధ్రదేశగ్రంథాలయ సంఘసభ్యులై, చందాలుచెల్లించిన గ్రంథాలయములవారికి మాత్రమే.

**I. గీతాభూమిక**

౧౧౮ పుటలు - స్టిఫ్ బైండు - మేలుకాగితము - అమూల్యగ్రంథము. శ్రీ అరవిందయోగీంద్రుని బంగాలి గ్రంథమునకు శ్రీ గొట్టిపాటి వెంకటసుబ్బయ్యగారి తెనుగు అనువాదము. ఇది శ్రీ చల్లపల్లి రాజాగారి ఔదార్యమువలన లభించినది, పోస్టేజీ ఉచితము.

**II. వల్లూరి సూర్యనారాయణరావు, బి. ఏ., బి. ఎల్. గారిచే ప్రకటితములగు ఉత్తమ గ్రంథములు.**

పై గ్రంథములు కానుకగా పొందగోరు గ్రంథాలయములవారు దిగువ చిరునామాకు వ్రాయవలెను.

కార్యదర్శి,
ఆంధ్రదేశ గ్రంథాలయసంఘము, బెజవాడ.

షరా:— "గీతాభూమిక :" భీమవరము - తణుకు - తాడేపల్లిగూడెము - రేపల్లె - తెనాలి - బెజవాడ ధర్మవరము తాలూకాలలోని గ్రంథాలయములవారు ఆ యాతాలూకా గ్రంథాలయసంఘముల నుండియు, బెజవాడ-గుంటూరు, కాకినాడ, విశాఖపట్టణములలోని గ్రంథాలయములవారు ఆయా పట్టణగ్రంథాలయ సంఘముల నుండియు పై గ్రంథమును పొందగలుగుదురు.

---

# గ్రంథాలయ సర్వస్వము

చందా : ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ సభ్యులకు సభ్యత్వపుచందాతో రు 3 లు మాత్రమే.
ప్రతినెల ౫-వ తేదీని వెలువడును.

వ్యాసములు:-గ్రంథాలయశాస్త్రము - ఆంధ్ర వాఙ్మయము, ఆంధ్రాభ్యుదయము, జాతీయ పునర్నిర్మాణములను గూర్చిన అనుభవ పూర్వకములైన వ్యాసములు, గ్రంథాలయ సంఘముల యొక్క నివేదికలు, వృత్తాంతములు, గ్రంథముల విమర్శనములు ఇందు ప్రకటింపఁబడును.

పటములు:—గ్రంథాలయ భవనములయు, గ్రంథాలయ సభలయు, గ్రంథాలయ సేవకులయు, సంస్థలయు పటములు ఇందు ముద్రింపఁబడును. ఫోటోలుపంపువారు బ్లాకులఖర్చులు తామే భరింపవలెను. లేదా బ్లాకులుచేయించి పంపవలెను.

**హెచ్చరిక**

ఈ పత్రిక ప్రతినెల ౫-వ తేదీని వెలువడును; కావున వ్యాసములను పంపువారు ఏ నెల పత్రికయందు అవి ప్రకటింపవలెనో దాని వెనుకటినెల 15-వ తేదీకి పూర్వమే పంపవలయును. పటములను వెనుకటినెల 1-వ తేదీకి పూర్వమే పంపవలయును.

**ప్రకటనముల రేట్లు**

| | |
|---|---|
| ఒకసారి 1 పుటకు | రు 20-0-0 |
| ఒకసారి ½ పుటకు | రు 12-0-0 |
| ఒకసారి ¼ పుటకు | రు 6-0-0 |

వివరములకు :—

మేనేజరు, గ్రంథాలయసర్వస్వము, బెజవాడ.

RSVM01A161

## ఆంధ్రదేశ గ్రంథాలయ మహాసభ

ఈ డిసెంబరు మూఁడవవారములోనో, రాఁబోవు జనవరి మొదటివారములోనో ఆంధ్రదేశగ్రంథాలయ మహాసభ కర్నూలుజిల్లా నంద్యాలకు సమీపమునందుండు శ్రీ మహానందీశ్వరక్షేత్రమునందు ఇతర మహాసభలతో పాటు జరుపుటకు తీర్మానించినారు. తేదీలు, అధ్యక్షకాది వివరణములు పత్రికాముఖమున ప్రకటితములగును. మహాసభలతోపాటు గ్రంథాలయముల ప్రదర్శనమును జరుపుదురు. తెలుఁగుసీమలోని గ్రంథకర్తలు, ప్రచురణకర్తలు, పత్రికాధిపతులు, తమ తమ గ్రంథములను, పత్రికలను ప్రచురణములను ప్రదర్శించుటకు ఇది మంచితరుణము. ఇందులకు సంబంధించిన ప్రకటనములకొఱకు వేచియుండి పత్రికలలో చదివి తగినచర్య పుచ్చుకొందురుగాక!

# దివ్యాస్టైమ్ క్రాస్వర్డు కాంపిటిషన్
# బెజవాడ.

## ప్రొద్దుపుచ్చుటకు పోటీలు

హెచ్చరిక:— నవంబరుసంచికలో ప్రచురించిన పోటీకి ప్రవేశములు పోస్టు చేసికొనుటకు ది 19—11—36 నుండి ది 15—12—36 వరకు కాలవ్యవధి ఇయ్యబడినది.

# విషయసూచిక


| | విషయము | | | పుట |
|---|---|---|---|---|
| ౧. | గ్రంథాలయములు | ... | ... | 243 |
| ౨. | శ్రీ కనకదుర్గాస్తవము | ... | ... | 244 |
| ౩. | మూఢముకురము | ... | ... | 244 |
| ౪. | నిరక్షరత్వనిర్మూలనము - అయిదుసంవత్సరాల కార్యక్రమము | | ... | 245 |
| ౫. | తిరువాన్కూరు రాజ్యము - దేవాలయహరిజనప్రవేశము | | ... | 248 |
| ౬. | తిరువాన్కూరుసంస్థానసంగ్రహచరిత్ర | ... | ... | 249 |
| ౭. | ఆత్మారోగ్యము అవశ్యానుసరణీయము | ... | ... | 251 |
| ౮. | మోటారుచక్రముల ఎడ్లబండ్లు | ... | ... | 253 |
| ౯. | మలమూత్రములు మంచిఎరువులు | ... | ... | 255 |
| ౧౦. | ఆరోగ్యవిషయములు | ... | ... | 257 |
| ౧౧. | సూయాణము=సూచియానము | ... | ... | 258 |
| ౧౨. | లోకవార్తాలహరి | ... | ... | 259 |
| ౧౩. | శిక్షణనిలయము - బెజవాడ | ... | ... | 263 |
| ౧౪. | వోల్టా - విద్యుత్పరిశోధకుడు | ... | ... | 264 |
| ౧౫. | రోథాంస్టెడ్ ప్రయోగస్థానము | ... | ... | 266 |
| ౧౬. | ఇండియాలో విద్యావిధానము | ... | ... | 266 |
| ౧౭. | మందిమనుగడ | ... | ... | 267 |
| ౧౮. | వామననాయకుగారు | ... | ... | 271 |
| ౧౯. | ఆంధ్రరాష్ట్రజీవకారుణ్యసంఘము - బెజవాడ | ... | ... | ,, |
| ౨౦. | గ్రంథాలయములు - పశుచికిత్సాలయములు | ... | ... | 272 |
| ౨౧. | అసెంబ్లీలోని నిషేధగ్రంథములనుగురించినచర్చ | ... | ... | 273 |
| ౨౨. | టి. సి. దత్తాగారి ఆంధ్రదేశగ్రంథాలయసందర్శనము | | ... | ,, |
| ౨౩. | ఆంధ్రదేశగ్రంథాలయోద్యమము - సమకాలికాభిప్రాయములు | | ... | 274 |
| ౨౪. | తణుకుతాలూకా ద్వితీయగ్రంథాలయమహాసభ | | ... | 275 |
| ౨౫. | గ్రంథాలయ నివేదికలు | ... | ... | 276 |
| ౨౬. | గ్రంథాలయవృత్తాంతములు | ... | ... | 277 |
| ౨౭. | సంపాదకీయములు | ... | ... | 280 |
| ౨౮. | 'స్టావ్‌లీ' ప్రాంతీయ గ్రంథాలయము | ... | ... | 282 |

# గ్రంథాలయసర్వస్వము.

| సంపుటము ౨౦ | ధాత - కార్తికము - డిసెంబరు 1936 | సంచిక ౭ |
| --- | --- | --- |

సంపాదకులు:
గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, ఎం. ఏ.,
మారేపల్లి రామచంద్రశాస్త్రి,
అయ్యంకి వేంకటరమణయ్య.


## గ్రంథాలయములు

(శ్రీ బాలకవి అల్లమరాజు నారాయణరావుగారు, బొబ్బిలి.)

సీ. సకలజాతులవారి సమత సన్మానించు, నైకమత్యము కూర్చు, నాదరించు,
ఇతిహాసములవెల్ల మతిభాషలఁ జెప్పు, శాస్త్రాగమవ్యూహసరణిఁ దెల్పుఁ,
గళలెల్ల నేర్పించుఁ, గవివరేణ్యులఁ జూపు, సాధ్వీచరిత్రముల్ చక్కఁజాటుఁ,
బ్రకృతియందంపుఁ జిత్రములఁ గన్నులఁగట్టు, సర్వసందేహముల్ సరగ మాన్పు,
వృత్తాంతములఁ దెచ్చుఁ, గృషిసల్పు టెఱిఁగించు, వాణిజ్యవిధు లెన్నొ కానఁజేయు,
నఖిలరాజ్యాంశంబు లాద్యంతమును బిండి, యారఁబోసినయట్టు లాత్మల కిడు,
గీ॥ నిదియు నదియని వచియింప నేల? గ్రంథసద్మములమూలమున సమస్తంబుఁ గలుగు;
స్వీయరాజ్యసంపాదనాపేక్షఁ దీర్చు, సాధనంబుల నెన్నియో బోధసేయు;
కుటిలసంసారనౌకానుకూలమర్మజాల మెఱిఁగించుఁగాదె గ్రంథాలయములు?
సీ. విశ్వవిద్యార్థసద్విజ్ఞాన మిడు పాఠశాలలుగావె గ్రంథాలయములు?
గతకాలనిజరాష్ట్రకమనీయచరితాంశతతిఁ దెల్పుఁగాదె గ్రంథాలయములు?
సకలదేశాచారసద్ధర్మబోధనాదర్శముల్ గావె గ్రంథాలయములు?
భక్తిముక్తిద లసత్ ప్రభలీను దేవాలయంబులుగావె గ్రంథాలయములు?
పేదసాదులకెల్లఁ బెన్నిధానములు మందారముల్ గావె గ్రంథాలయములు?
అజ్ఞానగాఢాంధ మవలఁ ద్రోసెడు చంద్రికాలతల్ గావె గ్రంథాలయములు?
ఆత్మరోగములెల్ల నడఁచు నాయుర్వేదధామముల్ గావె గ్రంథాలయములు?
గీ॥ శారదాదేవి విహరించు చారుగంధ,కలితమలయానిలములొల్కఁ, గనులకింపుఁ
గొలుపునందనోద్యానసీమలయి, జనుల, కమితముద మిడుఁగాదె గ్రంథాలయములు?

2414

# శ్రీ కనకదుర్గాస్తవము

విద్వాన్ శ్రీ కల్లూరి వేంకటసుబ్రహ్మణ్య
దీక్షితులు గారు

ఉ. శ్రీకనకాంబికాచరణ
సేవ లయించెడు చిత్తవృత్తి న
బ్జాకలఁబెట్టు సంసృతిదు
రంతతకున్ బయిలోడకే నమో
వాకముఁగూర్చి, భాగవత
భక్తిసుధారసజీవనాప్తి మైఁ
గాఁకలు దీర్చుకొందునని
గట్టిగ నమ్మితినమ్మ! ఈశ్వరీ!

ఉ. నీమృదుపాదపద్మముల
నేత్రము లద్దిన మోక్షసాధన
స్తోమము కండ్లఁగట్టినటు
దోఁచదా! ఈతమ మెల్లఁ బాయదో!
కామవిలాసపుందుడుకు
గట్టదా! నేత్రచికిత్స కింత మం
దేమి యెఱుంగఁ; బల్కఁగద
వే కనకాంబిక! శ్రీమహేశ్వరీ!

మ. కవితాగానములందు మోక్షకమలా
కల్యాణగాథాంకముల్
చవు లీన న్వినుతింపఁ దత్ప్రణయవా
చాప్రౌఢి మేల్మేలు! బా
గవులే! యంచును భట్టు కైత లిడ నం
తా పెద్దలే కాని త
త్కవితాసారరసానుభూతి యది యే
ధన్యాత్ము నైశ్వర్యమో!

# మూఢముకురము

శ్రీ పట్టిసపు శ్రీరామమూర్తిగారు,
కవితాసమితి.

హస్తామలకుఁడు:—

బలముడిగియుఁ పళ్ళూడియుఁ
తల నెరసియుఁ ఊఁతకోల ♦ తాల్చియు వృద్ధుం
డిల నాశ విడువఁ డయ్యది
తలపోయుచు మోక్షమందఁ♦దలఁపుము మూఢా!

తరణి వెనుక, ముం దనలము
బొరయుచుఁ జుబుకమ్ము జాను♦వుల నిసి నిడికొం
చరచేతఁ బిచ్చమున్ గొను
తరుతలవాసికిని యాశ ♦ దలఁగదు మూఢా!

సుమతి:—

హరిగీతాపారాయణ
హరినామసహస్రపఠన ♦ హరిభజనమ్ముల్
ధర సుజనమైత్రి దీనుల
నరయుట యివి ముక్తిఁగూర్చు♦నట్టివి మూఢా!

ఈధర శంకరశిష్యో
ద్బోధిత వైయాకరణుఁడు ♦ పూర్తిగ తత్త్వాం
బోధిన్ మునుగుచుఁ దేలుచు
శోధితసత్కారణుఁడయ్యెఁ♦ జోద్యము మూఢా!

గురుశంకరశిష్యుల మం
జరికాస్తోత్రమును పట్టి♦సపువంశజుఁ డి
ధరఁ దెనిఁగించెన్ యువవ
త్సరమున శ్రీరామమూర్తి♦ చదువుము మూఢా!

---


# వీణ

తెనుగు మాసపత్రిక

సాలుచందా డిశెంబరువరకు రు **2** లు

తేలప్రోలు - కృష్ణాజిల్లా.

# ప్రతిభ

త్రైమాసపత్రిక

సంవత్సరచందా రు **2** లు

నవ్యసాహిత్యపరిషత్తు, గుంటూరు.

# నిరక్షరత్వ నిర్మూలనము
# అయిదు సంవత్సరాల కార్యక్రమము

శ్రీ గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు ఎం. ఏ. (ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘాధ్యక్షులు.)

దేశదుస్థితికి కారణము లనేకములుండగలవు. కాని అజ్ఞానము మూలాధారకమైన కారణము. అది నశించిన ఇతర కారణములు నశించుటకు మార్గమేర్పడును.

* * * *

మన దేశమునుగురించి వ్యవహరించు వారందరును దారిద్ర్యమును నిరుద్యోగమును ఋణబాధయు మనలను పీడించుచున్నవని గట్టిగా చెప్పుదురు. ఇట్టి దుస్థితి కలుగుటకు మూల కారణము మాత్రము ఇప్పటి కింకను ప్రబోధకుల హృదయములకు తట్టినట్లు కానరాదు.

* * * *

ఈ దినము అన్ని జీవితశాఖలలోను మనము ప్రపంచములో నొక యంగముగా ప్రవర్తింపవలసియున్నది. మన కే ప్రత్యేకత్వమును లేదు. వ్యవసాయదారుడు, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, నేతగాడు, కవి, గాయకుడు, చర్మకారుడు, వ్యాపారస్థుడు ఎల్లరును తమతమ జీవితములలో పలుదేశముల పోటీకి సంఘర్షణకు నిలిచి మనుగడ జరుపుకొనవలసియున్నారు.

* * * *

మనకమ్మరిచేయు మేకు మనము కొనము. ఏజర్మనీకమ్మరిచేసిన మేకో మనకు శరణ్యము. మననేతగాడు సృష్టించిన వస్త్రము మనకు పనికిరాదు. జపానుగుడ్డలు మాంచెస్టరుబట్టలు పవిత్రములైనవి. మన సూరయ్య కుట్టిన చెప్పులు మనము పరిహరించుచున్నాము. జపానుదేశము 'పంపు షూ'లు తొడుగ నారంభించినాము. మన మంగలిసన్నాయి మనచెవి కింపు కొల్పుటలేదు. ఇటలీబ్యాండో ఇంగ్లాండుగ్రామఫోనో మంత్రపుష్పోచ్చారణకు కూడ మన నెత్తి కెక్కినవి. తుదకు బొంబాయివంటి పట్టణములలో దక్షిణాఫ్రికానుండి దిగుమతి అగు బత్తాయికాయలు విరివిగా ఖర్చగుచున్నవి. ఆస్ట్రేలియాడెన్మార్కుల జున్ను వెన్నలు దేశమంతట రైల్వే ప్రయాణికులలో పైదర్జాలవారు పరమపదార్థమని భుజించుచున్నారు. దేశమంతట స్విడ్జరులండు పాలడబ్బాలు పసిపిల్లల గొంతుకలలో పోయుచున్నాము. కాఫీ తేనీళ్ళకు వినియోగించుటయు లేకపోలేదు.

* * * *

ఇంతటికి కారణము ఇతర దేశములలో వ్యవసాయదారుడు, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, నేతగాడు, చర్మకారుడు ఇత్యాదులందరును సామాన్య విద్యను, తమవృత్తివిద్యను గొప్పగొప్ప పరిశోధనఫలితములతో కూడ నేర్చి, ఆ వృత్తులలో నుండు మనవారి నందరిని ఓడగొట్టుటకు అది వినియోగించుచున్నారు. రుష్యావంటి దేశములో బిడ్డపుట్టుటతోనే స్త్రీ గాని, పురుషుడు కాని ఎన్నెన్నిశాఖలుగా ఎంతవిద్యనేర్చుకొనుటకు ఆబిడ్డ కవకాశము కలదో అట్టి అవకాశములనన్నిటిని అక్షరాభ్యాసము మొదలుకొని కూలంకషపాండిత్యసంపాదనవరకు రాష్ట్రపుఖర్చుమీద అన్నముపెట్టి, గుడ్డఇచ్చి, అవకాశములు కల్పించి నేర్పించుచున్నారు. ఇంత సున్నితముగ తయారగు కర్మకరులతో సర్వే సర్వత్ర డీకొన

వలసిన మన వృత్తిజనమునకు విద్య ఏర్పరచక పోవుటయే గాక, మంగలికి చదువా? మాలకు చదువా? యని హేళనగ తోసిపుచ్చి, ఆర్థికముగ ఒక్క ఇంగ్లండునకే గాక, జర్మని, జపాను, ఆస్ట్రియా, ఇటలీ, జుగోస్లేవియా, అమెరికా మున్నగు అన్నిరాష్ట్రములకు మనము దాసత్వము చేయుచున్నాము.

* * * *

కాబట్టి మనసమస్యలు తీరవలెనంటే అన్ని ఉపాయాలకంటె పరమోపాయము ఉచిత విద్య బీదలకందరికి ఉత్తమమైన అంతస్తువరకు నేర్పుట తప్ప మరొకటి కనిపించదు. ఇది మహాజనమే వోటుమూలకముగా గట్టిగా కోరితేగాని ఎవ్వరును తలపెట్టునట్లు తోచదు.

* * * *

ఈకారణముచేతను, దేశసౌభాగ్యమును నిర్ణయించే రాజ్యాంగము అటువంటి వోటువల్లనే ఏర్పడునుగాని ఇంకొకవిధమైన వోటువలన ఏర్పడదని సర్వసామాన్యముగా అంగీకరింపబడియుండుటచేతను, అట్టి వోటు ప్రజాసామాన్యములోనియుక్తవయస్సు కలిగిన స్త్రీకిని పురుషునికిని కలిగే ఉపాయము ఏదైన కలదా? యని ఆలోచించుట సంభవించినది.

* * * *

ఈదక్షిణరాజధానిఅదృష్టముకొలది మన కోస్తాప్రభుత్వమువారు అక్షరజ్ఞత కలిగితే వోటు హక్కిచ్చుటకు సిద్ధపడినారు. నమూనా పూర్తిచేయు అక్షరజ్ఞత అర్హగుణముగా నియమించినారు. అందుచేత గ్రంథాలయముల మూలమున ప్రజాసమూహమునకు వోటువిషయములో మహాసేవచేయుచు, మనముతలపెట్టు విజ్ఞానవ్యాప్తికి సాధనమును సాధించు అవకాశము తలవనితలంపుగా మనకు కలిగినది.

* * * *

ఈకొత్తవిధానము ననుసరించి మొదటి ఎన్నికలు వచ్చేఫిబ్రవరిలో జరుగనున్నవి. ఇదివరలో అక్షరజ్ఞులైనవారిచేత దరఖాస్తులు పెట్టించే ప్రయత్నములోనే ప్రజాసేవకులు కొరవడిరి. దీనికి కారణము ఈవిషయమును పార్టీదృష్టితో చూచుటయేనని నాఊహ. ఆదృష్టిని మరల్చి ప్రజల భావిభాగ్యమును ఆలోచించి గ్రంథాలయములు పనిచేయునెడల 1942 సంవత్సరములో మరల ఎన్నికలు వచ్చేలోగా వోటులేని యుక్తవయస్కులగు స్త్రీపురుషులు లేరనిపింపవచ్చునని నా నమ్మకము.

* * * *

నిజముగా మనప్రజలను అక్షరజ్ఞులను చేయుటకు గ్రంథాలయములు పూనుకొనిన ఆరుమాసములే చాలును. కాని అనుకొన్నంతసులభముగా పని ఎప్పుడును కాదు. ప్రతిగ్రామములోను గ్రంథాలయము లేదు. ఉన్నగ్రంథాలయములకంతట ఉత్సాహమును చాలదు. ఉత్సాహము పుట్టించుటకును, క్రొత్త గ్రంథాలయముల నేర్పరుచుటకును నిరంతరము సేవకు పూనేకొందరైనను పని ప్రారంభించినయెడల అయిదు సంవత్సరములలో చాల ఎక్కువపని అగునని నాకు విశ్వాసమున్నది.

* * * *

నిరుద్యోగులుగానుండు స్కూలుఫైనల్లను, ఇంటర్మీడియేట్లను, బి.ఏ. లను ఎం.ఏ. లను తాము నిర్వహింపలేని వ్యవసాయమునకును, పరిశ్రమలకును త్రిప్పుటకు ఆలోచించుటకంటె, వారికి తగిన శిక్షణ మిచ్చి ఈఉద్యమములో ప్రవేశపెట్టుట

ఉత్తమమార్గమని నాకు తోచుచున్నది. ఇతరులీపరిశ్రమను సాగించినను సాగింపక పోయినను స్వతంత్రులైన నిరుద్యోగయువకులు జట్లుజట్లుగా నేర్పడి గ్రాంటుపాఠశాలలు పెట్టుకొని, అందులోని ఆదాయముతో తృప్తిపడుచు తమపరిసరములలో నిరక్షరతను బాపునట్టిప్రయత్నము చేయుటకు కొంత అవకాశమున్నది.

* * * *

ఈ పనికి పూను ప్రతిగ్రంథాలయ నిర్వాహకులును తమ ప్రాంతములో వీథిని వీథిని ప్రత్యేకపఱచి, ఒక్కొక్కరుగా, ఒక్కొక్కవీథి నిర్వహణభారము పెట్టుకొని, ఆవీథిలో అక్షరములు ఎరుగనిస్త్రీపురుషుల జాబితాలను సమగ్రముగ తయారుచేసికొనవలెను. పత్రికలను, పుస్తకములను వీలైనప్పుడెల్ల వారికి చదివి చెప్పుచుండవలెను. అక్షరజ్ఞానవలన కలిగే వోటుహక్కును వారికి బోధింపవలెను. ఈ విధముగా వారియందు అక్షరజ్ఞతకు సుముఖత్వము కల్పించి రాత్రిపాఠశాలకు వారు హాజరగునట్లు చేసియో, ప్రత్యేకప్రయత్నముచేసియో వారిని అక్షరజ్ఞులను కావింపవలెను. వ్రాయుటకంటె చదువుట నేర్పించుట తెలుగుభాషయందు సులభము. గుండ్రని ఆకృతిగల అక్షరముల భాష కాబట్టి మనఅక్షరముల సొంపే ప్రజల నాకర్షించును. ఆకర్షణముతో వ్రాయవలయునను కుతూహలమును పుట్టగలదు. ఎక్కువ వివరములు తెలిసికొనగోరువారు నాకు వ్రాయవచ్చును. తెలుగుదేశములో గ్రంథాలయములు ఉత్తమముగా పనిచేయుచుండు ఒకటి రెండు ప్రాంతములయందు ఈప్రయత్నము వెంటనే ఆరంభించుటకు ఉద్దేశించినాము. అట్టి ఆరంభము చేయదలచుకొన్న యితరులును నాకు వ్రాసినయెడల అవకాశము ననుసరించి నేను వారిని స్వయముగ కలసికొని తగిన సలహాల నొసంగుటకు సిద్ధముగానున్నాను. త్వరగానే బెజవాడలో స్థాపింపదలచిన గ్రామసేవాశిక్షణనిలయమునందు ఈవిషయము ప్రత్యేకముగ నేర్పుటకుకూడ ప్రయత్నింపగలము. అయిదుసంవత్సరములలో ఆంధ్రభూమి ఈఉద్యమమును సాగింపగలదేని, ఇతరోద్యమము లన్నిటిని సాధించు శక్తిని ప్రజలకు ప్రసాదింపగలదని కన్నులుగలవారు కాంచగలరు. ఇది తెలివిగలవారికి తేటపడగలదు. శుభంబగుగాక!

## ప్రకృతి - బెజవాడ

ఆరోగ్యవిషయక సచిత్ర వైద్యమాసపత్రిక.

మానవుడు ఆరోగ్యవంతుడుగ నుండుట, రోగములు రాకుండుట, నీరు, గాలి, మట్టి, సూర్యకిరణ, స్వాభావికాహార, యోగవ్యాయామ, ఉపవాస, విద్యుత్కాంతశక్తి, మొదలగుయని సహాయమున రోగములను దుర్చువిధానములను తెలుపును. చందాదారులకు ప్రకృతి వైద్యపుస్తకములన్నియు తగ్గింపు ధరల కియబడును. చందా రు 3 లు

## శ్రీరామచరిత్ర

(సవ్యాఖ్యానము)

కర్త: గా. హరిసర్వోత్తమరావు, ఎం. ఏ.,

భాగవతములో పోతనామాత్యుడు వ్రాసిన రామచరిత్రకు ఇది చక్కనివ్యాఖ్యానము. టీకాతాత్పర్యములు గాక కథాసంవిధానము, కవిహృదయవివరణము, వ్యాకరణాంశములు, ఇతర విజ్ఞానవిషయములు అన్నియు సమకూర్పబడినవి. వెల రు 0-8-0.

కావలసినవారీదిగువచిరునామాకు వ్రాయుడు.

గా. హరిసర్వోత్తమరావు, ఎం, ఏ.

గవర్నరుపేట - బెజవాడ.

# తిరువాన్కూరు రాజ్యము - దేవాలయ హరిజన ప్రవేశము

శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రిగారు

తిరువాన్కూరు అనంతశయనుని రాజ్యము; మిక్కిలి పూర్వాచారపరాయణులకు పట్టుకొమ్మ; అందులో కులభేద, మతభేదములు నిశ్చింతగా కాపురముండెను. అస్పృశ్యత, అదృశ్యత, అసమీపత, అవాచ్యత - ఇన్ని అచ్చట మాల మాదిగలను అణగద్రొక్కుచుండెను

హిందూమతము మార్చి మునల్మానులైరి కొందరు; క్రైస్తవులైరి మరికొందరు; విద్యాధికులైరి స్త్రీపురుషులు; ధనాఢ్యులైరి; ఆరోగ్యవంతులైరి; పూర్వపు వృత్తుల వీడిరి; సర్కారు ఉద్యోగములగైకొనిరి; న్యాయవాదులైరి; ఉపాధ్యాయులైరి; కాని ఆయాజాతులకు పాతపిశాచము వదలకుండెను.

ఆదిశంకరులు పుట్టి వేయి సంవత్సరముల నాడు అద్వైతమును బోధించిరి; అనంతశయనుడు మేల్కొనలేదు. శ్రీరామానుజులు పుట్టి ఏడువందలనాడు భక్తిప్రపత్తుల బోధించె; కొన్ని దేవాలయములలో అందరకు దర్శనమిప్పించె; కాని కనుబొమ్మలవలె అవి పెరుగలేదు. ఇతరమత కర్తలు క్రొత్తవి నిర్మించిరి.

నేటికీ అద్భుతకార్యము సంఘటించెను. అనంతశయనము రాజుగారు తన పుట్టినదినము పండుగనాడు పుణ్యముచేసితనపాలనములోనున్న దేవాలయములన్నిటిలో హరిజనులకు ప్రవేశమిచ్చె. శ్రీ ఠక్కరు బాపా సంచారముచేసె; శ్రీబిర్లాకోటీశ్వరుడు సంచారము చేసె; శ్రీమహాత్మాజీ సంచారముచేసె; ఈ సామాన్యమానవాతీత కార్యమునకు సంఘటనకర్త పరాత్పరుడే; నిస్సందేహము. కాలస్వరూపుడైన కరుణామూర్తి గాంధి ముఖతః మ్రోయించిన వేణుగానము ఫలించెను. అనేకశతాబ్దములనుండి పెరుగుచున్న అసమానత్వభారమునుండి హరిజనులు విడివడిరి. మానవుడు నిరాశ చెందు సమయమున దీన బాంధవుని కరుణ వెల్లివిరిసె.

పంచఘోషలు పటాపంచలగును; స్త్రీలకు, మానవులకు, దేవునకు, మంత్రములకు, ఉదకములకు - ఐదుగురకు ఘోషాపరదాపెట్టిరి; అయిదును అడుగంటును.

ఇది మతవిషయమనిరి మహాత్ములు; హరిజనులు పరమతములో కలిసినయెడల, ఇన్నిరోజులనుండి అపరాధముచేసిన సవర్ణులకు పశ్చాత్తాపము నొందుటకు, పరిహారమిచ్చుటకు తావుండదనిరి గాంధీజీ; అన్యమతములవారు హరిజనులను తమలో కలుపుటకు చేసెడి పోటీలు, చూపెడి ఆకర్షణము వికారములు 'అగ్లీ' అనిరి బాపుజీ.

తిరువాన్కూరు మార్గము కొచ్చిన్, మైసూరు, బరోడా మొదలగు ప్రభుత్వములు అనుసరింతురుగాక! నాగరికత నొందిన ప్రజలు అన్యాయమునకు ఒడిగట్టక, తమ పరిపాలనములోనున్న పాత ఆలయములకు క్రొత్తజీవనము ఇత్తురుగాక! సేగాంలో ఇమిడియున్న ఋషియొక్క మహాతపము నిరుపయోగముకాదని యువకులు, పెద్దలు తెలిసికొందురుగాక!

ఆనంద మెవరిది? రాజుదా తెరిచినందుకు? హరిజనులదా నూత్నస్వత్వము సంపాదించినందులకు? మహాత్మునిదా, ఘోరతపస్సుచే తమోభంగ మొనర్చి స్వాతంత్ర్యభానుని పిలిపించినందులకు?

భక్తిశ్రద్ధలకొలది ఎవరికివారు నిర్ణయించుకొని తృప్తిచెందవచ్చును.

# తిరువాన్కూరు సంస్థాన సంగ్రహ చరిత్ర

శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రిగారు

హిందూదేశమందలి స్వదేశసంస్థానములు, పెద్దవానిలో పెద్దదై 82,698 చ॥ మైళ్లు వైశాల్యమును, 1,44,36,148 జనసంఖ్యయు కల హైదరాబాదు సంస్థానము (దాదాపు ఇటలీరాజ్యమంత పెద్దది) మొదలుకొని, చిన్నవానిలో చిన్నదై రాజపుత్రస్థానములోని 19 చ॥ మైళ్ళ వైశాల్యమును, 2791 జనసంఖ్యయుంకల లావాసంస్థానమువఱకు, మొత్తము 562 కలవు. స్వదేశ సంస్థానముల మొత్తము వైశాల్యము 7,11,032 చ॥ మైళ్లు; జనసంఖ్య 8,13,10,835, ఈ సంస్థానము లన్నిటిలోను నాగరికతలోగాని, విద్యలోగాని, పరిశ్రమలలోగాని, పరిపాలనములోగాని, సర్వవిషయములలోను బ్రిటిషు ప్రభుత్వముకన్న ముందంజవేయుచున్న సంస్థానములు ముఖ్యముగా నాలుగు- మైసూరు, బరోడా, కొచ్చిన్, తిరువాన్కూరు.

## నైసర్గిక స్వరూపము

తిరువాన్కూరు రాజ్యము హిందూదేశపు దక్షిణపు కొసనున్నది. దీనినే అనంతశయనము అనికూడ అందురు. తూర్పున తిరునల్వేలి మధురజిల్లాలును, దక్షిణమునను పడమరను అరేబియాసముద్రమును, ఉత్తరమున కొచ్చిన్, బ్రిటిషు మలబారుజిల్లాలును తిరువాన్కూరురాజ్యమునకు సరిహద్దులు. చరిత్రప్రసిద్ధమైన కన్యాకుమారిఅగ్రము ఈ సంస్థానములోనిదే. తిరువనంతపురము (ట్రివేండ్రము) ఈ రాజ్యమునకు ముఖ్యపట్టణము. ఈ సంస్థాన వైశాల్యము 7,625 చ॥ మైళ్లు. ఇందు సగముకంటె హెచ్చుభాగము అడవులతోను, ఉప్పుటేళ్ళతోను నిండియున్నది. జనసంఖ్య 50,95,973; సాలుసరి ఆదాయము రు 2,32,88,000. ఈరాజ్యమున జనసమ్మర్దము హెచ్చు. ప్రజలు కష్టజీవులు; కష్టపడి పనిచేయుట కలవడి, చిత్రకళలపట్లను పరిశ్రమలపట్లను అభిరుచికలవారు.

## ప్రాచీన రాజవంశములు

ఇప్పుడు ఈరాజ్యమునకు ప్రభువు శ్రీ శ్రీ శ్రీ పద్మనాభవంశపాల శ్రీరామవర్మకులశేఖర కిరీటపతి మన్నె సుల్తాన్ మహారాజరాజ రామరాజ బహదూరు సెంషేరు జంగు ఎలియరాజాగారు. వీరివయస్సు 25 ఏండ్లు. ఈయన విద్యాధికులు. దక్షిణఇండియాలోని ప్రాచీనములగు పాండ్య, చోళ, చేరవంశజుల రాజ్యములలో ఇప్పటికి మిగిలినది చేరవంశజుల రాజ్యమైన తిరువాన్కూరు సంస్థానమొకటియే.

## సహజసంపద

మనుష్యుల అందమునకేమి, వృక్షముల సౌందర్యమునకేమి, అడవులు, పర్వతములు, నదులు, సరస్సులు, సెలయేళ్ళు, కాలువలు మొదలగువాని సహజసంపదకేమి, భరతఖండమునందెల్ల ఎన్నదగినవి తిరువాన్కూరు, కాశ్మీర రాజ్యములు మాత్రమేనని బరోడా మహారాజుగారు తమ ప్రపంచపర్యటనముసందర్భమున తెలిపియున్నారు.

## దేవాలయ ప్రతిభ

ఈ రాజ్యములో ప్రసిద్ధిగాంచిన పురాతన దేవాలయములు పెక్కులుకలవు. శ్రీ కన్యాకుమారిఆలయమును, అనంత పద్మనాభస్వామి ఆలయమును ముఖ్యములు. వందలకొలది ప్రసిద్ధిచెందిన యితరాలయములున్నుకలవు. ఆలయములలో హెచ్చుభాగము సంస్థాన ప్రభుత్వమువారి అధీనములోనే యున్నవి. ఈ సంస్థాన ప్రభుత్వము శ్రీఅనంత పద్మనాభస్వామివారిపేర నడపబడుచున్నది. అచ్చటినాణెములు, ప్రభుత్వపతాకములు, కార్యాలయములు, పోలీసు మిలిటరీ ఉద్యోగస్థుల పతకములు - వీని అన్నిటిపై అనంత పద్మనాభుని చిహ్నమగు శంఖముద్ర ఉండును. అనంత పద్మనాభుని దేవాలయపు జవాహారీ అనగా బంగారు వజ్ర వైడూర్యములనగలును, సువర్ణ రజతపాత్రములును కోట్ల రూప్యముల విలువ గలిగినవి ఉన్నవి.

## దైవ బ్రాహ్మణ భక్తి

అనంత పద్మనాభుని దాసుడుగా ప్రభువు తిరువాన్కూరు రాజ్యమును పరిపాలించుచు, రాజ్యమువలనవచ్చు ఆదాయవ్యయముల నివేదికలను, ప్రజల కష్టసుఖములను దేవాలయములో శ్రీ పద్మనాభస్వామివారి సాన్నిధ్యమున నివేదించు ఆచారము కలదు. ఈ రాజ్యములో బ్రాహ్మణ భక్తి మెండు. బ్రాహ్మణులకు దేవాలయములలోను, సత్రములలోను ప్రభుత్వపు ఖర్చుపై నిరతాన్నదానము చేసి, దక్షిణలనిచ్చు ఆచారముకలదు. దేవస్థానములు, భోజన సత్రములు వగైరా అజమాయిషీకి ప్రత్యేక ప్రభుత్వశాఖ కలదు. ఈ శాఖక్రింద సాలీనా కొన్ని లక్షల ద్రవ్యము వ్యయమగుచున్నది

## నిమ్నజాతుల అధోగతి

ఈరాజ్యములో ఉత్తమజాతివారుగ ఎంచబడుబ్రాహ్మణులు, నాయర్లు మొదలగువారుతప్ప ఇతరజాతులవారు-

అందులో ముఖ్యముగ ఎజావా, తియ్యా అనే పంచమ జాతులవారు కొలదిసంవత్సరముల క్రిందటి వరకు సాంఘిక జీవనములో నీచముగా చూడబడు చుండెడివారు. ఇప్పటి పాలకులైన మహారాజ రామవర్మగారు మైనరుగ నున్నకాలములో వారితల్లి మహారాణి సేతుపార్వతీబాయి గారు రాజ్యపరిపాలనకు గడంగిననాటి నుండియు తిరువాన్కూరు రాజ్యము సర్వతోముఖముగ అభివృద్ధిగాంచుచున్నది. ఈమె మహాత్ముని మన్ననలకు పాత్రురాలైనది.

## విద్యావ్యాప్తి

తిరువాన్కూరురాజ్యములోఅనాదిగా ఆస్తిగౌరవముల హక్కులు స్త్రీలవే. విద్యావిషయములో ఈ సంస్థానము ఇతర సంస్థానములకంటెను, బ్రిటిషు ఇండియాకంటెను కూడ అగ్రస్థానము వహించియున్నది. ఈ రాజ్యములో నూటికి 41 మంది పురుషులు, 17 మంది స్త్రీలు చదువుకొన్నవారు కలరు. బ్రిటిషు ఇండియాలో చదువుకొన్నవారు నూటికి 14 గురు పురుషులు, ఇద్దరు స్త్రీలుమాత్రమే. ఈ సంస్థానపు రాబడిలో నూటికి 20 వంతులు విద్యక్రింద వినియోగింపబడుచున్నది. ప్రతి రెండు చదరపు మైళ్ళకు ఒకపాఠశాల చొప్పున కలదు.

## వ్యాపారపరిశ్రమలు

తిరువాన్కూరురాజ్యమున పెట్టుబడిదారులగు భాగ్యవంతులసంఖ్య చాలతక్కువ; సామాన్యస్థితిపరుల సంఖ్య హెచ్చు. ఈ రాజ్యమున పారిశ్రామికాభివృద్ధికి అవకాశములు హెచ్చుగా ఉన్నవి. అభ్రికము, సీసపురాయి మొదలుగాగలఖనిజసంపద అధికముగకలదు. కొబ్బరినార, దంతము, జరీ, నేత పరిశ్రమలు అక్కడ ముఖ్యములు; చేపల తేనెటీగల పరిశ్రమలుకూడ అభివృద్ధిలోనున్నవి. ఈరాజ్యములో ప్రతిసాలున జరుగుచున్నవ్యాపారపు ఎగుమతి దిగుమతుల మొత్తము పదునారుకోట్ల రూపాయలకు మించియున్నది. ఇటీవల రబ్బరు, సిమెంటు, గాజు, పింగాణి, పట్టు, కాగితముల పరిశ్రమలుకూడ సంస్థానప్రభుత్వమువారు ప్రారంభించినారు. పరపతిసంఘముల - బ్యాంకుల అభివృద్ధికూడ బాగుగనున్నది. రాజ్యమంతట విద్యుత్ శక్తిని (ఎలక్ట్రిసిటీ) సరఫరా చేయుటకు ప్రయత్నములు జరుగుచున్నవి. ఇప్పటికి నూరు మైళ్ళపొడవుగల ఇనుపదారి కలదు. ఈ రాజ్యమున పడవల సౌకర్యములు మెండుగనున్నవి. ఇప్పుడున్న ఉప్పుటేరులను, కాలువలను బాగుగ మరమ్మతు చేయబడుచో నౌకావ్యాపారము ఇంకను బాగుగ సాగగలదు. రైల్లకంటెను, మోటార్లకంటెనుకూడ పడవలే ఈరాజ్యమున రాకపోకలకు ఎక్కువ ఉపయోగముగనున్నవి. ఏలకికాయలు, మిరియములు, టేకుకలప - వీటికి ఈరాజ్యము మిక్కిలి ప్రసిద్ధి.

## పరిపాలనావిధానము

తిరువాన్కూరుప్రభుత్వమునకు రెండుశాసనసభలుకలవు. అధికసంఖ్యాకులచే ఎన్నుకొనబడినప్రజాప్రతినిధులు ఇందు సభ్యులు. ఒకసభ శ్రీ మూలం పాప్యులర్ అసెంబ్లీ; రెండవది చిత్రస్టేటు కౌన్సిల్; స్థానికసంస్థలు, మ్యునిసిపాలిటీలు, పంచాయతీలు, జిల్లాబోర్డులు ప్రజాప్రతినిధులవల్లనే పరిపాలింపబడుచున్నవి. ఈ రాజ్యమున వైద్యారోగ్యశాఖల వారియేర్పాట్లు ప్రశంసనీయములు. చక్కనిరోడ్లుకలవు. ప్రభుత్వములోని అన్నిశాఖలును బ్రిటిషు ఇండియాలోని పరిపాలనాపద్ధతులననుసరించి నడుపబడుచున్నవి. మహారాజునకు ఒక దివానును, ఇద్దరు ప్రభుత్వకార్యదర్శులును పరిపాలనయందు సహాయపడుచుందురు. ఈ రాజ్యము నాలుగు జిల్లాలుగ విభజింపబడినది. నలుగురు కలెక్టర్లు కలరు. ఒక ఉన్నత న్యాయస్థానము (హైకోర్టు) కలదు. సంస్థానముయొక్క రక్షణమునిమిత్తము 1500 మందికాల్బలము (ఇన్ఫెంటిరీ) కలదు. సర్ సి. పి. రామస్వామి అయ్యరుగారుఈసంస్థానమునకిపుడుదివానుగా ఉన్నారు.

## సంస్కరణము

మహారాణి పార్వతీబాయిగారి పరిపాలనకాలములో ఈ రాజ్యములోని ప్రభుత్వపుసత్రములు, బాటలు, చెరువులు, బావులు, పాఠశాలలు మొదలగు అన్నిటియందును సవర్ణులతోబాటు అవర్ణులకుకూడ సమానహక్కులు కలుగజేయబడెను. ఇప్పుడు శ్రీ మహారాజరామవర్మగారి పుట్టినదినముసందర్భమున (గత నెల 13వ తేదీని) సంస్థాన ప్రభుత్వపు అన్ని దేవాలయములలోను అవర్ణులకుకూడ సవర్ణులతోబాటు ప్రవేశమీయబడెను. భరతఖండమునేలిన రాజులలో అశోకచక్రవర్తితదనంతరము ఏరాజుగాని, ఇట్టి మహాసంస్కరణము చేసియుండలేదు.

శ్రీమతి భండారు అచ్చమాంబగారి లేఖలు:

# ఆత్మారోగ్యము అవశ్యానుసరణీయము

[శ్రీమతి భండారు అచ్చమాంబగారి ఉత్తరము మఱియొకటి ఈ క్రింద ప్రకటించితిమి. ఈ ఉత్తరమును వారు ౧౯౦౨ వ సంవత్సరమున వ్రాసిరి. అనఁగా నేటికి ౩౨ సంవత్సరములైనది. శిష్టులు ఒకరికొకరు జాబులు వ్రాసికొనుటయందుకూడ ఎట్టి గ్రాంథికభాషను వాడుచుండినదియు దీనివలన స్పష్టముకాఁగలదు. నేడు రమారమిగా అన్నిపత్రికలును గ్రాంథికభాషనువదలి వాడుకభాషనే ముఖ్యవ్యాసములను వ్రాయుటలోకూడ ఉపయోగించుచున్నవి. ఏవో కొన్నిపత్రికలుమాత్రము తాము వ్రాయునది గ్రాంథిక మనుకొని అపభ్రంశములు వ్రాయుచున్నవి. ౩౦ సంవత్సరములలో ఇంతటి పరివర్తనము జరుగుటయే ఆంధ్రులు సజీవులై యున్నారనుటను సూచించును. నాఁటి సాంఘికస్థితి భాష పొందినపరిణామ మంతటి పరిణామము పొందినట్లు కానరాదు. ఇది ఆంధ్రులు గుర్తింపఁదగిన విషయము.]

౬౦.

పచమఢి

శ్రీమతిసౌభాగ్యవతి యగు
కొ॥ సీతమ్మ అక్కగారి
సముఖమునకు:—

తమ ప్రియసహోదరి మిక్కిలి నమ్రతతో విన్నవించు విజ్ఞాపన.

ప్రియసఖీతిలకమా!

తామీనెల ౧౪ వ తేదీని నాయందలి ప్రేమాధిక్యతచే వ్రాసిన సదుత్తరరాజంబు నిన్ననే నన్నుఁజేరెను. దానిఁ జదివినతోడనే నా మనంబునం దేకకాలమునందే ఖేదమోదములుద్భవిల్లినవి. అది యెట్లన నాచెలికి నాయందుగల అనిర్వాచ్యమైన దృఢానురాగము వెల్లడియగుటవలన నధికమోదమును అట్టి సఖీదర్శనలాభం బింతలో నాకు దొరుకుట యసంభవంబని తెలిసినందున నమితఖేదంబునుం గలిగెను.

మిత్రశ్రేష్ఠమా! మీవ్యాధి కుదరనేలేదు గదా? అయ్యో! మనము తలఁచిన యల్పకార్యములకే మన వ్యాధులు ఆతంకము కలుగఁజేయుచున్నవి. అయినను మనము శ్రద్ధవహించి తగిన యౌషధములు సేవించి యా వ్యాధులను బారదోలి కర్తవ్యమును నతిత్వరితముగా నెరవేర్పఁదలఁపవలయును. ఇతరుల వ్యాధినిగురించి మిగుల శ్రద్ధవహించుటయును మనకు నారోగ్యముగా నున్న సమయమునం దందునకై శ్రద్ధచేయకుండుటయును గలదు. ఇదియొకగొప్పనేరమే యని పెద్దలు నుడువుదురు. ప్రజల ననేకులను సుఖులనుగావించి తనభార్యాపిల్లలను గష్టపెట్టిన వాని కెట్టిపాపముకలుగునో తనశరీరారోగ్యమును గురించి పాటుపడని వారికి నట్టి దురితమే కలుగును. శరీరమే బాగులేకున్న నేసత్కార్యమును జేయుట సాధ్యముగాదు. ఇదియంతయుఁ దమకు నేను జెప్పనక్కరయే లేదు. కాని నాకుఁ దోచినసంగతినిఁ బ్రాణసఖికిఁ దెలుపకుండుట యుచితముకాదు గాన నింత వ్రాసితిని. నాప్రార్థన విని మీశరీరమునఁ గల వ్యాధికిఁదగిన యౌషధము నియమితకాలములయందు మఱవక త్రాగుచుండఁగోరెద.

ప్రాణమా! నే నీ నడుమ కార్యాంతమున గ్రామాంతరమునకుఁ బోయితిని. అచట నాకు

మిత్రలాభము కలిగినది. ఇదియుఁ బరమేశ్వర కరుణయే యని తలఁచెదను. నాకచట లభించిన చెలియ యిరువది సంవత్సరముల ప్రాయముగల యొక బ్రాహ్మణ వితంతువు. మిగుల సద్గుణవతి, విద్యావతి, విద్యాభిలాషిణియు నగును. కాని యామె తన విద్యనభివృద్ధిచేసికొనుటకు స్వాతంత్రతచాలక విచారముగా నుండును. భర్తృహీనలగు పుత్రికలకు విద్యాలాభమువలన నానందము కలుగఁజేయక జననీజనకులట్టివారికేక చదువేల యని తలఁచుట మిగుల వ్యసనకరముగదా!

ఆ గ్రామమునకుఁ బోయినందున నేనిదివఱకు వ్రాసిన సతినిగుఱించిన సంగతి స్వాంతము తెలిసెను. ఆస్త్రీ యట్లు మితిమీరిన కష్టముల ననుభవింపుచుఁ దన్నివారణ కేదేని యుపాయము నాలోచింపుచుండెను. ఇంతలో నామెతల్లి పొరుగింట కొన్నిదినములుండి కూతురినిఁ బంపుదురను నాసనువదలి యచట పరిచారికకుఁ గొంతధనము నిచ్చి యెటులనైనా నాబిడ్డనచటినుండి నాకడకు తీసికొనిరమ్మని చెప్పి తానచటనుండి బయలుదేరి తన గ్రామమునకుఁ బోయెదనని వియ్యాలవారికిఁ దెలిపి యదే గ్రామమున నింకొక పేటలో గుప్తముగా నుండెను. తదనంతరము కొన్నిదినములు గడచిన వెనుక నొకదినమునం దాచిన్నది బహిష్ఠయినందున నధిక యాచారవతి యగు నామెయత్త కోడలిని గదిలోనుంచక గదిపంచన గూర్చుండ నియమించి తాను జాగరూకురాలై కాచుచుండెను. ఇంతలో నాసతి బహిర్భూమికి నరిగి యచట నాదాసివలనఁ బోధింపఁబడి యప్పుడే తన తల్లిదగ్గర కరుగగా నామె తన బిడ్డను దీసికొని స్వగ్రామమునకరిగెను. ఈ కాంత విద్యావతి కాకున్నను బతి తన్నింత నిర్బంధముగా నుంచినప్పటికిని బహుదినములు విసుగుకొననైన విసుగుకొనక యుండెను గాని యట్టి నిర్బంధముతోఁ గూడ క్షుద్బాధయుఁ గలుగగా నందునకై సహింపక తుదికిటుల పోవలసినదాయెను.

మిత్రమా! యీనెల ౨ వ తేదీని నామనుమఁడగు చి॥ సుగుణభూషణరావున కుపనయనమగును. ఈ శుభదినంబునందు మీరును, శ్రీమతి సరసమాంబగారును నేనును గలసియుండవలయునని నా కధికయాసయుండెను గాని నాయందిప్పుడే సర్వేశ్వరుని కంతటి కృపగలుగుజాడ కానరాదయ్యె. ఈ పది పండ్రెండు దినములు నాకుఁ బనివలనఁ దీరదు. కాన నాయుత్తరమున కాలస్యమైనను తమరు నాయందనుగ్రహించి క్షేమసమాచారములు తెలుపుచుండగలరు. హిందూసుందరి పత్రికకు నిన్ననే యొక వ్యాసమువ్రాసి పంపితిని. మా అమ్మగారు నాగపురమునుండి వచ్చిరి. ఇంటియందలివా రందరు క్షేమముగా నున్నారు. సోదరీ! అఁడుతోఁబుట్టులులేని నాకు మీవంటి వారలే యక్కచెలియండ్రని నేననుకొనియెదను. ఏక గర్భవాసమున జన్మించినవారికంటెను స్నేహితులే యధికప్రీతిని గలిగియుందురు. కనుకనే జగదీశ్వరుడు నాకట్టి సహోదరులనేకలుగజేసినాఁడు. మీయత్తగారికిని యక్కగారికి నానమస్కారములుశ్రుతపరచునది. సత్యవతి క్షేమమును వ్రాయగోరెద.

చిత్తగించవలెను.

ఇట్లు తమ ప్రేమాస్పదురాలగు చెలి,

౨౦-౫-౧౯౦౨. భండారు అచ్చమాంబ.

# మోటారుచక్రముల ఎడ్లబండ్లు

శ్రీ ప్రొఫెసరు, జె. సి. కుమారప్పగారు.

మామూలు ఎడ్లబండ్లకుబదులుగా మోటారుచక్రములతో అమర్పబడినబండ్లు అక్కడక్కడ ఇప్పుడిప్పుడు ఉపయోగించుచున్నారు. మోటారుకారులు మొదలగు వాహనములవలన కలుగు విపత్తులటుండ, అజ్ఞానస్థితిలోనున్న భారతదేశపు బీదరైతులకు ఇందువలన మరియొక క్రొత్త విపత్తు వాటిల్లనున్నది.

మోటారుచక్రముల బండ్ల ఉపయోగమును ప్రోత్సహించువారు, ఆ బండ్లవలన ఎడ్లు తక్కువకష్టముతో ఎక్కువబరువును లాగగలవని ప్రచారము చేయుచున్నారు. పరీక్షించినగాని నిజము తేలజాలదు.

## ప్రయోగముల ఫలితము

హిస్సారుపట్టణములోని ప్రభుత్వ పశుశాలవారు ఇట్టి పరీక్ష చేసి ఫలితములను ప్రకటించియున్నారు. ౨౦౦౦ పౌనులు తూకముగల సరుకులను ఒక మామూలు కొయ్యచక్రములబండిమీదను, ఒక మోటారుచక్రములబండిమీదను ఎక్కించి, సమానమైన బరువుగల ఆ రెండుబండ్లను ఒకేజత ఎడ్లచే కంకరరోడ్డుమీద ౧౦ మైళ్లదూరము లాగించగా మామూలు కొయ్యచక్రములబండిని ౮ ౧౦ ౫ నిముషములలో లాగగలిగినవి; మోటారుచక్రముల బండిని ౧౦ ౨-౫ నిమిషములలో లాగగలిగినవి. మోటారుచక్రములవలన నూటికి ౨౭ ౧/౩ వంతులు పని కలసి వచ్చినట్లు తేలినది. మట్టిరోడ్డుమీద అదే పరీక్ష చేయగా మోటారుచక్రములవలన నూటికి ౨౫ ౧/౩ వంతులు పని కలసివచ్చినట్లు తేలినది.

## మామూలు ఎడ్లబండియే లాభకరము

మామూలు ఎడ్లబండి, ఎడ్లజతతోసహా సుమారు రు ౧౯౦/లు ఖరీదగును. మోటారు చక్రములకు రు ౧౫౦/లు అధికముగా వెచ్చింపవలసి యుండును. నూటికి నూరువంతులు అనగా రెట్టింపుపెట్టుబడివలన పనిలో నూటికి సుమారు ఇరువది అయిదు వంతులు అనగా నాల్గవవంతు మాత్రము కలసివచ్చినట్లు తేలినది. పెట్టుబడినిబట్టి లాభమును వ్యాపారదృష్టితో పరికించు నెడల ఏవ్యక్తియు ఇట్టి ఉపకరణములకు ఆశపడదు. ఒక్క మోటారుచక్రముల బండిఖరీదుతో రెండుమామూలు బండ్లు ఖరీదు చేయవచ్చును. పైగా మోటారుచక్రముల బండివలన పొందు నూటికి ఇరువది అయిదువంతులు హెచ్చు పనికంటె, రెండుమామూలు బండ్లవలన నూటికి నూరు వంతులు హెచ్చుపనిని పొందవచ్చును.

## కొయ్యచక్రములే హెచ్చుపని చేయును

మరొక అంశము కూడ గుర్తింపదగియున్నది. పైని వ్రాసిన విషయమంతయు మామూలు ఇనుప ఇరుసుగల ఇనుపపట్టాల కొయ్యచక్రముల బండ్లను గురించియే. మోటారు చక్రములు సులువుగా తిరుగుటకు రోలరు బేరింగులమీద అమర్పబడియుండును. మామూలుబండి చక్రములు కూడ అదేమాదిరి అమర్చిననే గాని రెండు రకముల చక్రములకు గల నిజమైన వ్యత్యాసము తేలజాలదు.

మైసూరుప్రభుత్వమువారు సెంట్రల్ ఇండస్ట్రియల్ వర్కుషాపులో ఈ పరిశోధనము చేసినారు. మోటారుచక్రముల బండికంటె రోలరు బేరింగులతో అమర్పబడిన మామూలు ఇనుపపట్టాల కొయ్యచక్రముల బండినే ఎడ్లు వేగముగా లాగగలిగినవి. అయిదుమైళ్ళ దూరముమీద మోటారు చక్రములబండి అయిదవవంతు సమయము వెనుకబడెను. ఈ రెండుబళ్ళకు తేడా చక్రములలో మాత్రమే ఉండెను– ఒకబండికి రబ్బరుచక్రములు, ఒక బండికి ఇనుపపట్టా కొయ్యచక్రములు. ఇందువలన రబ్బరు చక్రములు నిష్ప్రయోజనములని తేలినది. అట్టిచో పని తగ్గింపుకేనా రెట్టింపు హెచ్చు ఖర్చు పెట్టి రబ్బరుచక్రములను కొనుట?

## రబ్బరుచక్రములు మోటారుబండ్లకే తగును

సామాన్య జ్ఞానముగల ఏవ్యక్తికైనను సెంట్రల్ ఇండస్ట్రియల్ వర్కుషాపువారి పరిశోధనములవలన తేలిన సత్యము గోచరింపకపోదు. మోటారుబండ్లకు రబ్బరుచక్రములు ఉపయోగించుటకు రెండు ముఖ్యకారణములున్నవి. వేగముగా నడుపుటలో అదురుడువల్ల సున్నితమైనయంత్రముల భాగములు చెడకుండుట మొదటిది. ఎడ్లబండికి సంబంధించినంతవరకు ఇట్టి సున్నితయంత్రభాగము లేవియు లేవు; కనుక ఈప్రయోజనము వాటివిషయములో అనావశ్యకము. రెండవకారణము రబ్బరు మెత్తనిది; సాగే స్వభావముకలది. నేలమీద అదిమినయెడల మెరకపల్లములలో

కూడ కరచుకొని పట్టుపట్టును. అందుచేత జారిపోవు స్వభావములేదు. రబ్బరుచక్రములవలన భూమిపై చక్రముల రాపిడి హెచ్చని తెలియనగును. కాదని వాదించువారు ఒక మోటారుకారుకు ఇనపపట్టాలుగల చక్రములను తగిలించి నడపినయెడల బోధపడగలదు. ఇనపచక్రములు భూమిపై పట్టుపట్టవు; జారిపోవును; మోటారు కదలజాలదు. మోటారుబండి గంటకు ౩౦,౪౦ మైళ్ళవేగముతో పోవుచున్నప్పుడు రబ్బరుచక్రములు నేలకు కరచుకొని దానికి తగినపట్టును ప్రసాదించును; లేనియెడల చక్రములు నేలపై అంత వేగముగ దొర్లజాలవు. రోడ్డుమీద ఇనుపపట్టాల రాపిడికంటె రబ్బరుచక్రముల రాపిడి హెచ్చు. అందువల్లబండ్లలో ఇతర భాగములన్నియు ఒకేమాదిరిగున్నను రబ్బరుచక్రములుగలబండిని హెచ్చుబలము ఉపయోగించి లాగవలసియుండునని మైసూరుపరిశోధనవలన ఋజువైనది. హిస్సారు పరిశోధనలనుంచికూడ ఇదే నిర్ణయమునకు రావచ్చును. ఎగుడుదిగుడుగాను, గరకుగాను ఉన్న రోడ్లమీద ఎడ్లబండ్లకు రబ్బరుచక్రముల ఉపయోగము మరింత తక్కువని తేలినది.

## హెచ్చుఖర్చేగాక అదనపుపన్ను

రాపిడివలన మెత్తనివస్తువు అరిగినంత త్వరలో గట్టివస్తువు అరుగదు. ఇనుపపట్టాలు రాతిమీద పనిచేయునప్పుడు రాయి అరిగినంత ఇనుము అరుగదు. కాని రాతిమీద రబ్బరు పనిచేయునప్పుడు రబ్బరే హెచ్చుఅరుగును. ఒకే పరిమాణముగల పనిని ఇనుపపట్టాల బండిమీదను, రబ్బరుచక్రములబండిమీదను చేసిన యెడల రబ్బరుచక్రములు ముందుగా అరిగిపోవును. అందువలన ఆచరణలో రబ్బరుచక్రములు వాడుటవలన అరుగుదలయు, మరమ్మతుల ఖర్చుల భారమును బీదవారిపై హెచ్చుగా పడును; రబ్బరుచక్రములవల్ల రోడ్లు అంతత్వరగా చెడిపోవు. కనుక ప్రభుత్వమునకు మాత్రము రోడ్లమరమ్మతు ఖర్చులు కొంతవరకు తగ్గగలవు. బండ్లవారిపై ఇది ప్రత్యక్షపు అదనపుపన్నుగా పరిణమించును.

## ధనికునకు సహాయము దరిద్రున కపకారము

మంచిరోడ్లు ఎవరికి అవసరము! అమితవేగముతో మోటార్లను నడపువారు తలక్రిందులు కాకుండ వారి రక్షణసంగతి చూచుకొనుట ముందు అవసరము. రోడ్లు అరిగిపోవుట దెవరివల్ల? మోటార్లను నడపువారు వేగము హెచ్చు చేయవలెనని తొనుకకు ముందుకు తీవ్రమైన ఊపులు కలిగించుటలో రోడ్లు ఎక్కువగ చెడిపోవుచున్నవి. సామాన్యపుబండ్లు ఒకేవేగమున నడచుచుండును.

చక్రములు దొర్లుటవల్ల కలుగు అరుగుదల తప్ప ఇందువల్ల వేరుండదు. మామూలుబండ్లకు కూడ రబ్బరుచక్రములను ఉపయోగింపుడను ప్రచారములోనిగూఢార్థమును గుర్తింపవలెను. రోడ్లను మరమ్మతు చేయుట కగువ్యయము మోటారుయజమానులపైనుండి తొలగించి ఇదివరకే హతాశుడైన బీదగ్రామస్థునిపై పడవేయుటే వారి ఆశయము.

## స్థానికసంస్థల దుర్వినియోగము

చాలామ్యునిసిపాలిటీలును, లోకలుబోర్డు వారును, కసవు, మలములను తీసివేయుటకు మోటారు చక్రముల బండ్లను ఖరీదుచేసియున్నారు. ఇతరకారణములుండ ప్రజల ద్రవ్యమును దుర్వినియోగము చేయుట కిది యొక వక్రమార్గము. పన్నుచెల్లించువారి యోగ క్షేమమునకు పన్నులు ఉపయోగపడవలెను. ఈ మోటారు చక్రముల బండ్లవలన ప్రజల ద్రవ్యము విదేశములకు పంపబడుచున్నది. స్థానికులైన కమ్మరి, వడ్రంగి మొదలగు వారి వృత్తులు నశించుచున్నవి. ఇదివరకే హెచ్చుగానున్న కర్షకజనముతోపాటు వీరును భూమథనమునకే కడంగవలసినవారయ్యెదరు. ప్రజలు ఇందువిషయమై శ్రద్ధ వహించి తమ ద్రవ్యము స్థానికసంస్థవలన దుర్వినియోగము కాకుండ చూడవలయును.

## ఆత్మహత్యయే

మనదేశములో అనేకములైన చేతిపనులు ఇప్పటికే నశించినవి. పెద్ద పెద్ద యంత్రాలయములలో విరివిగా తయారగు వస్తువులను ఖరీదు చేయుడని ప్రోత్సహించు ఏజంట్ల మాటలను విని గ్రామస్థులు మోసపోకూడదు. నాణెపు చలామణి, రైళ్ళ ఓడల ఛార్జీలు, రక్షణపు సుంకములు మొదలగు మనపెత్తనములేనికృత్రిమోపద్రవములను ఎదుర్కొనవలసియున్నంత కాలము మనము దూరదేశములలో సరుకుల నమ్ముటకుగాని కొనుటకుగాని సంకల్పించుట ఆత్మహత్యయే అగును.

## ముఖ్యగమనింపు

మోటారుచక్రములు ఎడ్లు లాగుటకు సులువైనవికావు. రోడ్లమరమ్మతుల భారము అన్యాయముగ గ్రామస్థునిమీద హెచ్చుగపడును; వీనికి గ్రామస్థునిఆర్థికస్థితికి మించిన పెట్టుబడి పెట్టవలెను. ఇట్టివస్తువులపై స్థానికసంస్థలు ధనము వ్యయపరచుట ఆర్థికదుర్నీతియే అగును. అన్నివిధములను అవి అయోగ్యములు.

'హారిజన్'

# మలమూత్రములు మంచి ఎరువులు

శ్రీ ఉప్పులూరి రామశాస్త్రిగారు

మానవులు తమ అజ్ఞానమువలన పరమేశ్వరు డను గ్రహించిన సహజసంపదలను కూడ వాడుకొనలేనిస్థితిలో ఉన్నారు. గ్రామవాసులు ముఖ్యముగా వ్యవసాయదారులు తమ పొలముల పంటను వృద్ధిపొందించుటకు విరివిగా ద్రవ్యము ఖర్చుపెట్టి, విదేశపుఎరువులను తెప్పించి వాడుట నేర్చుకొనిరే కాని అప్రయత్నముగ లభించు మనుష్యుల మూత్రపురీషముల ఎరువులను, పశువులయు, పక్షులయు, మత్స్యములయు ఎరువులను సక్రమమార్గముల భద్రపరచి, ఉపయోగింప నేర్చుకొనినవారు కారు. వీని ఉపయోగములను బాగుగ గ్రహింప మిచే, వారి నిర్లక్ష్య భావములవల్ల ఆర్థికనష్టమును పొందుటయే గాక అనారోగ్యమునకు కూడ గురిఅగుచున్నారు.

## గ్రామపారిశుద్ధ్యము.

ప్రస్తుతము గ్రామములలో మలవిసర్జనముపట్ల జాగ్రతయే లేదు. ఏగ్రామములోచూచినను డొంకలు, దారులు మనుష్యుల మూత్రపురీషముల దుర్వాసనతో నిండియుండును. త్రోవలవెంట మనుష్యులు నడుచుచుండ పురుషులు మానమువీడి మలవిసర్జనము చేయుచుందురు. పాపము! స్త్రీలు ఇట్టి పరిస్థితులలో మలవిసర్జనసమయములలో కూడ మానసంరక్షణమునకై ఆత్రోవ నెవరైన వచ్చినప్పుడు నిలబడుచు వారు వెళ్ళగనే కూర్చుండి వలయునెడ మరల లేచుచు పలుఇక్కట్లకు లోనగుచుందురు. బెదరుచు మలవిసర్జన చేయుటవలన మలబద్ధక మేర్పడి అనేకరోగములకు గురిఅగుచుందురు. ఈవిధముగ త్రోవలను, డొంకలను చెరుపుటవలన, వానిపైనుండివచ్చుగాలి అపరిశుభ్రమై ఆప్రదేశములు క్రిమికీటకముల కొలవాలములై, అనేక జాడ్యములకు పుట్టినిళ్ళగుచున్నవి. గ్రామసీమలు ఆరోగ్యవంతము లను కీర్తి నశించినది. గ్రామవాసులు ఇంచుక శ్రద్ధవహించి ఈసమస్యను పరిష్కరించుకొనునెడల ఆరోగ్యమును, ఐశ్వర్యమునుకూడ సంపాదించుకొనగలుగుదురు.

## మూత్రపురీషములు మంచి ఎరువులు.

వ్యవసాయమునకు ఎరువులు ముఖ్యముకదా! మనుష్యుల మూత్ర పురీషములందు ఇతరజంతువుల మలమూత్రములలోకంటె సస్యములకు కావలయు ఆహార ద్రవ్యములు హెచ్చుగా లభించును. జపాను, చీనా దేశములలోని వ్యవసాయదారులు వీనిని విశేషముగ వాడుచున్నారు. కాని మనదేశములో శాస్త్రీయమైన పరిశోధనలేక, దుర్వాసన కొట్టుననియు, అసహ్యముగ నుండుననియు వ్యవసాయదారులు వీనిని వాడుటలేదు. మనుష్యుల మలమునందు వేయింట రమారమి ౧౫ పాళ్ళు నత్రజని (నయిట్రోజన్)యు, ౧౦ పాళ్ళు స్ఫురత్పంచామ్లజనిదము (ఫోస్ఫరస్ పెంటాక్సైడ్)ను, ౩ పాళ్ళు పొటేషును, ఉండును. మూత్రమునందు ౬ పాళ్ళు నత్రజనియును, అరపాలు స్ఫురత్పంచామ్లజనిదమును, మిగుల స్వల్పముగ పొటేషును ఉండును. ఈ మూడును సాధారణముగ సస్యములకు లోటువడుచుండు ఆహారములే. ఒక మనుష్యుని మూత్ర పురీషములనుండి సంవత్సరమునకు ౫౦, ౬౦ పౌనులఘనపదార్థము లభించునని లెక్కవచ్చినది. ఒక సంవత్సరములో నలుగురుమనుష్యుల మూత్రపురీషములతో తయారుకాబడిన ఎరువు సుమారు ఒక ఎకరము భూమిని బలపరచుటకు సరిపోవునని అంచనా వేసిరి.

ఇట్టి ఎరువు చెఱకు, తమలపాకులు, అరటితోటలు, కూరగాయలు మొదలగు నీటిపారుదల కావలసిన సస్యములకు వేసినయెడల మిగుల లాభకారిగానుండును. జపాన్ మొదలగు దేశములలో వరిచేల కిది మిగుల ఉపయోగకరముగ నున్నది. ఇదివేసిన సస్యముల ఫలము దినినయెడల జాడ్యములు పుట్టుననుట అసత్యము.

## మూత్ర పురీషములను భద్రపరచుటకు సులభ మార్గములు

మూత్ర పురీషములను వాసన లేకుండ నిలువచేయుటకు తగిన సులభమార్గము లున్నయెడల వానిని వాడుటకు ప్రజలకుకూడ అభ్యంతరముండకూడదు. అట్టిమార్గములు ప్రాచీనకాలములో ఆచరణమునందుండెను. కాని క్రమముగా అన్నిఅలవాట్లలోవలెనే ఇందువిషయమైకూడ ప్రజలు పెడమార్గములు త్రొక్కిరి. ఇటీవల గాంధిమహాత్ముడు గ్రామపునర్నిర్మాణ పారిశుద్ధ్యములపట్ల శ్రద్ధవహింపబూనినది మొదలుకొని ఇందునుగురించి కొంత ప్రచారమును, ఆచరణమును సాగుచున్నవి. గ్రామపారిశుద్ధ్యమునకు మనుష్యుల మూత్రపురీషములను సక్రమమార్గముల భద్రపరచుట మొదటి అవసరము. ఇందులకు గ్రామసీముల కనువగు విధానములు అనేకములున్నవి. హెచ్చువ్యయము లేకుండ,సులభముగ లాభమును పొందగల మార్గములు కొన్ని ఇట వివరింతుము.

### ౧. తొలి దొడ్లు

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాబోర్డులవారు తమ

యాజమాన్యమున కొన్ని గ్రామములలో నేలతొలిచి తొలిదొడ్లు ఏర్పరిచిరి. ఖర్చు విశేషములేదు. ౧౪ అంగుళముల వలయము, ౧౦ మొదలు ౨౦ అడుగుల వరకు లోతుగల రంధ్రము చేయవలెను. ఈరంధ్రముమీద ౨½ అడుగుల చతురముకలిగి నడుమనుపైని చెప్పినరంధ్రముతో పాటు సరిగాఉండురంధ్రముగల రాయిగాని, సిమెంటు పలకగాని వేయవలెను. చుట్టును వెదురుతడికలతోగాని జింకురేకులతోగాని మరుగుదొడ్డి ఏర్పరుపవలెను. పైరంధ్రమును చేయుటకు ఆరోగ్యశాఖవారి దగ్గఱ భూమిని తొలచు యంత్రము ఖరీదుకుగాని, బాడుగకుగాని దొరకును. పైరంధ్రము మలముతో నిండినవెనుక మట్టితో కప్పవలెను. ఆరుమాసములలో ఈమలమంతయు ఎరువుగా మారును. అప్పుడు పైని తెలిపిన యంత్రముతో ఎరువును పైకి తీయవచ్చును.

## ౨. నడదొడ్లు

మగన్వాడీ, నాల్వాడీ మొదలగు చోట్ల ఆశ్రమములలో వీటిని ఉపయోగించుచున్నారు. సుమారు రెండుఅడుగుల ఎత్తుగల నాలుగుకోళ్ళతో ఒకకొయ్యచట్రమును అమర్పవలెను. (౩ అ × ౨అ) అందుపైని నిలువుగా సుమారు ఒక అడుగు వెడల్పుగల రెండు చెక్కలను వేయవలెను. మూత్రమునకు ఒక బొక్కెనయు, మలమునకు ఒక బొక్కెనయు రెండుచెక్కల నడుమను నేలపై నుంచవలెను. రెండు చెక్కల పై కూర్చుండి నడుమనున్న ఈ బొక్కెనలలో మలమూత్రములను విడువవచ్చును. ఎప్పటికప్పుడు మలముపై మెత్తని మన్ను కప్పుచుండవలెను. మూత్రము ఉండుబొక్కెనలపైని రంధ్రములు గల మూత ఉంచుట మంచిది. దొడ్డిలో ఒకవైపున ఒకగాడి త్రవ్వి ప్రతిదినము ఈ బొక్కెనలలోనుండు మలమూత్రములను అందులో వైచి మట్టితో కప్పుచుండవలెను. ఈవిధముగా చేయుచో ౬౦ దినముల లోపుగనే మంచి ఎరువు తయారగును.

## ౩. పూడ్రెట్

చీనాదేశములో మనుష్యులమూత్రపురీషములను పొడిమంటితో కలిపి యెండబెట్టుదురు. ఇట్లు ఎండబెట్టి నిలువచేయుటకు తగిన స్థితిలోనికి తేబడిన ఎరువునకు పూడ్రెట్ అందురు. దీనిని వలయునపుడు చితుకగొట్టి సస్యములకు వేయుదురు. పూడ్రెట్ చేయుటకు పొడిమన్ను, కాల్చిన మన్ను, బూడిద ఉపయోగించవచ్చును. కొంతసున్నము కలిపినయెడల దుర్వాసన కొంత సులువుగ పోవును. అన్నభేది (లోహగంధకితము) కూడ దీనికి మిగుల మంచిది గాని దానివెల యెక్కువ. బొగ్గుపొడికూడ దుర్వాసనను పోగొట్టును

పూనాలో పూడ్రెట్ చేయువాడుక కలదు. అచట అవలంబించుచున్న పద్ధతి వ్యవసాయశాస్త్రములో ఒకచో వర్ణింపబడినది. ౧౫ అడుగుల పొడవును, ౧½ అడుగుల వెడల్పును, ౧ అడుగులోతునుగల కొన్ని గోతులు త్రవ్వి వాని యడుగును నీరింకనీయని పదార్థముతో సపాటచేయవలెను. నేలమీద ౧ అంగుళము బూడిద పరచి దానిపై ౫ అంగుళములలోతు మూత్రపురీషములను పోయుదురు. పైని మరల ఒకఅంగుళము బూడిద పొరపరతురు. ఇట్లు ౨౪ గంటలు మబ్బులేని కాలమునను వర్షకాలమున 3 రోజులును ఉంచి దంతి(పండ్లకర్ర)తో కలుపుదురు. ఇప్పుడు మరియొక పొరబూడిద చల్లి కాలస్థితిని బట్టి మరల 3 మొదలు ౫ రోజుల వరకుంచుదురు. పిమ్మట గోతులలోనుండి తీసి బయట ఎండనిత్తురు. ఎండకాలములో ౫రోజులలో ఎండి వాడుకకుగాని, అమ్మకమునకుగాని సిద్ధమగును.

## గాడిదొడ్లు

ఇవిగ్రామవాసులకు బహువీలైనవి. ఖర్చుఎక్కువలేనివి. ఖద్దరు సంస్థానములోను, వినయాశ్రమములోను ఈపద్ధతి అవలంబించుచున్నారు. గ్రామసీమలలో అనుసరణీయములని అనుభవమువలన తేలినది. దాపుననున్న పొలములోగాని, దొడ్డిలోగాని ఒకమరుగుదొడ్డి ఏర్పరుపవలెను. అందు అర్ధగజములోతు, అర్ధగజము వెడల్పు, వీలువెంట పొడవుపెట్టి ఒకగాడిత్రవ్వవలెను. ఈగాడిపై సుమారు ఒక అడుగువెడల్పు, ఒకగజము పొడవుగల రెండు చెక్కలు మనుష్యులు కూర్చుండుటకు వీలుగానుండులాగున వేయవలెను. ఈచెక్కలపైన కూర్చుండి మూత్రపురీషములను గాడిలోనికివిడువవలెను. పొడిమన్ను ఎప్పుడు జాగ్రతజేసి ఉంచుకొని, ఎప్పటికప్పుడు మూత్రపురీషములను పొడిమట్టితో కప్పుచుండవలెను. గాడి నిండిన తరువాత మరియొకగాడి త్రవ్వి ఇదేవిధముగా భద్రపరచిన మూత్రపురీషములు ౬౦దినములలోపుగనే మంచి ఎరువుగా మారును; దుర్వాసనఉండదు. మట్టితో కలసి మలమంతయు మెత్తనిమన్నుగామారి సస్యములకు ఎరువుగా ఉపయోగించుటకు వీలైనస్థితిలో నుండును.

ఈపద్ధతి అవలంబించుటకు గ్రామస్థులకు హెచ్చువ్యయప్రయాసలేమియు ఉండవు. పైగా వారు తమప్రాణ, మాన, ధనములను కాపాడుకొనినవారయ్యెదరు. గ్రామపారిశుద్ధ్యమునకును, దేశసౌభాగ్యమునకును తోడ్పడినవారయ్యెదరు.

# ఆరోగ్య విషయములు

### బొప్పాయిపండ్లు

బొప్పాయిపండ్లలో శరీరమునకు పుష్టినిచ్చు గుణము హెచ్చుగానున్నది. ఆహారమునకు ఇవి ఉపయోగపడునట్లు ఇతర ఫలములుఏవియు ఉపయోగపడజాలవు. 'ఏ' ప్రాణాణువులు (విటమినులు) శరీరపోషణమునకు మిగుల అవసరము. పాలు, మీగడ, ఆకుకూరలలో ఇవి లభించును. బొప్పాయిపండ్లలో "ఏ" ప్రాణాణువులు వీటిలోకంటె ఎక్కువగాలభించును. వెన్నలోకంటె ఈప్రాణాణువులు బొప్పాయిపండ్లలో ఒకటియు నర రెట్లు అధికముగ నున్నవి. ఈ పండ్లలో శరీరమునకు వలయు 'బి' 'సీ' 'డీ' ప్రాణాణువులుకూడ తగుమాత్రముగనున్నవి. ఈవిధముగ ఆహారమునకు అనువగు ఫలము మరియొకటిలేదు. తగు ప్రచారము జరిగి, ప్రజలందరు ధారాళముగ ఈపండ్లను ఉపయోగించుచో ఆయుఃప్రమాణము వృద్ధిపొందు ననుటకు సందేహములేదు.

పిల్లలు ఈపండ్లను ఉపయోగించినయెడల మంచిదేహదార్ఢ్యమును, శరీర సౌష్ఠవమును పొందగలిగెదరు. ముందుసంతతి బాగుపడగలదు. శతాయువుల సంఖ్య పెరుగగలదు.

### సోడా ఉప్పు.

ఆకుకూరలు ఉడుకబెట్టి, వాటిరంగుమారకుండా, త్వరగా ఉడుకుటకుగాను కొందరు సోడాఉప్పును వేయుచుందురు. ఇందువలన శాకములలోని అమూల్యములగు 'స' ప్రాణాణువులు పూర్తిగా నశించునని సర్ డబ్లియు లాంగ్డన్ బ్రౌన్ గారు హెచ్చరించుచున్నారు.

### ఉపవాసము.

అమితాహారము అన్నిరోగములకు ముఖ్యకారణము. ఉపవాసము రోగములకు దివ్యౌషధము. రోగహేతువులగు కొన్నిక్రిములు శరీరములో ముఖ్యముగా జీర్ణకోశమును, నీరుడు తిత్తులను, నరములను ఎల్లప్పుడు అంటియుండును. ఇవి మనుష్యులసత్తువనంతను పీల్చి పిప్పిచేయుచుండును. ఉపవాసమువలన ఈక్రిములన్నియు కృశించును. సంవత్సరములనుండి శరీరములోపుట్టి, వృద్ధిపొందుచు, మనుష్యుల జవశక్తులను నశింపచేయు ఈక్రిములు నీటిలోపముపల్లమొక్క నశించునట్లు ఎట్టి ఛత్రప్రయోగములోను నిమిత్తములేకనే ఉపవాసము వల్ల నశించును.

### దీర్ఘాయుస్సు.

దీర్ఘాయువు వాంఛించువారు పండ్లు, కాయకూరలు, పాల్లు, పెరుగు, వెన్న, మీగడలను, పుష్కలముగా తినవలెను. మాంసము, చేపలు, కోళ్లకంటె కాయకూరలు ఆరోగ్యకరము. భూమిలోపల, తయారగు దుంపకూరలకంటె భూమిపైని తయారగు కాయకూరలే శ్రేష్ఠములు. పచ్చికూరలలోను, పండ్లలోను, పాలలోను ప్రాణాణువులు అధికముగ కలవు. ఉడుకబెట్టుటచేతను, వేయించుటచేతను ఇవి నశించుచున్నది. ప్రాణాణువులను అమితముగ సేకరించుటలోనే దీర్ఘాయువుయొక్క రహస్యము ఇమిడియున్నది.

### అల్యూమినమ్ పాత్రలు

అల్యూమినం (జర్మన్ సిల్వర్) పాత్రలు వంటకుపనికి రావని పరిశోధనములవలన తేలినది. అల్యూమినమ్ పాత్రలో ఏది వండినప్పటికి, చివరకు నీళ్ళుకాచినప్పటికి సన్నని గుంటలు పడును. అనగా అల్యూమినములో చాలసన్నని పదార్థము కరిగి వండేపదార్థములో కలసిపోవును. అది విషతుల్యము; ఇంతియేగాక ఆపాత్రలలో ఉప్పుమొదలైన వాటితో వండిన పదార్థములు కొంతసేపు ఉంచినను ఈప్రకారమే జరుగును. అందువలన ఆహారము విషతుల్యమగును. ఈ పాత్రలలో కాఫీతయారుచేసినయెడల వేగముగ కనరెక్కును. అల్యూమినమ్ పాత్రలలో వండిన పదార్థములు తినినందున జీర్ణసంబంధమగు వ్యాధులు సంభవించును. ఒకప్పుడు ప్రాణహానికూడ కలుగవచ్చునని పరిశోధనములవల్ల తేలినది. వంటకు మట్టిపాత్రలు, గాజుపాత్రలు, ఆతరువాత పింగాణిపాత్రలు శ్రేష్ఠములని నిర్ణయింపబడినది.

### ఉప్పును మాంసమును వర్జనీయములు

ఉప్పును, మాంసమును లేనట్టి భోజనము క్షయరోగ నివారణమున కుపయోగపడునని వెస్టుఫేలియాలోని డాక్టరు జర్సన్ గారు ఋజువుచేసిరి. ఇది అన్నిరోగములకును పథ్యము. ఉప్పులేనిభోజనము తిన్న గర్భిణిస్త్రీలు ప్రసవవేదన లేకుండ ప్రసవించిరని ఒక జర్మనీవైద్యపత్రికలో వ్రాసియున్నారు. ఉప్పువదలినవారు కారమును వాడరనుట స్పష్టము. భగవద్గీతలలో ఉప్పు రాజసాహారముగా వర్ణింపబడినది. ఉప్పు, కారములురోగహేతువులు. రక్తపుపోటుకలవారికి ఉప్పు పెట్టరు. అన్నివిధముల సాత్వికాహారము సర్వశ్రేష్ఠము.

ఇక, మాంసాహారము : ఇది ఆరోగ్యమునకును, బుద్ధికిని మాత్రమేకాక జీవకారుణ్యమునకును పరమశత్రువు, కాన దీనిని ఉప్పుతో పాటు వర్జించినవారు ఆరోగ్యవంతులును, బుద్ధిమంతులును మాత్రమగుటయేకాక ఉత్తమమానవులయ్యెదరు. అంతేకాక మాంసాహారులు మాంసమును మానుచో తమతోడిప్రాణులహింస తప్పించిన పుణ్యముసైతము కట్టుకొందురు. ఇట్టిచో మాంసాహారము మానప్రయత్నింపవలదా?

# సూయాణము = సూచియానము

"తగునాజ్ఞ సూయాణముగ నొనరించె మం
చిగ నేల నాలుగుచెఱంగులకును"

భారతవిరాటపర్వము, ౫ ఆ.

పైసీసపాదమున తిక్కనసోమయాజి 'సూయాణము' వాడెను.

అర్థము.

వై. శత్రుభయంకరమైన దండయాత్ర— శబ్దరత్నాకరము, ౧౮౮౫ సం॥

(సూయాన) వైరిభయంకరదండయాత్ర — ఆంధ్రపదపారిజాతము, ౧౮౮౮ సం॥

శ. తద్భ. (సుయానమ్, శత్రుభయంకరమైన దండయాత్ర)— లక్ష్మీనారాయణీయము.

'సూయన, సూయాన' వైరిభయంకరదండయాత్ర— పురుషోత్తమకవీయము, ౧౯౧౮ సం॥

పైనిఘంటువులలోని అర్థము ఒక్కటియే. ౧౮౫౩ సం॥ మున అచ్చుపడిన బ్రౌనునిఘంటువులో ఈనుడి లేదు.

శ్రీ మున్నంగి...శర్మగారు భారతమును పరిష్కరించునెడ, దీనికి నిఘంటువులలో ఇచ్చిన అర్థము పట్టునకు తగినదను తనివి కలుగక కొందఱను అడిగి, నాపేరను సైతము జాబు వ్రాసిరి. నేను నిఘంటువులలోనిఅర్థము సరిపెట్టుకొనవచ్చునని తలంచి, ౧౯౩౬ సెప్టెంబరు గ్రంథాలయసర్వస్వసంచికలో సూయాణమునుగూర్చి విమర్శింపవలయునని పండితులను వేఁడితిని. అది చూచి, సూర్యరాయాంధ్రనిఘంటుకార్యస్థానపుమేనేజరు, బ్రహ్మశ్రీ చర్ల నారాయణశాస్త్రిగారు తమ భాషాభిమానము చూపి, పరిశోధించి, 'సూయాణశబ్ద విమర్శనము' ఆంధ్రసాహిత్యపరిషత్పత్త్రికలో (౨౫ వ సంపుటము, ౩వ సంచిక) వెల్లడించిరి.

అందు, సూయాణము, కిట్టెల్ దొరగారి కర్ణాటాంగ్ల నిఘంటువునుబట్టి, 'సూచియాన' శబ్దభవమనియు, విల్యమ్సు సంస్కృతాంగ్లనిఘంటువునుబట్టి, 'సూచి'శబ్దమునకు 'సూచివ్యూహ' మర్థమనియు, ఇది ప్రబలాధారముగా తమకు తోఁచినదనియు, కాన, "సూయాణము= సూచియానము, సేనను సూచివ్యూహముగా పన్ని శత్రువులపై వెడలు దండయాత్ర" యని తెలిపిరి.

శ్రీ శాస్త్రిగారి విమర్శనము చూచుడు నాడెందమెంతయు అలరె. వలయు గ్రంథముల తోడ్పాటు పొందఁగలిగినవారు అదృష్టవంతు లనుకొంటి. పరిశోధించుటలో శ్రీశాస్త్రిగారు శ్రమపడిన పడిరిగాక! సూయాణపునుడి పుట్టుగుట్టులు తెనుఁగువారికి తెలిపినపేరు వారికే దక్కినది. వారికి తోడ్పడిన నిఘంటువులు వ్రాసిన కిట్టెల్-విల్యమ్సు పండితులను తెనుఁగువారెన్నఁడును మఱవరాదని ఈయెడ హెచ్చరింపఁదగు.

సూయాణమును గూర్చి దీనిలో ఇంతకుముందు వ్రాసినపుడు, "నిఘంటువులలోనిఅర్థముకంటె మరొక అర్థము నాకును తెలియదు. దానితో సరిపెట్టుకొనవచ్చునని నాకు తట్టినది" అని వ్రాసితిని. శ్రీ శాస్త్రిగారును "లభించినయన్నిపాఠములలోను శబ్దరత్నాకరపాఠమే ప్రశస్తతమముగనున్నది. అం దిచ్చిన యర్థము కూడ సరిపడియున్నట్లే కాన్పించుచున్నది." అని తెలుపుచు, నన్నుఁగూర్చి "ఈవిషయమున శ్రీ శాస్త్రిగారును నేనును నేకాభిప్రాయులము" అనియు వ్రాసి తమసద్భావమును చాటిరి. దీనివలన నిఘంటువులు సూయాణమున కిచ్చినయర్థమునుగూర్చి మాయిద్దఱకును తనివి కలిగినది. శ్రీ మున్నంగి......శర్మగారును శ్రీశాస్త్రిగారి విమర్శనము చదివినపిదప "సూచియానమునఁబుట్టినదే 'సూయాణము' అనుట సాధువుగఁదోఁచినది" అని తమ జాబులో తెలిపిరి. ఇందువలన శర్మగారికిని సూయాణపుఅర్థమునుగూర్చి తనివి కలిగినట్లే తేలినది. తక్కిన పండితులును శ్రీశాస్త్రిగారు వ్రాసినదానికి అంగీకరింతురని తలంతును.

'సూయాణశబ్దవిమర్శనము' వ్రాసినందులకు శ్రీ చర్ల నారాయణశాస్త్రిగారిని నే నెంతయు అభినందించెద.

శ్రీ శాస్త్రిగారి విమర్శనమునుబట్టి, సూయాణపునుడికి ప్రకృతులుగా నిఘంటువులలో ఇచ్చిన 'సూయన, సూయాన, సుయాన' శబ్దములు సరి అయినవి కావనియు, 'సూచియాన' శబ్దమే దానికి సరి అయినప్రకృతి అనియు, తేలినది. అయినను, శ్రీ శాస్త్రిగారు తమవిమర్శనము చివరను,

"దీనికంటె మంచి వ్యుత్పత్తిగాని, మంచి యర్థముగాని, గోచరించినచో విద్వాంసులు దయతో మాకుఁ దెలిపినయెడల మేము వానిని వందనపూర్వకముగా గ్రహింతుమని విన్నవించుకొనుచున్నాను." అని విద్వాంసులకు విజ్ఞాపనము చేసిరి. ఇది మిక్కిలి మెచ్చఁదగు మెలఁకువ.

కావున, నేనును వారివలెనే విద్వాంసులకు విజ్ఞాపనము చేయుచు, 'సూయన, సూయాన, సుయాన' శబ్దములు కాని, మఱి యేశబ్దము కాని, సూయాణమునకు ప్రకృతి అగుటకు ఆధారములు కలవేని తెలుపఁగలరని వారిని వేఁడుచున్నాను.

ది ౨౬-౧౧-౩౬, తెనుఁగుగుడి. } మారేపల్లి రామచంద్రశాస్త్రి, గవర్నరుపేట, బెజవాడ.

# లోకవార్తాలహరి

## స్పెయినులో అంతఃకలహములు :

స్పెయినుముఖ్యపట్టణమగు మేడ్రిడ్ మీదికి తిరుగుబాటుదారులు విజృంభించి మూడువారములకు పైబడినది. కాని ఇప్పటికిని ఆపట్టణము స్వాధీనము కాలేదు. స్పెయిను ప్రభుత్వపు బలములు తిరుగుబాటుదారులను కొన్నిమూలలలో తిరస్కరించి తరుమగొట్టినట్లు వార్తలున్నవి. తిరుగుబాటుదారుల ప్రకటనములను బట్టి చూచినను వలెన్షియా మార్గమును మొదట స్వాధీనము చేసికొనక మేడ్రిడ్ పట్టణమును పట్టదలచలేదని తేలుచున్నది. ఉత్తరమున సాంటాండరు ప్రాంతమునందును, సెవిల్ వద్దను, సిక్వెన్జా ప్రాంతములోను తిరుగుబాటుదారులకు ప్రభుత్వసైన్యములు గొప్ప ఒత్తడిని కలుగజేయుచున్నవి.

గతమాసము మేము వ్యాఖ్యానము వ్రాసిన తేదీకి తరువాత రుష్యా స్పెయిను ప్రభుత్వమునకు మందుగుండుసామగ్రి సరఫరాచేయక తప్పదని తీర్మానించినది. స్పెయిను తిరుగుబాటుదారులు సముద్రయుద్ధమునందుకూడ ప్రభుత్వమువారిని ఎదుర్కొనినగాని ప్రయోజనము లేదని నిశ్చయించి బార్సలోనా, వలెన్షియా రేవులవద్దకు తమనావికాబలమును చేర్చి ఆపట్టణములపై బాంబులువేయుచు, స్పెయినుప్రభుత్వమునకు సరఫరా చేయుచున్నట్లు తోచిన ఇతర రాష్ట్రముల నావలను కొన్నిటిని తినుబండారములు మోసికొనిపోవువానినికూడ తమకు అధికారములేనిదూరములో (తీరమునకు మూడు మైళ్ళకు పైబడినదూరములో) పట్టుకొని వెదుకనారంభించినవి. జర్మను క్రూయిజ రొకటి స్పెయినుప్రభుత్వపునావను టార్పిడోచేసినదను ఫిర్యాదు కలిగినది. ఇవియన్నిటివలన తీక్ష్ణ పరిస్థితు లిప్పటికి పుట్టలేదు. ఆక్షేపణలు, సమాధానములతో కాలము గడచిపోయినది. ఇటలీ జర్మనీలవారు మేడ్రిడ్ పట్టుబడకముందే ఫ్రాంకోప్రభుత్వము, అనగా తిరుగుబాటుదారులప్రభుత్వము, ఏర్పడినదని అంగీకరించినారు. దీనికి ప్రతీకారము చేయుటకు ఇతర రాష్ట్రములకు పొసగలేదు. ఇంగ్లండు విదేశాంగమంత్రియగు ఈడెను ఇప్పటికిని బ్రిటిషువారు తిరుగుబాటుదారుల ప్రభుత్వ మేర్పడినదని అంగీకరించుటలేదని చెప్పుచున్నారు. స్పెయినులోని పోరాటమును సిద్ధాంతముల పోరాటముగా తా మంగీకరింపమని నొక్కిచెప్పుచున్నారు. స్పెయిను ప్రభుత్వము సామ్యవాద ప్రభుత్వముగాదు; ప్రజాప్రతినిధిప్రభుత్వమే. అందుచేత దీనిని విపరీతపరచి స్పెయినువిప్లవము దీనిమూలకముగా వచ్చినట్లారోపించి యూరోపు శాంతికి భంగము కలిగించుట తమ యుద్దేశము కాదని బ్రిటిషు ప్రభుత్వ కార్యనిర్వాహకుల వాదము. కాబట్టి తమ దేశమునుండి ఏవిధమైన సైనిక వస్తుసహాయమును ఇరుకక్షులకును చేరకుండ కాచుకొనుటకు తాము శాసనము ప్రవేశపెట్టినారు. తిరుగుబాటుదారులను యుద్ధప్రక్రియలోని ఒకకక్షగా మాత్ర మంగీకరించినారు. ఇతర రాష్ట్రములు తమ దృష్టిపథముతో నేకీభవించి తోడ్పడునట్లు సర్వప్రయత్నములను చేయుచున్నారు. జర్మనీ జపానుతో చేసికొనిన ప్రకటిత రహస్య సంధులలో సిద్ధాంతముల సంఘర్షణమే యాధారముగా గైకొని సామ్యవాదమును తుదముట్టింప సమకట్టినను, స్పెయినువిషయములలో మాత్రము తన కారోపింపబడిన సంగతులన్నియు అసత్యములని

ఘంటాపథముగ తిరస్కరించుచు ఇంగ్లండు కార్యక్రమముతో నేకీభవించుచున్నట్లే ప్రకటించుచున్నది. ఇటలీయు నదేమార్గమున ప్రసంగించుచున్నది. లోకమారణయుద్ధము పొసగకుండుటకు ఫ్రాన్సు ఏకీభావము పొంది బ్రిటను అవలంబించుచుండు రాజనీతియనుటకు సందేహము లేదు. కాని కొందరు రాజనీతివేత్తలు బ్రిటను తన బలములను పూర్తిగా నాయత్తపరచికొనుటకే నీతిని అనుసరించుచున్నదని ప్రకటించుచున్నారు. ఏసందర్భముననైనను స్వసంరక్షణము కొరకు చేయవలసిన ప్రయత్నములు తప్పవు. వానిని సంగ్రామ కాంక్షతో బ్రిటను చేయుచున్నదనుట దోషమని దీనికి ప్రత్యుత్తర మిచ్చువారును కలరు.

## అమెరికాలో రూజ్వెల్టుపరిపాలన:

అమెరికాలో మఱలరూజ్వెల్టు పరిపాలన సుస్థిరమైనది. అతడే అధ్యక్షుడుగా నియమితుడైనాడు. అతనిపరిపాలనమందు ఇదివరలో కన్పించిన సుగుణములలో రెండు లోకము నాకర్షించినవి - నిరుద్యోగులకు సదుపాయములుచేయుట, విద్య అక్షరజ్ఞతల వ్యాప్తిచేయుట. ఇతని రాజనీతి కారణముగా అమెరికా సంయుక్త రాష్ట్రములలో మూడుకోట్ల ముప్పదిలక్షల విద్యార్థి బృందము నేటిదినము జ్ఞానము గడించుటయందు నిమగ్నులయి యున్నారు.

ఇందు రెండుకోట్ల ముప్పది లక్షలు ప్రాథమిక విద్యార్థులు. అరువది లక్షలు హైస్కూళ్లలో నున్నారు. పది లక్షలు కళాశాలలలో నున్నారు. మిగత 30 లక్షలు వయోజనవిద్యాలయములం దున్నారు. విద్యార్థులకు ప్రభుత్వము కలుగచేయునట్టి సహాయము చాల గొప్పది. పిల్లల కొకపూట భోజనము పెట్టెదరు. హైస్కూళ్లలో బీదవిద్యార్థులకు నెలకు రు ౧౫ ల విద్యార్థి వేతనము లిత్తురు. కళాశాలలలోను సాంకేతిక విద్యాలయములలోను చదువువారికి పాక్షికముగా పని కల్పించి నెలకు రు ౭౪ ల నుండి ౧౨౦ వరకు సంపాదించు అవకాశములు కల్పించి సహాయపడుచున్నారు. ౧,౬౬,౦౦౦ హైస్కూళ్ల విద్యార్థులును, ౧, ౨౩,౦౦౦ ఉత్తమవిద్యాభ్యర్థులును ప్రభుత్వసహాయముతో చదువుచున్నారు.

రుష్యాలోవలె చదువు అందఱికి సర్వశాఖలలో ఉచితముగా నేర్పడములేదు; గాని రమారమి ఆస్థితిని సమకూర్చడ మవసరమని రూజ్వెల్టు పనిచేసియుండుట స్పష్టము. అమెరికా సంయుక్త రాష్ట్రములలో నేడు అక్షరజ్ఞత లేనివారు నలునది లక్షలకు మించరు. వీరికిని అక్షరజ్ఞత అలవడ చేయుటకు గత వత్సరము రేడియోలు, కరపత్ర ప్రకటమునలు, వయోజనవిద్యతరగతులు, ఇన్నిటిని గట్టిగా ప్రోత్సహించి యీ సంఖ్యను కూడ తగ్గించుటకు ప్రయత్నములు జరిగినవి. జీవితమునకుసంబంధములేని విద్యకు అమెరికాలో ప్రోత్సాహములేదు. ఆర్థికదుస్థితిలో విద్యాప్రచారపుఖర్చు ఇంత విరివిగా పెంచి పనిచేసినవాడు రూజ్వెల్టు. కావున మరల ప్రజల మన్ననకు పాత్రుడైనాడు. ఇతనిపరిపాలనమువలన ఇండియా నేర్చుకొనవలసిన గుణపాఠ మిదియని వేరుగా వర్ణింపవలెనా ?

## చీనా - జపానుల చిత్రసంబంధము:

నేటిదినము తూర్పున చీనా జపానుల సంబంధము సర్వప్రపంచపుదృష్టిని ఆకర్షించుచున్నది. చీనా తూర్పుదేశాలలో నొకటి. కాబట్టి పడమటిరాష్ట్రాలగు ఐరోపియనులజోక్యముండ రాదని జపాను సిద్ధాంతముచేయ నాలోచించినది. చీనారాజ్యాధికారి యగు షియాంగు- కే- షెక్

జపానునకు నిన్నటివరకు మిత్రుఁడుగా నున్నందున. జపానుప్రయత్నములకు సాగుబడియుండినది. చీనాలో మూడవవంతు భాగమును కబళించువరకు చీనావారు జపానును సహించినారు. కాని తన వస్తుసముదాయముతో చీనాను ముంచివేయుటకు జపాను ప్రత్యక్షముగాను, పరోక్షముగాను ఆరంభించి, చీనా దేశీయుల భోజనమునకే గతిలేనిస్థితికలిగించుటచేత జపానుపై విద్వేషము తీవ్రముగా రగుల్కొనినది. దక్షిణమున క్వాంగ్సి, క్వాటుంగ్ పరగణాలలో నేర్పడిన స్వతంత్ర ప్రభుత్వమునకును, షియాంగు-కే-షెక్ నకును ఘోరమగు అంతఃకలహము జనించునను భయమును ఒకప్పుడు కలిగినది. కాని అతని భార్య, వదినె, అత్తల-అనగా చీనా రాజ్యపు స్వాతంత్ర్యనిర్మాత సున్యాతుసేన్ బిడ్డలు భార్యయొక్క దూరదృష్టి, దేశాభిమానములచేత ఉత్తరదక్షిణ చీనాలకు సఖ్యము కుదిరినది. దక్షిణమున నున్న ప్రత్యేకప్రభుత్వము షియాంగు-కే-షెక్ లో లీనమైనది. ఆప్రభుత్వాధికారులను షియాంగు-కే-షెక్ తన ప్రభుత్వమున ప్రధానాధికారులుగ నియమించినాడు. జపానునెడల తాను కనుపరచుచుండిన సహనమును మానుకొని జపానుతో సంప్రతింపులు తన విదేశాంగ మంత్రిచేతులలో నిడినాడు ఇటీవల జపానువారు కోరిన కోరికలకు మార్గము కల్గించుట కొడంబడలేదు. జపానీయ రాయబారులతోడి సంప్రతింపులకంటె, బ్రిటిషు అమెరికను రుష్యను రాయబారులతో నెక్కువ సంప్రతింపులు జరుపుచున్నట్లు జపానువారికి అనుమానము పుట్టినది బ్రిటిషువారి మంత్రాంగముచేత నేటి పరిస్థితులు చీనాలో కలిగినవని చెప్పుకొనుచున్నారు చీనాకు పెట్టుబడి పెట్టుటకు ఇంగ్లీషువాను సమ్మతించినా! ఇటీవలి వార్త యొక్కటి దక్షిణచీనాలోనికి ఇండియా దేశమునుండి మందుగుండు చేర్చి బ్రిటిషువారు చీనాకు సాయపడుచున్నారని ప్రకటించినది. దక్షిణమున నిట్టి చర్య జరుగుచుండగానే వాయవ్యమున సామ్యవాదము బలపడుచున్నను-- అనగా రుష్యాపలుకుబడి బలపడుచున్నను, ఇదివరలోవలె దానిని నిర్మూలము చేయుటకు షియాంగు- కే- షెక్ బయలుదేరుటలేదు. జపాను చీనాలో కల్పించుకొను పెత్తనము చీనా స్వనిర్మాణమునకు ప్రతికూలమనియు ఇదివరలోని తొమ్మిదిప్రభుత్వములసంధికి విరోధమనియు అమెరికావిదేశరాజ్యాంగశాఖవారు ఇటీవల ప్రకటించిరట! బ్రిటను, రుష్యా, అమెరికాలు జపాను చేయుచున్న చీనా కబళనోద్యమమునకు గొప్ప యాటంకములగు నను సూచన చీనాలో కలిగిన జాతీయైక్యభావముచేత మరింత స్పష్టపడినది.

**బాల్డ్విన్ భీతి:**

జారోపట్టణము ఒకప్పుడు చక్కని పరిశ్రమాగారములకు ఉనికిపట్టు; నేడో నిరుద్యోగులకు నిండు నివాసము; కూడు లేక మాడుచు ౨౦౦ కర్మకరులు లండనుకు తమదుస్థితిని కండ్లకు కట్టినట్లు ప్రదర్శించుట కిటీవల వర్షములలో తడిసి వణకుచు వచ్చి చేరిరి. కర్మకరులగు సోదరులు హైడుపార్కులో వారికి స్వాగతమిచ్చిరి. కాని ముఖ్యమంత్రి బాల్డ్విను, వారి ప్రతినిధులకు దర్శనమిచ్చుటకు నిరాకరించెను. అతడిచ్చిన కారణము గమనింపదగినది. ఇంగ్లండులో విపరీత వాదములు ప్రబలుటకు అవకాశమియ్యరాదట! వోటుమూలకముగా అనగా ఎన్నికలచేత ప్రభుత్వములను మార్చగల అధికారమును ప్రజలు వినియోగించుకొనుట మూలకముగా ప్రబల సమస్యలు తీర్మానించుకొనవలసినదే గాని, కవచాలు తొడగడం, కత్తులుపట్టడం, కవాతు

చెయ్యడం, గల్లంతుపెట్టడములద్వారా సంస్కారం సాధించే ప్రయత్నం చేయరాదట! ఈవిధమగు ప్రసంగం చేయడానికి బాల్డ్విన్కు కారణం కూడ కలిగింది. లండన్ ఈస్టెండుభాగములో ఫేసిస్టులు, సామ్యవాదులు పరస్పర కలహములు కలిగించుకొనడం ఆరంభించి ప్రభుత్వమువారు గట్టిచర్య తీసికొనవలసిన పరిస్థితి ఏర్పడింది.

అట్టిసంభవాల మూలకంగా ఇంగ్లండులోకూడ స్పెయినుపరిస్థితులు కలుగునేమోయని బాల్డ్విన్ మంత్రి భీతిగొన్నాడు. నిరుద్యోగులకు దర్శనమీయలేదనడం కఠినంగా దోచుననుటకు సందేహంలేదు. కానిబాల్డ్విన్ మనసును కలవరపరచిన ఆవేదననుమాత్రం నేటి పరిస్థితితులలో గమనించడంఆవశ్యం.

## జపాను జర్మనీ అగ్రిమెంటు

గత నవంబరు 25 వ తేదిని జపాను జర్మనీ రాష్ట్రములు ఒక అగ్రిమెంటుకు చేవ్రాలు పెట్టినవి. ఇది వెంటనే అమలులోకి వచ్చినది. అయిదు సంవత్సరములుఅమలులో నుండగలదు. దీనివలన ఈ రెండు ప్రభుత్వముల వారును రుష్యాలోని కమ్యూనిస్టు ఇంటర్నేషనేల్ అనునట్టి ప్రపంచ సామ్యవాద సంఘపు ప్రచార కార్యక్రమము నొండొరులకు తెలియపరచికొనుచు, దానినుండి తమ దేశములను సంరక్షించుకొనుటకు నిండు సహకారమున నడుచుకొనగలరు. సామ్యవాద సంఘముయొక్క కార్యక్రమముచేత ఏయే రాష్ట్రములందు చిక్కులు,తగాదాలు ఏర్పడునో ఆయారాష్ట్రములన్నియుఈఅగ్రిమెంటులో చేరవచ్చునని జర్మనీ-జపానులు ఆహ్వానింపగలవు. ఇంతవరకు లోకమునకు ప్రకటితమైన విషయము, ప్రకటితముకాని విషయము కొంత కలదని ఇంగ్లండు బోటిరాష్ట్రముల కనుమానమున్నది. స్వసంరక్షణమునకు సైనికముగా సహాయముచేసికొనుటకు జపాను-జర్మనీలు ఇందుమూలకముగా సమాధానము కుదుర్చుకొనిన వనడమే యనుమానము. అదినిజమైన యెడల ఆసియాలో బ్రిటను బలమునకు చాలనిరోధము కలిగినదని యేయర్థము. అంతేకాక ఈనూతన సమాధానము చేత జపాను జర్మనీలు లోకములోని అన్ని రాష్ట్రములను సామ్యవాద రాష్ట్రములు, తద్వతిరేకులు - అనగ రమారమి ఫేసిస్టురాష్ట్రములు అని రెండు ముఖ్యవర్గములుగా విడదీసి, ఈరెంటికినిగల నిత్యసంఘర్షణమునకు దారిదీసినవని కొందరు తలంచుచున్నారు. ఏరాష్ట్రమైనను తన దేశరాజ్యాంగ స్వరూపమిట్టిదిగా నుండవలెనని నిర్ణయించుకొనుట కధికారము కలదైయున్నదనియు, ఆవిషయమునందితరరాష్ట్రము జోక్యము కలుగజేసికొనరాదనియు అభిప్రాయపడి, బ్రిటను ఈఅగ్రిమెంటుకు వ్యతిరేకాభిప్రాయమును సూచించుచున్నది.

ఇటలీ ఆదర్శవిషయమున నీయగ్రిమెంటుతో సంపూర్ణమైన ఏకీభావముకలదే; కాని ఇప్పట్లో తన కిందుసాధక బాధకములులేవని ఆరాష్ట్రము ప్రకటించినది. అమెరికావారికిది ఆలోచనీయ మాత్రమని తోచినది. ఎవ్వరేమన్నను ప్రతి దేశములోను ప్రబలగల రాజకీయసిద్ధాంతముల యెడ ప్రజలకుగల యభిమానఅనభిమానములను ఇతరరాష్ట్ర ప్రభుత్వములు సవ్యయనిరోధ కార్యక్రమముచేత హర్షించుటో తిరస్కరించుటో ఈయగ్రిమెంటు మూలకముగా జరుగగలదు. గావున తుదకు ప్రపంచము రెండు చీలికలయి నేడుగాకున్న రేపు ఆరెండు భాగములును మహాప్రళయమున దుముకుట సంభవించ గలదని సూచించుట కేజ్యోతిష జ్ఞానమును అక్కరలేదు

# శిక్షణ నిలయము - బెజవాడ

నేడు జాతీయ పునర్నిర్మాణమునకు దేశములో అనేకోద్యమము లేర్పడి పనిచేయుచున్నవి. కాని ఆఉద్యమముల మూలసూత్రములను గుర్తించి, సమన్వయము చేసి, పరస్పర సహకారముతో, సర్వతోముఖాభివృద్ధికొఱకు పనిచేయువారు కావలసియున్నారు. ఆంధ్రదేశమున అందులకు తగిన శిక్షణమిచ్చి, అర్హులగు పౌరులను తయారు చేయవలెనని మాసంకల్పము. కావున ఆంధ్ర సేవాసంఘము, ఆంధ్ర దేశగ్రంథాలయసంఘము, గ్రామపరిశ్రమాభివృద్ధిసంఘము, చరఖాసంఘము, ఆంధ్రరాష్ట్రజీవకారుణ్యసంఘము, హరిజనసేవాసంఘము, సనాతనధర్మసంఘము, వస్త్రమార్పిడిసంఘము, మొదలగు సంస్థల ఆదర్శములను గుర్తించి, వానిననుసరించి, గ్రామములలో పనిచేయఁగోరువారికి పైసంస్థలో తగిన శిక్షణమిచ్చెదము. శిక్షణకాలము మూఁడు మాసములు.

శిక్షణకాలములో వడుకుట, ఏకుట, నేత, తోటపని, సేద్యము,వక్తృత్వము భజనలు, పురాణములు, హరికథలు మొదలగువానిలో కొంత అనుభవము కలిగింతుము. అర్థశాస్త్రము, భారతదేశచరిత్ర, రాజ్యాంగ విధానములు, ఆరోగ్యము, పంచాయితీలు, గ్రామపరిశ్రమములు, కర్షక సమస్యలు, గ్రంథాలయములు, జీవకారుణ్యము, సనాతనధర్మము, భూగోళశాస్త్రము, ఆంధ్రభాషావాఙ్మయములు, వైద్యము, పశువైద్యము, ప్రకృతివైద్యము, అనుదినవిజ్ఞానము, పౌరోహిత్యము మొదలగు విషయములను గురించి సమర్థులగువారిచే ఉపన్యాసము లిప్పించెదము. శ్రీయుత గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, ఎమ్. ఏ., గారు ప్రధానాచార్యత్వము వహించుటకు అంగీకరించినారు. శ్రీ దేశపాండ్య, సుబ్బారావు, బి. ఏ., గారు మాసముదినములు బెజవాడలోనుండిఆచార్యత్వకార్యక్రమమునందు పాల్గొన నంగీకరించిరి. విషయబోధనముచేయుటకు తెలుగుదేశమందలి ప్రముఖులు కొందరు సమ్మతించినారు. ఇతరులు ప్రత్యేకముగ ఆహ్వానింపబడుచున్నారు.

స్కూలుఫైనల్ దర్జా జ్ఞానముకలవారు కాని, సంస్కృతమున పంచకావ్యములు చదివినవారు కాని, తెనుగున మంచి జ్ఞానము కలవారుకాని, పదునాఱు సంవత్సరముల వయస్సునకు మించిన వారిని తడవకు ఇరువదియయిదుగురిని శిక్షణ నిలయములో చేర్చుకొందుము. ప్రవేశపరీక్ష యిచ్చి, శిక్షణనిలయనిర్వాహకులచే ఏర్పఱుపఁబడిన అధికారుల దృష్టికి అర్హులని తేలినవారు మాత్రమే శిక్షణమునకు అర్హులు వీరు నిబంధనములకు లోఁబడి ఉండవలెను. నిలయమునందే నివసింపవలెను ఉషఃకాలమున నిద్రలేచుట మొదలుకొని రాత్రిపరుండువఱకు నియమితమైన శిక్షణమును పొందవలెను. శిక్షణము ధర్మార్థముగా ఇచ్చెదము. తక్కినఖర్చులు శిక్షణార్థులే పెట్టుకొనవలె. భోజనాదులకు నెల ౧కి ఏడు రూపాయలలో ఇముడునట్లు ఏర్పాట్లు చేయుదుము. నిలయాధికారులు, నియమములు మీఱిన వారిని ఎవరినైనను, ఎప్పుడైనను నిలయమునుండి తొలగింపవచ్చును.బీడీలు,సిగరెట్లుకాల్చుట మొదలగు దురభ్యాసములకు ఇచ్చట తావుండదు. ఇతరులుకూడ నిలయాధికారులకుదరఖాస్తుపెట్టుకొని, అంగీకృతులై ఉపన్యాసములు వినుటకు రావచ్చును. దరఖాస్తులు చూచుకొని త్వరలోనే శిక్షణము ప్రారంభింతుము.

కావున, పై శిక్షణము పొందఁదలఁచువారు త్వరపడి, దరఖాస్తులు పంపుకోవలెనని హెచ్చరించుచున్నాము.

గాంధివిలాసము,
ఖద్దరుసంస్థానము,
బెజవాడ.

మారేపల్లి రామచంద్రశాస్త్రి
వ్యవస్థాపకుఁడు.

# వోల్టా - విద్యుత్పరిశోధకుడు

## ది 18-2-1745 — ది 5-3-1827

శ్రీగొబ్బూరు వేంకటానందరాఘవరావుగారు, బి. ఏ.

ఇటలీదేశమునందలి కోమో పట్టణమునందు 1745 సంవత్సరము ఫిబ్రివరి18 తేదీని ఇతడు జననమునొందెను. వీరి పూర్వులు మిలాన్ పట్టణములో ఘనతచెందిన కుటుంబికులు. అయినను కాలవశముచేత వైభవాధికారములను సిరిసంపదలను గోల్పోయి, కోమోపట్టణము చేరుకొని ఏదోఒకవిధమున కాలక్షేపము చేయుచుండిరి.

చిన్ననాటినుండియు ఈతని బుద్ధివికాసము అద్భుతమయియుండెను. పట్టినపని పట్టుదలతో పూర్తిచేయుటయు, చదివినది సగముసగముకాక పూర్తిగా చదివి సంపూర్ణప్రజ్ఞబడయుటయు నీతని సహజగుణములు. కాబట్టిఇతడు అసాధారణచరిత్రకలవాడగునని చిన్ననాడే పేరుపడెను. భవిష్యజ్జీవితము కవిత్వకళ కంకితముచేయవలెనా? ప్రకృతివిజ్ఞాన విస్తరణార్థము పరిశోధనములు చేయుచుండవలెనా? అని కొంతకాలము డోలాయమానమానసుడై యుండి, తుదకు పరిశోధనముమూలముగా ప్రకృతిసేవ చేయుటకే సంకల్పించుకొని 18 వ యేట విద్యుద్ధర్మములను గూర్చి జిజ్ఞాసగలవాడయి ఓపికతో కృషిసల్ప నారంభించెను.

### క్రొత్తవిద్యుద్యంత్రము.

త్వరలోనే అతడు ఒక క్రొత్త విద్యుత్ యంత్రమును తయారుచేయకలిగెను. అదెట్లనగా:- గుగ్గిలము + తేనె + మైనము + కర్పూరతైలము అను నీమూడువస్తువులను కలిపి పోతపోసి, చల్లార్చి గట్టి దిమ్మక్రింద తయారుచేసెను. అది బాగుగా ఎండినపిడుకవలెను, గట్టి రొట్టెవలెను, ఉండెను. దానిమీద సరిగా పట్టునట్లు సిబ్బివంటి సత్తుమట్టు చేయించెను. అసత్తుసిబ్బికి గాజుపిడికూడఅమర్చెను. తరువాత ఆ గుగ్గిలపుదిమ్మపయిని రోమవస్త్రముతో మథించినను, పిల్లిచర్మముతో నాలుగుసార్లు కొట్టినను విద్యుత్తు ప్రభవించును. వ్రేలితో స్పృశించగా చిన్న మిణుగురు పుట్టును. అపుడు గాజుపిడి పట్టుకొని, సత్తుసిబ్బిని ఎడముగా తీయవలెను. ఆసిబ్బినిండ కావలసినంత విద్యుత్తు ఉండును. మాటిమాటికి మథింపనక్కర లేకయే దిమ్మపై సిబ్బి పెట్టుచు, వ్రేలితో ముట్టి పిడితో తీయుచు వచ్చినపక్షమున ఎంతవిద్యుత్తైనను తీయవచ్చును. దీనికి ఎలెక్ట్రోఫోరస్, విద్యుజ్జనకమని పేరుపెట్టెను. దీనితో నితనికీర్తి యూరపు ఖండమంతయు వ్యాపించెను. 19 సంవత్సరముల చిఱుతప్రాయమపుడే కోమోవిద్యాలయాధికారులు ఇతనికి పదార్థవిజ్ఞానశాస్త్రము (ఫిజిక్స్)ను బోధించు మహోపాధ్యాయ పదవి నిచ్చిరి. అనంతరమాతడు ఫ్రాన్సు, ఇంగ్లండు మొదలగు దేశములకు వెళ్లి అచ్చటిప్రముఖులను సందర్శించెను. కాని వారెవ్వరును ఇతనివిజ్ఞానమును వికసింపచేయజాలకపోయిరి.

ఇట్లుండగా, గాల్వనీ, కప్పకాళ్ళతో ప్రయోగములు చేసి జంతువిద్యుత్తు (ఏనిమల్ ఎలెక్ట్రిసిటి) కనిపెట్టినట్లు ప్రకటించెను. గాల్వనీదొరవాదమును వోల్టా అంగీకరింపలేదు. జంతువిద్యుత్తని చెప్పతగిన విద్యుద్భేదమొకటి లేదని ఖండించుచు వోల్టా చిన్నప్రయోగమును చేసెను. అదేమనగా:— ఒకచిన్న సీసపురేకును వెండిరేకును చేయించి ఒకటి నాలుకమీదను, రెండవది నాలుకక్రిందను పెట్టుకొనెను. నాలుకవలన ఈ రెంటికిని సంపర్కము కలిగినవెంటనే నాలుకకు ఒకానొక వింతరుచి తగులుచుండెను. పిమ్మట నాలుకక్రిందిరేకు నాలుకమీదికిని, మీదిరేకు క్రిందికిని మార్చి పెట్టుకొని చూడగా మరొకవింతరుచి తగులుచుండెను. రెండును వెండిరేకులుగాని, సీసపురేకులుగాని వాడిచూచినపుడు ఈవింతరుచులు తగులవు. రేకులలో ఒకటి వెండిది, రెండవది సీసపుది అయినపుడుకూడ వాటికి పరస్పరము నాలుకనరములవలన సంపర్కము కలుగని పక్షమున ఈ వింతరుచు లుండవు. కనుక భిన్నజాతులలోహములకు జంతునరములవలన కలిగిన సంపర్కమే పైనిచెప్పిన నాలుకరుచులకును, గాల్వని చూచిన కప్పకాళ్ళచలనమునకును కారణముకాని, వేరు కారణము లేదని వోల్టా ఖండించెను. జంతువిద్యుత్తను ప్రత్యేక విద్యుద్భేదము లేదని వోల్టా సిద్ధాంతము చేసెను. మరియు భిన్నలోహములకు సంపర్కముచే జనించిన విద్యుత్ స్వభావమును నిరూపించుటకు సూక్ష్మమైన ఎలెక్ట్రోస్కోపు అనగా విద్యుత్ శోధిని యను సాధనమును కల్పించెను.

### విద్యుద్భేదములు.

గాజుదండమును పట్టువస్త్రముతో మథించినపుడు పుట్టిన విద్యుత్తును, గుగ్గిలమును రోమముతో మథించినపుడు పుట్టిన విద్యుత్తును, వేరువేరు: మొదటిదానికి కాచవిద్యుత్తనియు, రెండవదానికి గుగ్గులువిద్యుత్తనియు పేళ్ళున్నవి.

మరియును అందొకదానికి ధనవిద్యుత్తనియు, రెండవ దానికి ఋణవిద్యుత్తనియు కూడ పేళ్ళున్నవి. అందువలన నొకటి ధనముగలదనియు, రెండవది ఋణములలో మునిగినదనియును మనము భావింపగూడదు. రెండవదే ధనవిద్యుత్తనియు మొదటిదానినే ఋణవిద్యుత్తనియు చెప్పినను చెప్పవచ్చును. అయినను బహు దేశములలో బహుజనులీసంకేతముల నొప్పుకొని ఆపేళ్ళతో వ్యవహరించుచున్నారు. ఒకటి పాజిటివ్ - రెండవది నెగిటివ్ - అని చెప్పుచున్నారు. కనుక మనము ఒకదానిని సా-విద్యుత్ అనియు, రెండవదానిని మా-విద్యుత్తనియు చెప్పుదము. ఈ రెండును బహువేగముతో నొండొంటి నాకర్షించుకొని కలిసి పోవును. అప్పుడే చణుకులు పుట్టును. మెఱుపులును, పిడుగులును ఈ పెద్ద చణుకులతో పుట్టినవేను.

## రేకుదొంతరవలన విద్యుత్ప్రవాహము పుట్టించుట.

సిబ్బివలె గుండ్రముగానున్న ఒక రాగిరేకునకు తగులుచు అంతే పరిమాణముగల (జింక్) తుత్తునాగపురేకును పెట్టి, ఆ రేకులమీద పులుపునీటి తడిగుడ్డను పెట్టెను. ఆమీద మరియొక రాగిరేకును, జింకురేకును ఉంచి పైని మరొక తడిగుడ్డను పులుపుచేసి కప్పెను. ఇట్లనేక పొరల రేకులుగల దొంతర తయారుచేసి, మీది రాగిరేకుతో అడుగున జింకురేకునకు సంపర్కము కలుపునంతలో విద్యుత్ప్రవాహము పుట్టెను. ఇది చాల నెమ్మదిగా ప్రవహించును. కనుక మచ్చికఅయిన గోవువలె మనకు పనికి వచ్చును. మథించి పుట్టించిన విద్యుత్తు వన్యమృగమువలె భీకరమై సులభవశ్యముగాక యుండును. ఈ దొంతరలకు (వోల్టాస్ పైల్) వోల్టా దొంతరలని పేరు.

## విద్యుద్ఘటములు.

ఎనిమిది సంవత్సరములు దీక్షతో పరిశోధనలు చేయగా ఆమ్లముగల ఘటములలో, లోహపురేకులను ముంచియుంచి తీగెలతో సంపర్కము కలుపగా విద్యుత్ప్రవాహమును సులభముగా పుట్టించవచ్చునని స్పష్టమయినది. ఇట్టి ఘటము లనేకములు చేర్చుటచేత ఘటమాలలు (బ్యాటరీ) ఏర్పడును. ఒక ఘటమువల్ల నుద్భవమయ్యెడి విద్యుత్ప్రవాహముకంటె, ఘటమాలవలన విశేషవిద్యుత్తు జనించి ప్రవహింపగలదు. సంఘీభావము ఎందును బలముకదా?

## లోహములపట్టిక

ఇంక ననేకలోహములతో పెక్కు ప్రయోగములు చేసి వోల్టా ఒక చక్కనిపట్టిక తయారుచేసెను. ఈ పట్టికయొక్క విశేషమేమనగా:—ఈ వరుసలో నేధాతువైనను దానితరువాత వచ్చెడి ధాతువుతో సంపర్కము పొందినపుడు కాచవిద్యుత్తును పొందును:—అనగా గాజుదండమును పట్టుగుడ్డతో మథించినపుడు పుట్టెడు విద్యుత్తును పొందును.

పట్టిక:—

| | | | |
|---|---|---|---|
| 1 జింకు | (తెలుగున) | తుత్తునాగము | (English) Zinc |
| 2 సీసము | (సంస్కృతమున) | నాగము | ,, Lead |
| 3 సత్తు | ,, | వంగము | ,, Tin |
| 4 ఇనుము | ,, | లోహము | ,, Iron |
| 5 రాగి | ,, | తామ్రము | ,, Copper |
| 6 వెండి | ,, | రజతము | ,, Silver |
| 7 బంగారము | ,, | స్వర్ణము | ,, Gold |

అయితే తుత్తునాగమునకు గుగ్గులు విద్యుత్తు పట్టదు. బంగారమునకు కాచ విద్యుత్తు పట్టదు

[చూ. కాళిదాసు చెప్పిన ద్రౌపదీ పాండవ సంబంధము-పాండవులు ద్రౌపదికి భర్తలు, బావగార్లు-మఱదులు అగుదురు. ధర్మరాజు మఱదికాడు; సహదేవుడు బావ కాడు; అన్నట్లు.]

పైవరుసలో దూరమధికమైనకొలది లోహములు బలవత్తరమైన విద్యుత్ప్రవాహమును జనింపజేయును. (జింక్ అండ్ గోల్డ్) తుత్తునాగ స్వర్ణముల మూలముగా బలవత్తమమైన విద్యుత్తు పుట్టును.

ప్రకృతిశక్తులన్నిటిలో విద్యుత్తు మిక్కిలి చపలము; మహాద్భుతము; మహత్తరము. ఇట్టిదివ్యప్రభావముగల విద్యుచ్ఛక్తి వోల్టామహాశయుని కృషివలన సాధువై, మచ్చికపొంది మనగృహములలో నిర్బంధింపబడినది. రాసాయనికపద్ధతుల (కెమికల్ మెథడ్స్) వలన విద్యుత్తును పుట్టించుటకు మార్గదర్శియై యితడు లోకమునకు మహోపకారము చేసినాడు.

1789 సంవత్సరములో మథిత విద్యుత్ప్రభావము చేత నీరు మొదట భేదింపబడినది. అందునుండి భిన్నధర్మములుగల రెండు వాయుపదార్థములు- ఆక్సిజను, హైడ్రొజనుఅనునవి ప్రత్యేకింపబడినవి.

ఘటజనితమైన విద్యుచ్ఛక్తిచే 1800 సంవత్సరములో నికొల్సన్ - కార్లైల్ అను పరిశోధకులు జలమును భేదించిరి.

సర్ హంఫ్రీ డేవీఅను పరిశోధకుడు రెండువేల ఘటములుగల (బ్యాటరీ) ని ఉపయోగించి 1807 లో పొటాషును భేదించి, పొటాసియమ్ అను ధాతువును ప్రత్యేకించెను. ఈ ఘటజనితమైన విద్యుత్ప్రవాహము అయస్కాంతపు సూదిని చలింపచేయుచు, టెలిగ్రాఫుమూలముగా దూరమును సంహరించి వార్తలు క్షణములో ఖండాంతరముల కందిచ్చుచున్నది. ఈతడు వైచిన పునాది పైలేచి నేటి విద్యుత్సౌధము వామనమూర్తివలె అన్నిదిశలను వ్యాపించుచున్నది.

1801 సంవత్సరములో నెపోలియన్ వోల్టాను పిలిపించి బహువిధముల గౌరవించి ఇటలీరాజ్యములో నితని నొక ప్రభువుగా చేసి శాసనసభ్యత్వమిచ్చెను. 1804 సంవత్సరములో నితడుపాధ్యాయత్వమునుండి విరమించెను. 1827 సంవత్సరము మార్చి ౫వ తేదీని భౌతిక దేహమును విడిచెను. అయినను ఇతనిని మనము ప్రతిక్షణమును స్మరించుచున్నాము. ఎట్లనగా మనము ఇన్నికుంచముల ధాన్యమని, కొలపాత్రను వాడునట్లు, విద్యుత్ప్రవాహ బలనిర్ణయమునకు ఇన్ని వోల్టులు అని ఇతనిపేర కొలతపేరు ఏర్పడియున్నది.

బొగ్గువంటి చవుక పదార్థముతో ఏ యితర చవుక పదార్థ సంపర్కముచేత విద్యుచ్ఛక్తి కొల్లలుగ పుట్టునో అట్టి చవుక వస్తువును కనిపెట్టగల మరొక వోల్టాకొఱకు నేడు జగత్తు నిరీక్షించుచున్నది.

# రోథాంస్టెడ్ ప్రయోగస్థానము

రోథాంస్టెడ్ ప్రయోగస్థానము (Rothamstead experiment station) జాన్ బెన్నెట్ లాస్ అనునొక ఇంగ్లీషుప్రభువు 1843 సంవత్సరములో ఇంగ్లండులో స్థాపించెను. పలురకముల నేలలలో పలురకముల సస్యములకు కావలసిన ఎరువులను రసాయనపృథక్కరణమువలన తెలిసికొని ప్రచారము చేయుటయే వీరి ఆదర్శము. బెన్నెటులాస్ ప్రభువును, జోసెఫ్ హెన్రీ గిల్బర్టు అను మరియొకరును ౬౦ సంవత్సరములు భాగస్వాములుగ నుండి పై సంస్థను నడపిరి. లాస్‌ద్వార సలహాఆలోచనలకును, గిల్బర్టుద్వార శాస్త్రీయ ప్రయోగములు చేసి ఫలితములు కనుగొనుటకును కడు సమర్థులు. ప్రథమమున వీరికి ప్రత్యేక పరిశోధనశాల లేవియు లేవు. మెదటి పదిరెండు సంవత్సరములు మామూలుపొలమే వారి పరిశోధనశాల యంత్రములయు, ఇతర పరికరణములయు సహాయము లేకుండనే వారా పొలములో సస్యములను పెంచి ఏ ఎరువు ఎంతవరకు ఉపయోగపడునో పరిశోధనములు సలిపిరి. ఈపరిశోధనములఫలితముగావారు ప్రప్రథమమున సూపర్ ఫాస్ఫేటు (శల్యాదిస్ఫురితము) అను ఎరువును కనిపెట్టిరి. తరువాత సల్ఫేట్ ఆఫ్ అమోనియా (అమోనియా గంధకితము), సల్ఫేట్ ఆఫ్ పొటేష్ (పొటేష్‌గంధకితము) అను ఎరువులను కనిపెట్టిరి. వీటిగుణములను ౫౦ సంవత్సరములు పరీక్షించి వారు ఫలితములవివరములను ప్రకటించిరి.

లాస్, గిల్బర్టుగార్లతదనంతరము 1902 మొదలుకొని 1912 వరకు సర్ డేనియల్ హాల్ గారు పై ప్రయోగస్థానమునకు పెద్దరికము వహించిరి. వీరి తరువాత సర్ జాన్ రస్సెలుగారు డైరక్టరుగా నేర్పడిరి. ఇప్పుడు వ్యవహరించుచున్న డైరక్టరు వీరే. వీరు ఇండియా రాజప్రతినిధిగారి అహ్వానముపైని హిందూదేశములో రైతులకు హితబోధ చేయుటకుగాను వచ్చియున్నారు.

# ఇండియాలో విద్యావిధానము

## సర్ జాన్ ఆండర్సనుగారి విమర్శనము.

ఇంగ్లాండులో పిల్లలను గుంపులుగజేర్చి ముఖ్యనగరములందు ఒడులను మేకలమందలవలె తోలుచుండినచో పిచ్చిచేష్టక్రింద నెంచెదరు. ఇండియాలో అట్టిపని జరుగుట సామాన్యమైపోయినది. సాహిత్యవిద్యకు ఇండియాలో ఏడాదికి అయిదుకోట్ల రూపాయలు ఖర్చగుచున్నవి. ఇందులో చాలభాగము వృత్తివిద్యలకు వినియోగింపవచ్చును. ఈ దుబారాఖర్చునకు ప్రభుత్వమువారు సహాయపడుచు, వృత్తివిద్యలకు ద్రవ్యము చాల దనుట ఆశ్చర్యము గొల్పుచున్నది. ఇప్పటి సెకండరీ విద్యావిధానమును మార్చుట అవసరము. గ్రామపునరుద్ధరణము శాశ్వతముగ వాయిదా వేయ వీలుకలుగదు. నిరుద్యోగులసంఖ్య పెరిగిపోవుచున్నది. కావున వెంటనే శ్రద్ధవహింపవలసియున్నది, అని ఆండర్సనుగారు "ఈస్టుఇండియా అసోషియేషన్" సభయందు తెలిపిరి.

# మందిమనుగడ—I

శ్రీ మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు.

ఉసుఱుగములు — జీవరాసులు - ౮౪,౦౦,౦౦౦ అని సంస్కృతపురాణములలో కానవచ్చును. అవి కదలునవి-చరములు, జంగమములు — కదలనివి — అచరములు, స్థావరములు — అని ౨ తెఱంగులు.

అందు, కదలునవి ౬౪,౦౦,౦౦౦; కదలనివి ౨౦,౦౦,౦౦౦. కదలువానిలో, మంది ౪,౦౦,౦౦౦; గొడ్లు ౩౦,౦౦,౦౦౦; పిట్టలు ౧౦,౦౦,౦౦౦; పురుగులు ౧౧,౦౦,౦౦౦; నీటిపుట్టువులు ౯,౦౦,౦౦౦.

పైలెక్కలనుబట్టి, మందిగముల మొత్తము మిక్కిలి తక్కువ. అయినను, నేలనాలుగుచెఱఁగులను ఆయా నాడులలోను-లంకలలోను ఉన్న ౪ లక్షలగములవారును నానాఁటికి పెరిఁగి, ఇపుడు సుమారు ౧౯౦ కోట్లమంది అయినారు. వీరిలో కొందఱమనుగడనుగూర్చి కొన్ని వేలయేండ్లనుండి కొంత తెలియవచ్చుచున్నది. కాని, అంతవఱకయినను, తక్కినవారిమనుగడనుగూర్చియేని, పుట్టుక మొదలుకొని మొన్నమొన్నటివఱకును మొత్తపుమంది మనుగడనుగూర్చియేని, పెక్కురకు కొంచెమైనను తెలియవచ్చుట లేదు. ఇంతకు,

"కారే రాజులు? రాజ్యముల్ కలుగవే?
గర్వోన్నతిన్ జెందరే?
వారేరీ? సిరి మూటగట్టుకొని, పో
వంజాలిరే? భూమిపై
పేరైనం గలదే?........."

అని బలిఱేఁఱేఁడు నుడివినటుల ఱేఁడులపేరే పోయినపుడు, తక్కిన చిల్లరవారిమనుగడ తెలియరాకున్నచో వింత ఏమి? అట్లని బొత్తుగా లేకపోలేదు మందిమనుగడ! అది వేదములలోను, పురాణములలోను, ఇతిహాసములలోను, టూకీగాను - మఱుఁగుగాను కలదు. అయినను, ఎఱుకకలవారికేకాని పెఱవారికి అది సరిగా ఎఱుకపడదు. అందుచేత, మేటిఅయ్యవారల ముదలమీఁద బ్లావట్స్కీ-అమ్మ "సీక్రెట్ డాక్ట్రిన్"లో మందిమనుగడ కొంత సులువుగా తెలిపినది. అనిబెసంటమ్మ మొదలగువారును మఱికొంత తెలిపిరి.

సంస్కృతపుపొత్తములలో మందిమనుగడనుగూర్చి పలుచోట్ల పలుతెఱంగులుగా కానవచ్చునని పలుకుమనుగడలో తెలిపియుంటిని. అందు, వారు మనువుబిడ్డలు అనుట ఒకటి; దానినిబట్టియే మందికి 'మనుజులు', 'మానవులు' - అనుపేర్లు వచ్చినవి. ఆదాము - అవ్వలవలన మంది పుట్టినట్లు బైబిలు తెలుపును. ఇట్లే ఆయానాడులలో అచ్చటివారి తొంటివ్రాఁతలలో మందిపుట్టుకనుగూర్చి ఒక్కొక్క చందముగా ఉండును. అయినను, ఈ వ్రాఁతలన్నియును మంది ఎట్లో ఎల్లఱేనివలననే పుట్టినట్లు తెలుపును. 'మంది ఎల్లఱేనినుండియే వత్తురు; మరల వానినే చేరుదురు' అని మహమ్మదు చెప్పినమాట సాటిలేనిమాట! నిక్కంపు మాట !!

ఇఁక, డార్విన్-అను తెల్లాయన తన తెలివి అంతయు చూపి, అరసి అరసి, ఒకరకపుకోఁతులవలన మంది పుట్టినట్లు తేల్చె. కాని, దానికి తెల్లవారిలోని నెఱవాదులే పలువురు ఇయ్యకొనకున్నారు. మఱి 'దివ్యజ్ఞానసమాజము' వారన్ననో డార్విన్ చెప్పినది తప్పని తెలిపి, మంది క్రిందివడువున పుట్టి, పెరిఁగినటుల ఎఱుకపఱుచుచున్నారు. వారివ్రాఁతలనిగ్గుకూడ మంది మనువుబిడ్డలనుటయే. కాన, వారును ఋషులవ్రాఁతలను మన్నించువారే.

## తల్లితెగలు

మంది ౭ తల్లితెగలుగా ఉండును. వారిపుట్టుకలు, రూపులు, తెలివితేటలు, మనికిపట్లు మొదలగునవి వేఱువేఱుగా ఉండును. ఇప్పటికి ౪ తల్లితెగలు పెరిఁగి, విఱిగినవి. ౫వది పెరిఁగి, పెద్దఱికము చేయుచున్నది. దీనితరువాత ౬, ౭ తల్లితెగలు ఏర్పడి, పెరిఁగి, విఱుగవలసియున్నది.

ఆయా తెగల పెంపుసొంపులును చేటుపాటులను బాగుగా అరయుచో, మనము నేర్చుకొనవలసినది ఎంతో కానవచ్చును. ఎఱుకకు ఎల్ల లేదని తెలియవచ్చును. మనకు తెలిసినది మిక్కిలి తక్కువ అని బాగుగా నచ్చును.

## ౧వ తల్లితెగ

ఈ తెగకు పెద్దగా ఉండు గ్రహము వేవెలుఁగు; అది, నిజమునకు, తానె పెద్దకాక, గుట్టుగా ఉండు వరుణగ్రహమునకు మాఱుగా ఉండును. పితృదేవతల మేనులనుండి పైకి ఉబికి, పెరిఁగి, ముక్కలుగా విడిపోవుటవలన ఈ తెగవారిమేను లేర్పడును; అవి ఉసుఱు కలిగియుండును; కాన, తాము పుట్టినమేనులవలెనే పెరుఁగును. మంది ఈ తెగలో పుట్టు చందమిదియే.

ఈ తెగవారిరూపు మిక్కిలి పెద్దది. నడి-ఆసియాలో బాల్కు-ప్రోలికి దగ్గఱనున్న 'బామియన్' అను పాడుపడిన ప్రోలిచెంతను పొడచూపెడి కొండ-ఒండలయెదుట ఇప్పటికిని పెలయుచున్న మనిసిబొమ్మలలో పెద్దది వీరిఒడ్డు పొడువులు తెలుపుటకు ఏర్పఱచినదే. దీని యెత్తు ౧౭౩ అడుగులు.

వీరిమేనిలో వినికికి పనికివచ్చు చెవి ఒకటియే కలదు. కావున, వీరిని ఇంద్రియములు లేని పేరుసుఱులు - భూతములు - అనియు అందురు. నిజమునకు వీరు వేల్పులు; "యోగపుత్రులు;" "ఆత్మభువులు". (పలుకుమను గడ చూడుఁడు.) వీరి తెలివి ఆత్మమట్టమున ఉండును. పితృదేవతలు యోగనిష్ఠలో ఉండఁగా వారినీడలవలన ఏర్పడుటచేతనే వీరికి "యోగపుత్రులు"అను పేరు వచ్చినది. తల్లిదండ్రులవలన పుట్టక తమంత తామే పుట్టుటచే వీరికి "ఆత్మభువులు" "స్వయంభువులు"అను పేర్లు వచ్చినవి. వీరికి గట్టి నిప్పుదెబ్బలే తెలియుచుండెడివి. వీరి మనికిపట్టు ఉత్తరధ్రువపుతొలినేల.

## ౨ వ తల్లి తెగ

ఈ తెగకు పెద్దగా ఉండినగ్రహము గురుఁడు. ఈ తెగవారు కొందఱు తొలితల్లితెగవారివలెనే ఉబుకుటచేతనే పుట్టిరి. వీరికి మగాఁడుగుఱుతులు లేవయ్యె. మఱికొందఱు చెమటచే పుట్టిరి. వీరిమేనులలో మగాఁడుగుఱుల చిన్నెలేర్పడె. మొదటితెగవారిపై(నీడ)రూపు వీరికి లోని(రెండవనింగి)రూపుగా మాఱె. వీరు వదలివేసిన మేనులవలననే పిల్లలకు పాలిచ్చుగొడ్లు పుట్టి, నానాఁటికి పెంపొందె.

బామియన్ బొమ్మలలో ౧౨౦ అడుగుల యెత్తుకల రెండవబొమ్మ వీరిరూపును తెలుపును. వీరిమేను పసిఁడి పసుపురంగున చెలంగుచుండెడిది. ఆమేను తఱచుగా చెట్టువంటిరూపున కానవచ్చెడిది. వీరిలో కొందఱు మెకముల మాదిరికి దగ్గఱగాను, కొందఱు సగముమానిసిరూపునను ఉండెడివారు. వీరు, గాలికి కొట్టుకొనిపోవుచు, తేలుచు, ఎగురుచు, ఒండొరులతో సన్నాయిపాటలవంటి కేకలిడుచు తిరుగుచుండెడివారు. వీరే "కింపురుషులు"

వీరికి వినికిపసకు తోడు సోఁకుపసయును చేరినది. అందువలన, గట్టి నిప్పుదెబ్బలతోపాటు గాలిదెబ్బలుఁకూడ వీరికి తెలియుచుండెడివి. వీరి తెలివి కొంతవఱకు బుద్ధిమట్టమున ఉండెడిది.

వీరిమనికిపట్టు జువ్విలంక - ప్లక్షద్వీపము. దీనిని తెల్లవారు "హైపర్ బోరియన్" అందురు.

## ౩ వ తల్లి తెగ

ఈ తెగ రెండుగ్రహముల పెద్దఱికమున పెంపొందినది. అందు, తొలిగ్రహము తెలిగాము-శుక్రుఁడు దీనిబలిమిచే ఇందు పేడులు పుట్టిరి. రెండవది ఎఱ్ఱగాము-కుజుఁడు; దీనిబలిమిచే ఈతెగవారు, మగవారుగాను, ఆఁడువారుగాను, విడిపోయిరి.

ఇందు, ౧, ౨ పిల్లతెగలవారు చెమటపుట్టువులు; ౩, ౪, ౫ పిల్లతెగలవారు గ్రుడ్డుపుట్టువులు. ౩ వ పిల్లతెగలో పుట్టినపేడులు పుట్టఁగానే పెరిఁగి, వెంటనే నడచి, పరుగులిడెడివారు. వారిమేనులు, ఎఱుకదొరలకు-శుక్రమండలమునుండి వచ్చిన వేల్పులకు- మనికిపట్టులయ్యె. ౬, ౭ పిల్లతెగలవారు ఆలుమగలకు కలిగినవారు. మగలలో మొదటివాఁడు దక్షుఁడు; ఇతఁడు సుమారు ౧,౮౦,౦౦,౦౦౦ ఏండ్లక్రిందటివాఁడు.

వీరియెత్తు తొలుత ౬౦ అడుగులు. బామియన్ బొమ్మలలో మూఁడవది వీరిరూపు తెలుపుట కేర్పఱిచినదే. ఈ తెగవారిమేనిరంగు పలుచాయల యొఱుపు. వీరి నుదురు వెనుకకు వంగియుండెడిది; ముక్కు-చప్పిది; దవుడలు ఉబ్బి, పెద్దవిగా ఉండెడివి. వీరికి ఒకేకన్ను నొసటను ఉండెడిది, దానితోనే వీరు చూచుచుండెడివారు. ఈకంటికే, నొసటిక్రిందను రెండుకన్ను లేర్పడినపిదప, మూఁడవకన్ను - అను పేరు వచ్చినది. ౭ వ పిల్లతెగవఱకును రెండుకన్నులవాడుక మిక్కిలి తక్కువయే. ౪ వ పిల్లతెగవారు వానితో చూడ మొదలిడిరి. వానివాడుక హెచ్చినకొలఁదిని మూఁడవకన్ను తలలోనికి పోయిపోయి, తుదకు "పైనియల్ గ్లేండ్"గా మాఱినది. ఎఱుక హెచ్చినకొలఁదిని ఇది మరల కన్నుగా మాఱును; ఇదే ఎఱుకకన్ను; దీనికి కనరానిది ఎందును లేదు.

వీరిలో వినికిసోఁకుపసలకు చూపుపసయును చేరినది. వీరితెలివి ఆత్మ-బుద్ధి-మనస్సులమట్టమున ఉండెడిది. నిప్పు గాలి-నీటిదెబ్బలు వీరికి తెలియుచుండెడివి.

ఈతెగలోని తొలి ౨ పిల్లతెగలలో, పలుకు - హాయి-నోవులను, వలపుకినుకలను తెలుపువట్టికేకలుగానే ఉండి, ౩ వ పిల్లతెగలో ఒంటి - ఉలివు - నుడి-పలుకుగా ఏర్పడినది; అది ౪,౫,౬,౭ పిల్లతెగలలో నానాఁటికి పెంపొందినది.

ఈ తెగవారిలో క్రిందిరకములవారు చేరియుండిరి.

I. శుక్రమండలమునుండి వచ్చిన నేర్పరులు.

II. వేల్పుకొండ్లు - అగ్నిష్వాత్తపితలలోని మేటులు.

III. క్రిందితరగతులలఅగ్నిష్వాత్తులు; వీరిలో కొందఱు ౪,౫ తల్లితెగలలో అర్హాతులుగా పెంపొందిరి.

IV. ౬,౭ పిల్లతెగలలో చంద్రమండలమునుండి దిగిన రెండవతరగతిప్రొద్దుపెద్దలు - సౌరపితలు.

V. తొల్లి చంద్రమండలమున ఉండిన ౪ తరగతుల ఉసుఱులు - జీవులు.

ఈ తెగవారిమనికిపట్టు బూరుగుదీవి - శాల్మలిద్వీపము. దీనిని తెల్లవారు "లెమూరియా" అందురు. వీరు కొండలు తొలిచి మలచిన గొప్పగొప్పగుడులు కొంతవఱకు చెడినను, కొన్నిచోట్ల ఇప్పటికి కొంతవఱకు నిల్చియున్నవి. పెద్ద ప్రోళ్లుకూడ వీరు కట్టిరి. అందు శంబళమను పున్నెపుప్రోలు నేఁటికిని చెక్కుచెదరక వెలఁగుచున్నది.

ఈ తల్లితెగలోని ౫ వ పిల్లతెగలో వేల్పుఱేండ్ల దొరతనమున చక్కనినాజూకుతనము - నాగరకత - మొలకెత్తినది. ౬ వ పిల్లతెగవారు 'మెడగాస్కర్' అను పేరుతో ఇప్పుడొప్పుచున్న లంకపట్టున తొలుదొలుత కొండరాలతోను 'లావా'రాలతోను మేటివీడులు కట్టిరి. అవే తొలిగ్రీకులకును, తొలియీజిప్టువారికిని మేలుబంతులైనవి.

## మంది చెడిపోవుట - మొదటిపెద్దపోరాటము

మగవారుగాను,ఆఁడువారుగాను మంది విడిపోయినపిదప,వారికి ఒండొరులమీఁద వలపు హెచ్చినది.అగ్నిష్వాత్తులును, సౌరపితలును, పలువురు తమకంటె క్రిందితరగతిలోని పడంతుల చక్కఁదనమునకు చిక్కిరి. అందువలన వారికి తగనిబిడ్డలు పుట్టిరి. ఇట్టివారు నానాఁటికి హెచ్చిరి. ఇటుల పెక్కుమంది చెడిపోయిరి. వీరు మేనిహాయియే మిన్నగా చూచుకొనిరి. అందువలన వీరికిని, వేల్పుపెద్దలకట్టుఁబాట్లను బట్టియే నడచుకొనుఁదిమంది మంచివారికిని పోరాటము పుట్టినది. ఇదే తొలిపెద్దపోరాటము. దానియిక్కట్టులు చూచి, మంచివారు మెల్లమెల్లఁగా వడవైపునకు పోయిరి. చెడ్డవారు తెన్-తూర్పు - పడమటి వైపులకు చని, మోటువేల్పులతో పొత్తుచేసికొని, డబ్బును కొలుచువారైరి. వీరి బిడ్డలే నాల్గవతల్లితెగవారు. వీరు కొలిచిన లెమూరియావారి బొమ్మలనే ౪,౫ తల్లితెగలవారుకూడ వేల్పులుగాను, పోటరులుగాను కొలిచిరి.

## ఇప్పుడున్న లెమూరియను తెగవారు

ఆస్ట్రేలియాలోని తొలికాఁపులును, టేస్మేనియావారును, ౭ వ లెమూరియను పిల్లతెగలో మిగిలియున్నవారు. మలయావారును, పాపువానులును, ౭ వ లెమూరియను పిల్లతెగవారికిని, అట్లాంటియనులకును పుట్టినవారు. మఱొకపిల్లతెగనుండి పుట్టినవారు హాటెంటాటులు. తొలితెన్నాటివారు—తొంటిద్రావిడులు—౭ వ లెమూరియను పిల్లతెగవారును, ౨ వ అట్లాంటియను పిల్లతెగవారగు త్లవత్లీలును, ఇండియా తెన్వైపున కలసిమెలసియున్నపుడు, వారికి పొడమినవారు. నీగ్రోలును, తక్కిన నల్లతెగవారును, లెమూరియావారిబిడ్డలే.

## ౪ వ తల్లితెగ

ఈ తెగవారే అట్లాంటియనులు. వీరు శనిచంద్రుల పెద్దఱికమున పెరిఁగి, పేరుపొందిరి. వీరిలో తొలుతెక్కులను పిల్లతెగవారు తొగఱేని వల్లవెలుఁగును తమ చిల్లంగిపనులలో నేర్పుగా వాడెడివారు. వీరికిని మేనిహాయియే మిన్న. దానికతము కొంతవఱకు శనిపెద్దఱికమే. అట్లాంటియనులు ౮౦ లక్షలయేండ్లక్రిందట—ప్రకృతిశాస్త్రజ్ఞుల రెండవ యుగము తుదను—మూడవతల్లితెగవారివలన పుట్టిరి. వీరిమనువు 3 వ తల్లితెగలో ఎన్నుకొన్న వారిని 'తెగలపుట్టినిల్లు' అగు చెడని మడినేలకు కొనిపోయి,లెమూరియాతో పెన్ముంపుబారికి చిక్కకుండునటుల కాపాడె.

వీరి మేనియెత్తు ౨౫-౨౦ అడుగులు.బామియన్ బొమ్మలలో నాల్గవది వీరిరూపు తెలుపును. వీరిమేనులు మిక్కిలి గట్టివి.

లెమూరియావారికి ఉండిన మూఁడు మేనిపసలకుతోడు వీరికి చవిపసయును సమకూడినది. తావిపస పొసఁగమిచే వీరు కుళ్లినవియు తినెడివారు. వీరితెగకు చేరిన చీనాబర్మాలవారును అట్టితిండియే ఇప్పుడును తినుచున్నారు. వీరికి మూఁడవకన్ను కొంతవరకు వాడుకలో ఉండెడిది. కాన,చుక్కలజగము వీరికి కనఁబడుచునే ఉండెడిది.అందువలన వీరు చుక్కవేటలో నేర్పరు లయిరి; వారిలో కన్నాకు మయుడు.అతఁడు పెట్టిన తిరిపెమే తరువాతిచుక్కవేటకొండ్రకు సంచిమొదలు. ఈ తెగవారిలో చూచుపని రెండుకన్నులే చేయుచుండి, తుదకు మూఁడవకంటికి కొక్కుపెట్టినవి. దానితో వీరియొఱుకయు తగ్గిపోయినది.

౩౦

## ౧వ పిల్లతెగ:

ఈతెగవారు ర్మోహాలులు. వీరిమేనిరంగు బెడంగైనది. అసురులును, మొదటితరగతి పొడ్డుపెద్దలును దీనిలో పుట్టిరి. వీరు వడవైపునుండి తెంకవైపునకు వచ్చిరి. వీరి వేలుపు ఱేండ్లు అగ్నిష్వాత్తులు. వీరు బలిమితోడి నాజూకుతనమును పెంచిరి. ఆఫ్రికాలోను, దానిచుట్టుపట్టులను నెలకొనియుండిన లెమూరియనులను తఱిమివేసి, అందు తాము వలస ఏర్పరుచుకొనిరి. ౪ లక్షలయేండ్లక్రిందటి పెన్ముంపులో ఈపిల్లతెగవారు పెక్కురు రూపుమాసిపోయిరి. మిగిలినవారు వడకడకు వలసపోయి, నానాఁటికి గిడసలై, మోటువారై పోయిరి.

## ౨వ పిల్లతెగ:

ఈ తెగవారు త్లవత్లీలు. వీరి ఒడలిచాయ పసుపుపచ్చ. ఇప్పటి అట్లాంటిక్కు పెంకమున్నీటి లోనిపట్టున పుట్టి, పెరిఁగిరి. మార్పు చెందుచుండినను, వీరు ఎఱుకదొరలకు అప్పటికి లోఁబడియే ఉండిరి. అట్లాంటియనుల నాజూకుతనములో మిక్కిలి గొప్పది అని చెప్పఁదగుతఱి, ఈ పిల్లతెగలో వేల్పుఱేండ్లక్రింద ఎంతో నెమ్మదిగా సాగిన యేలుబడిలోని తొంటితఱియే; దానికి సాటివచ్చునది వేఱొండులేదు. అట్టిమేటిప్రోలితనము ౪లక్షలయేండ్లక్రిందటి పెన్నీటిముంపుపాలయిపోయె. ఆవెనుక, చావఁగా మిగిలినవారు తెన్‌తూర్పువైపులకు పోయి, అప్పటికి, మిగిలిన లెమూరియనులతో చేరిరి. వారిలో కొందఱు ఇండియాలోని తెన్నాటికి వచ్చి, అచ్చట నెలకొనియున్న ౭వ లెమూరియను పిల్లతెగతో పొత్తు కలిపికొనిరి. ఆ యిరుతెగలవారిబిడ్డలే తెన్నాటివారు—ద్రావిడులు.

## ౩వ పిల్లతెగ:

ఈ తెగవారు తొలైక్కులు; వీరు చక్కనివారు; ఎఱుపునుండి గోదుమకఱకును సాగినది వీరిరంగు. ఇప్పటి యినుపకడ్డీలను వంపఁగలది వీరి మేనిబలిమి! వీరికి తగిలిన గాయములు సులువుగా మానెడివి. వీరినరములకట్టు గట్టిది. కాని సున్నితము కాదు. వీరితలని మూఁడవ కంటిమాపుపస తగ్గినది. మిక్కిలి బల్లిదులగు ఆసురులును, సౌరపితలలో మిన్నలును, ౪ లక్షల పెన్ముంపుదాడికి లోఁబడక నిలిచిన చోట్ల పుట్టిరి. అప్పుడే వారిప్రోలితనము మిన్నంటె. మినుకువేఁటకాఁడు మేటి అగుమయుఁడు వీరిలోనివాఁడే. గుట్టు ఱుంగరానినారదుఁడు—ఆయా తెగలమంచిచెడ్డలు తన పిడికిటిలో ఇముడ్చుకొనినదిట్ట—అప్పుడప్పుడు వీరికి కనబడుచుండె. వీరు గాలిపడవలలో నింగిదారిని తిరుగుచుండెడివారు; కెమెస్ట్రీలో గట్టివారు; బంగారు చేయుటలో అందె తొడిగిన చేతులు; సేద్యమున మంచి నేర్పరులు: కట్టడపు పనిలో బలుదిట్టలు; వీరి ఱేఁఱేనిది పసిండిగవకులవీడు. వీరి దొరతనమా? మేలుబంతి! వీరిలో చదువురానివారు కంచుకాగడాలు పెట్టి వెదకివను కొనరాకుండిరి!! ఇటుల వీరిదొరతనపుసౌరు నడిమిన్ను ముట్టినది!!!

అప్పటికి మఁది తమంత తాము ఒంటరిగా నడవవలసిన హదనుకూడ వచ్చినది. అందుచే, వేలుపుదొరలవంగడమువారు, తమదొరతనము వదలివేసిరి. ఏలుబడి కళ్ళెము బక్కచేతులలో పడినది. అది చూచి, అసురులు చొరవచేసి, ఎదురుతిరిగి, ఉన్న ఱేఁఱేనికి పోటీఱేఁఱేని నెలకొల్పిరి; అలంతులచే తమ్ము కొలిపించుకొనిరి; 'వామాచారములు' వాడుకలోనికి తెచ్చిరి; బవరములు చేసిరి; తెల్లఱేఁఱేని తఱిమివేసిరి; హిరణ్యాక్షుని గద్దెమీఁది కెక్కించిరి. ౮,౫౦,౦౦౦ ఏండ్లక్రిందటి బలుముంపులో తొలైక్కుల మేటిదొరతనము మంటఁ గలిసినది.

## ౪వ పిల్లతెగ:

ఈ తెగవారు తురేనియనులు; వీరిలో పెక్కురు రక్కసులు - చెడుమెకములకంటె బెడిదులు; వీరు, పసితనముననున్న ౫వ తల్లితెగవారితో—ఆర్యులతో—మాఱుకొని, పోరుచుండిరి. పురాణములలోని కొన్నిపాళ్లు వీరిపోరుముచ్చటలపోరు.

## ౬వ పిల్లతెగ:

ఈ తెగవారిని సెమిటిక్కు లందురు; వీరు దెబ్బలాటముచ్చులు; అల్లరిమూఁక. ౫వ తల్లితెగవారి విత్తనములు వీరినుండియే వచ్చినవి. వీరివంగడములోని ఒకకుదుటివారిని మనువు మొదట ఎన్నినను, సర్దుఁబాటుతనము లేమింజేసి తుదకు వారిని వదలివేసె. ఆకుదుటిలోనివారే యూదులతొంటిపెద్దలు.

## ౭వ పిల్లతెగ:

ఈ తెగవారే అక్కేడియనులు. ముగ్గురిలో ఇద్దఱు చొప్పున తొలైక్కులను మ్రింగివేసిన పెన్ముంపువకు పిమ్మట వీరు పుట్టిరి. తొలైక్కులలో మిగిలినవారు వడకడకు వెడలి, వీరితోడనే కలసిపోయిరి. ఈ అక్కేడియనులును, దీనితరువాతి పిల్లతెగలోనివారు కొందఱును కలియఁగా పుట్టినవారే 'పెలన్‌జియనులు'.

31



౭ వ పిల్లతెగ:

ఈ తెగవారికి మంగోలియనులని పేరు. వీరు తురేని యను తెగనుండి పొడమిరి. దీనినుండియే లోనాటి చీనావారును, మలయావారును, తిబెట్టువారును, హంగేరి యనులును, ఫిన్నులును, ఎస్క్విమోక్సులును పుట్టిరి. దీని కోవలు కొన్ని వడ-అమెరికాలోనితో త్తెక్కులతో చేరిరి. కాన, ఎఱ్ఱఇండియనులలో మంగోలియను నెత్తురు కలదు. జపానువారు దీనితుదికోవలలో ఒకదానికి చెందినవారు. మంగోలియనులలో పెక్కురు చిన్న-ఆసియాలోను, గ్రీసులోను, దానిచుట్టుపట్టులలోను నెలకొని, అక్కడ ౫ వ తల్లితెగవారిలోని ౨ వ పిల్లతెగవారిలో కూడి, పెంపు చెందిరి. తొలిగ్రీకులును, ఫోనిషియనులును, ఈ యిరు తెగల వారిబిడ్డలే.

ఇపు డున్నమంది మొత్తములో హెచ్చుపాలు ౮ వ తల్లితెగకు చెందినదే. కాని, అందు మున్ముందు పెంపొంద గలవారిలో మిన్నలు జపానువారే; వారి తరువాతి వారు చీనావారు.

# స్వర్గీయ దేశభక్త ధర్మవీర వామనునాయకుగారు

వామనునాయకుగారు హైదరాబాదు నగరమున తమ స్వగృహమున అకస్మికముగ, గుండెనడక నిలిచిపోవుటచే ది ౮-౧౧-౩౬ తేదీని మరణించిరి.

వీరు హైదరాబాదు సంస్థానములో జాగీర్దారు; శాసన సభలోను, మునిసిపల్ కార్పొరేషన్‌లోను సభ్యులు; ప్రజాసేవకులలో అగ్రగణ్యులు; హైదరాబాదు కాంగ్రెసు సంఘమునకును, సనాతనధర్మ సభకును అధ్యక్షులుగ నుండిరి. ఎల్లప్పుడును ఖద్దరునే ధరించెడువారు. సంఘ సంస్కరణముపట్ల ఉదారభావములు కలవారు. "వివేక వర్ధని ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషను"కు వీరు లక్ష రూపాయలను మూలధనముగా "ఎండ్‌మెంటు" ఇచ్చిరి. కన్యాగురుకులమునుకూడ వీరే స్థాపించిరి. ఆంధ్రోద్యమమునకు వీరు పట్టుకొమ్మగానుండిరి. "పీపిల్సు ఎడ్యుకేషనల్ కాన్ఫరెన్సు"కుకూడ వీరే ప్రధానులు. ప్రాథమికవిద్యను నిర్బంధముగా నేర్పవలెనను తీర్మానమును వీరు శాసనసభలో నుపపాదించిరి. త్వరలోనే జరుగనున్న మరాటీసాహిత్యసభకు వీరినె సన్మాన సంఘాధ్యక్షునిగా ఎన్నుకొనిరి.

కార్పొరేషనుకుకూడ వీరిని అధ్యక్షులుగా ఎన్నుకొనిరి. వీరి పెద్దరికపుభాగ్యము పోయినందులకు పలువురు మిక్కిలి వగచుచున్నారు. వీరి ఆత్మకు శాంతికలుగుం గాక!

# ఆంధ్రరాష్ట్ర జీవకారుణ్య సంఘము - బెజవాడ.

కడచిన నెల గ్రంథాలయ సర్వస్వములో పైశీర్షిక క్రింద మేము చేసిన ప్రకటనమందు జీవకారుణ్యసంఘములు స్థాపింపబడిన కొన్ని స్థలములను, పనిచేయుచున్న కొందరి పేర్లను పేర్కొనియుంటిమి. అవి సమగ్రములు కావనియు, మరికొన్ని సంస్థలును, మరికొందరు జీవకారుణ్యపరులును పనిచేయుచున్నట్లు తెలియవచ్చుచున్నది. ఇందుకలన మా కెంతయు సంతసమైనది. సమగ్రమగు వివరములు అందినవెంటనే సంస్థలయు, అందుకు సంబంధించిన కార్యనిర్వాహకులయు పట్టికలను ముందు ప్రకటింతుము.

కొందరు మిత్రులు ఆంధ్రరాష్ట్ర జీవకారుణ్యసంఘముతో అనుబంధమేర్పరచుకొనిరని వ్రాయబడినట్లు అపోహపడిరనికూడ తెలియవచ్చుచున్నది. అట్లు వ్రాసియుండలేదు. ఆంధ్రరాష్ట్ర జీవకారుణ్య సంఘమువారి ఆశయమగు జీవకారుణ్యమునుగూర్చియే మేము పేర్కొనిన స్థలములలోని సంస్థలును పనిచేయుచున్నవని అభిప్రాయమును మాత్రము తెలిపితిమి. కనుక మిత్రులు గమనింతురుగాక!

గాంధివిలాస్,<br>
బెజవాడ,<br>
౨-౧౨-౩౬.

ఇట్లు,<br>
కార్యదర్శి,<br>
ఆంధ్రరాష్ట్ర జీవకారుణ్యసంఘము.

# గ్రంథాలయములు - పశు చికిత్సాలయములు

శ్రీ "అభినవసహదేవ" యేజెళ్ల శ్రీరాములు చౌదరిగారు.

పశుసంరక్షణము భారతీయుల కుత్తమధర్మమై యున్నది. ఇయ్యది అత్యంతసనాతనమగు నార్యధర్మము. హిందువులు, బౌద్ధులు, జైనులు, మున్నగు మతములవా రందరును గోవును పరమభక్తితో నారాధించుచున్నారు. సాలగ్రామము, తులసీబృందావనము, అగ్ని, గోవు, అనునవి పూర్వాచారపరాయణులకు పరమపూజ్యములు. పుణ్యాంగనలు గోవును మహాలక్ష్మి యని పసుపుకుంకుమలతో, పుష్పదామాదులతో నలంకరించి, నిత్యమును ముఖ్యముగా కొన్ని ప్రత్యేకదినములందు నారాధించెదరు. భక్తులు భక్తిభరితులై స్వయముగ లేతపచ్చికల గ్రహించి శ్రద్ధతో గోవులకును, గోవత్సములకును, చేతులార మేపి, అందువలన తమకు తరుణోపాయము కలుగునని నిక్కముగ నమ్ముచున్నారు.

## గోహింస.

సాక్షాద్భగవదవతార మనియు, పురాణపురుషుఁడనియు గీతాచార్యుఁడనియు, హిందువులచే పరమభక్తితో నారాధింపఁబడుచున్న శ్రీకృష్ణభగవానుని కథలందు గోవులసంబంధము లేనివిషయమేకనఁబడదు. గోపాలపరీవృతుఁడు, గోపాలబాలుఁడు ననునవి శ్రీకృష్ణున కన్వర్థనామములైనవి. ఆకతమునఁగూడగోవులు పరమపూజనీయములైనవి. ఇట్టిపవిత్రములైనజంతువులను రైతులు సరిగా పోషింపక, పాలిచ్చునంత కాలము పోషించి, వార్ధక్యము రాఁగానే అవుల నెడ్లను పలువురు నిష్కారణముగా కసాయివారికి విక్రయించుచున్నారు. పవిత్రములైన ఆఁబోతులనుగూడ బండ్లనులాగుట కుపయోగించుచున్నారు. మైసూరుసంస్థానములో కొన్నితావులలో అవులనుగూడ నాగళ్లకును, బండ్లకునుకట్టుచున్నా రనియు, ఇది అక్రమమనియు నిటీవల శ్రద్ధానందస్వామి అనుతాపముతో నుడివెను.

ఇప్పుడు గోమాంసభక్షకులగు విజాతీయులసంఖ్య హెచ్చుగా నుండుటచే వారిఆహారముకొర కెన్నియో పశువులు వధింపఁబడుచున్నవి. పెక్కుపశువులను ధనాశచే విదేశీయులకు విక్రయించి విదేశముల కెగుమతి చేయుచున్నారు. అనావృష్టి దోషమువలన, అతివృష్టి బాధవలన, పంటలుపండక, మేఁత లేక లక్షలకొలది పశువులు మృతినొందుచున్నవి. గ్రామములలో పశుగ్రాసక్షేత్రములగు పచ్చికబయళ్లులేని కతమునను పశువులదురవస్థ హెచ్చగుచున్నది. చెన్నపురి మున్నగు ప్రాంతములలో దురాశాపరులగు క్షీరవిక్రేతలు తమ అవులకు కడుపునిండ మేతపెట్టకయు, లేగలకొక్కక్షీరధారయైనను విడిచిపెట్టకయు తుదకు రక్తపుధారలనుగూడ పిండి, విక్రయించి పశువధాపాతకమునకు పాల్పడుచున్నారు. మాతృస్తన్యమెట్టిదో చవిచూచి యెఱుఁగని లేఁగలు నెలలోనే మృతినొందుచున్నవి. పశువులకేవ్యాధులువచ్చినను వాటిని సరిగాఁ జూడక బలవంతముగఁ జంపుచున్నారు. పశువైద్యులు గూడ చాల అరుదుగనున్నారు.

## మొరటుతనపు పశువైద్యము.

పూర్వకాలమునందు అకలములను తినుచు విరాగులై సంచరించు గోసాయిలు సాధారణముగా తమ సహజవృత్తులచే జీవించుచు, వైద్యమును గౌరవవృత్తిగ నడుపువారు. వారికి వైద్యశాస్త్రాభ్యాసము ప్రధానవృత్తి కాకపోవుటచేత దానియందు వారికి అభిరుచి తరములనుండి తగ్గుచూ వచ్చినది. తెలిసి తెలియని పశువైద్యులనేకమంది యెల్లెడలనున్నారుగాని వ్యాధినిర్ణయము తెలియక పశువులను చంపుచున్నారు. ఈ పశువైద్యులెక్కువగా మోటువైద్యముచేయుదురు. వారికి శాస్త్రజ్ఞానమంతగా లేదు. పశువునకేవ్యాధి వచ్చినను కొరపుపాలు, సారాయి వాడుదురు. అప్పటికి తగ్గనిచో యమకింకరులవలె కాల్చెదరు.

## గ్రంథాలయములకర్తవ్యము.

మనదేశములో నక్కడక్కడ వెటరినరీడిపార్టుమెంటు వారికికూడ తెలియనివిషయములుకూడ తెలిసిన ఆయుర్వేద పశువైద్యులున్నారని చెప్పగలను. ఆయుర్వేదపశువైద్యములోకూడ మంచిమంచి చిట్కాచికిత్సలు గలవు. అందుకొరకే సుమారు పది సంవత్సరములనుండి ఈ పశువైద్యపు గుట్టంతయు తీసికొనుచున్నప్పటికిని, యింతవఱకు సరియైన దారిదొరకలేదు. గ్రామములలో పలుకుగలబడి

గలపెద్దలు అనఁగా గ్రామగ్రంథాలయవర్గముగాని, గ్రామ పంచాయతీ వర్గముగాని తగినంత శ్రద్ధతీసికొని ఈ నాటు వైద్యము ఆయా ప్రాంతములలో ఎంతవఱకు చేయు చున్నారో, ఎన్ని పశువులను చంపుచున్నారో, విషయము లన్నియు తెలిసికొని ఈ ఆయుర్వేద పశువైద్యమును వృద్ధి లోనికి తీసికొనిరా ప్రార్థితులు.

నిఖిలాంధ్రాయుర్వేద పశువైద్య కళాశాల.

ఆంధ్రదేశ గ్రంథాలయసంఘమువారు ఆంధ్రదేశము లోనున్న గ్రంథాలయము లెంతవఱకు పని చేయుచున్నవో, ఎన్నిపని చేయుటలేదో తెలిసికొని పశువైద్యప్రచారము చేయగలందులకును, బొత్తిగా పశువైద్యము తెలియని రైతులకు ఆగ్రామ గ్రంథాలయములకు కొన్ని ఆయుర్వేద పశువైద్య గ్రంథములను తెప్పించి పశురోగవిషయములు తెలుపుటకును, అంతకంటె హెచ్చుగా ఇష్ట మున్నవారు ఆ గ్రామగ్రంథాలయము తరఫున ఒక విద్యార్థిని అంగ లూరు ఆయుర్వేద పశువైద్య కళాశాలకుపంపి పశువైద్య విద్యావ్యాప్తియందు తర్ఫీదై పశుసేవ జేయుటకును నేను మిగుల కోరుచున్నాను. ఈరీతిగనే దివి తాలూకా భట్ల పెనుమఱ్ఱు గ్రామగ్రంథాలయములో భాండాగారీకుడుగా ఎనిమిది రూపాయలకుజీతముక్రిందనుండి తదుపరి ఆగ్రామ నాయకుల ప్రోత్సాహముచే మాకళాశాలకు వచ్చి పశు వైద్యములో తర్ఫీదయి వెళ్ళి సదరు గ్రంథాలయము తర ఫున పశుచికిత్సాలయము స్థాపించి పశుసేవ చేయుచున్న శ్రీయుత గొట్టిపాటి వెంకయ్యగారికి కృష్ణాజిల్లాబోర్డు వారు రు 300-0-0 లు కంట్రిబ్యూషను ఇచ్చిరి. ఆగ్రామ సంఘమువారు 50-0-0 ల కంట్రిబ్యూషను ఇచ్చిరి. ఇది గాకుండ ఉచితముగా చేయుచున్నప్పటికి ప్రేమపూర్వ కముగా రైతు లిచ్చునది నెలకు రు 15-0-0 లుండును. ఈ రీతిగా బీదవారలకు కూడ మంచిలాభమున్నదని స్పష్ట ముగా దీనిని బట్టితెలియుచున్నది. కాబట్టి గ్రామపంచా యతీనుండిగాని, గ్రామగ్రంథాలయమునుండిగాని, విద్యా ర్థులను మానిఖిలాంధ్రాయుర్వేద పశువైద్యకళాశాలకు పంపించి ఈ పశువైద్యమును వ్యాపింప చేయుదురుగాక.

# అసెంబ్లీలోని నిషేధగ్రంథములను గురించి చర్చ

నిషేధగ్రంథములను గురించి గత అసెంబ్లీసెషన్సులో సభ్యులు ప్రశ్నించిరి. "అన్నకారనీన" "బ్రదర్స్ కరమ్ జోవు" అను రెండు గ్రంథముల విషయములో, ఈగ్రంథ ములు సీకస్టమ్సుచట్టముప్రకారము జప్తు చేయఁబడలేదని హోంమెంబరుగారు వివరించిరి. 'ఇండియాకు రానీయ కుండ ఎట్టిగ్రంథములను నిషేధింతురు?' అను ప్రశ్నము నకు జవాబిచ్చుచు హోంమెంబరుగారు సీకస్టమ్సుచట్టము యొక్క 19 వ సెక్షనుప్రకారము ఇండియాలో ప్రచార మగుచో హానికరములుగా పరిణమించు గ్రంథములు మాత్రమే బయటనుండి వచ్చునప్పుడు రేవులలో జప్తు చేయబడునని తెలిపిరి.

'న్యూఇండియన్ లిటరేచరు' అనుపేరున వచ్చుగ్రంథ ములు జప్తుచేయుటకు పైనివివరించిన దృష్టితోనే పరికించు చున్నారు. కాని గ్రంథసాహిత్య ఉత్కృష్టతలను పాటిం చుటలేదనిరి. నిషేధించిన గ్రంథములైనను నిజముగా నిషే ధింపదగియున్న వైయుండుటచే నిషేధింపబడినవా, లేక ప్రభుత్వమువారు ఉపయుక్తమగు వార్తలనుకూడ ప్రక టింపకుండుటకు ఇచ్చవచ్చినట్లు నిషేధించిరా? అను విషయ మును సభ్యులు పరిశీలించి తెలిసికొనుటకై అట్టి గ్రంథము లను అసెంబ్లీ గ్రంథాలయములో ఉంచవలసినదని శ్రీ అనంతశయనము అయ్యంగారు కోరగా అట్టి పుస్తక ములను చదివినయెడల సభ్యుల నీతిప్రవర్తనముకూడ చెడు టకు అవకాశములు కలుగునుకనుక అట్లు చేయుటకు అంగీకరించుటలేదని హెన్రీక్రైక్ గారనిరి. గ్రంథము లను నిషేధించుటకు పూర్వము ఆ గ్రంథములనుగురించి పండితుల అభిప్రాయములను తీసికొనుట అవసరమని సత్యమూర్తిగారు సూచించగా బయటివారికి ఇట్టి బాధ్య తను కలిగింపజాలరని తెలిపిరి.

# టి. సి. దత్తాగారి ఆంధ్రదేశ గ్రంథాలయ సందర్శనము

వంగదేశ గ్రంథాలయ సంఘకార్యదర్శిఅగు శ్రీయుత టి. సి. దత్తాగారు కడచిననెల 22, 23 వ తేదీలలో ఆంధ్రదేశములోని కొన్ని గ్రంథాలయములను సందర్శించి గుంటూరు, బెజవాడ, ఏలూరు మున్నగుచోట్ల వారికి ఘనమగు సన్మానములును విందులును జరిగెను. వారు కొన్నిచోట్ల గ్రంథాలయోద్యమాభివృద్ధికి చక్కనిసలహాలిచ్చిరి. కార్మిక గ్రంథాలయములును, హరిజన గ్రంథాలయములనుచూచి మిక్కిలి మెచ్చుకొని ఆంధ్రరాష్ట్రము బ్రిటిషు ఇండియాలో గ్రంథాలయోద్యమమున అగ్రస్థానము వహించునని తమ యభిప్రాయమును తెలిపిరి.

# ఆంధ్ర దేశ గ్రంథాలయోద్యమము

## సమకాలికాభిప్రాయములు

### ఆంధ్ర గ్రంథాలయాలు:

ఆంధ్రదేశంలో గ్రంథాలయోద్యమం బాగా పాకింది. గ్రామాలలో యీ ప్రచారం బాగా ఉంది. యువకులలో ఉత్సాహం యెక్కువ. నలుగురు ఒకచోట చేరి పత్రికలు తెప్పించి చదువుకోవలెననే అభిలాష కలిగింది. ఎవరికివారు చదువుకోలేకపోయినా ఒకచోట నల్గురు చేరినపుడు ఒకరు చదివి యితరులకు అందులోని విషయాలను బోధింపవచ్చు. దానిమీద యెవరికివారు చదువుకోవలెననే అభిలాష కలుగుతుంది. పెద్దవాళ్లు యింకా చదువేమిటనుకున్నా పిల్లలనైనా బళ్లోకి పంపించి చదివించాలనే కోరిక కలుగవచ్చు.

ఏ ఉద్యమమైనా బాగా జరుగవలెనంటే ఐకమత్యం కావలె. మఖలో పుట్టి పుబ్బలో అంతరించే ఉత్సాహం కూడదు. నిరంతరం ఉండాలి. అందుకు ఆంధ్రదేశంలో గ్రంథాలయోద్యమాభిమానులు ప్రచారం చేస్తూ ఉండటం అనవసరం. అట్టియాత్రలను శ్రీయుత అయ్యంకి వేంకటరమణయ్యగారు జరుపుతూనే ఉన్నారు. ఆమాత్రం ఉండటంచేతనే వంగరాష్ట్ర గ్రంథాలయసంఘ ప్రధాన కార్యదర్శిగారైన శ్రీయుత దత్తాగారు పశ్చిమగోదావరిలో సంచారం చేసినతరువాత గ్రంథాలయోద్యమమునకు ఆంధ్రరాష్ట్రం ఆదర్శప్రాయంగా ఉన్నదనీ, గ్రంథాలయసేవకుల కృషి బాగా ఉన్నదనీ చెప్పగలిగారు. ఈ ఉద్యమానికి నిజంగా స్థానికసంస్థలు, జిల్లాబోర్డులు, పంచాయితీలు, మ్యునిసిపాలిటీలు తోడుగావాలి. ప్రజలలో ఉన్న ఉత్సాహంవల్ల గ్రంథాలయాలు, పఠనాలయాలు యేర్పడుచున్నను యీ స్థానికసంస్థలు, ప్రభుత్వము తోడ్పడాలి. పంచాయితీబోర్డు గ్రంథాలయాలకు ఈ రాష్ట్రంలో ఉన్న నిరోధాలు బెంగాలురాష్ట్రంలో లేవని దత్తాగారన్నారు. ఇచ్చటను ఉద్యమాభిమానులు ఆందోళనచేస్తే అవి అంతరిస్తవేమో చూడవలసి ఉన్నది దీనికైనా ప్రజాభిప్రాయము యేకంగావలె. అంతా కలిసి యేకముఖంగా 'యిది తప్పు యిది ఒప్పు' అని చెప్పగలిగితే ప్రభుత్వమైనా కాదనలేదు. ఈ గ్రంథాలయోద్యమంతో గ్రామాలలో అవిద్య పోయి, సంఘీభావం యేర్పడి జాతీయత అభివృద్ధి చెందుతుందనటానికి సందేహం లేదు. ఆపద్ధతులనే యివి నడుస్తున్నవనియు నమ్ముతాము.

"ఆంధ్రపత్రిక" ది 27-11-36

### సారస్వతనికేతనం

నిన్న ఆంధ్రదేశ గ్రంథాలయాల కృషినిగూర్చి వ్రాసియుంటిమి. నేడు గుంటూరుమండల కేంద్రగ్రంథాలయమైన వేటపాలెంలోని సారస్వతనికేతనంయొక్క వార్షిక నివేదిక వచ్చినది. అది యీ యుద్యమ తత్వాన్ని అన్ని విధములా విశదము చేస్తున్నదని చెప్పవచ్చును.

ఈ నికేతనం 18 యేండ్లనుండి పనిచేస్తున్నది దీని యభివృద్ధి అంతా కీ॥ శే॥ ఊం. వెం. శ్రేష్ఠిగారి ధర్మము వల్లనే జరిగింది. ఆస్తి యేర్పడ్డది. అయినా నివేదికయందు యీనికేతనానికి స్వయంపోషకస్థితి చేకూరలేదని చెప్పబడినది. మూలనిధిని పెంచవలెనని ధర్మకర్తగారు చెల్పుచున్నారు. ఈ లోపల ధర్మాత్ము లందరును యీనికేతనమునకు నష్టములేకుండా పని చేయటానికి తోడ్పడుతారని మానమ్మకము.

ఈనికేతనం చేస్తున్నపని చూస్తే తప్పక సహాయం చేస్తారనిగూడా చెప్పవచ్చు. గ్రంథము లధికముగ నున్నవి. స్త్రీ పురుషులు వాని నుపయోగించుచున్నారు. మద్రాసులోని కానెమెరా గ్రంథాలయంనుంచి గ్రంథాలను తెప్పించి పాఠకులకిస్తున్నారు. పత్రికలు అనేకము తెప్పిస్తున్నారు. వ్యాసరచనలో పోటీలు జరుగుచున్నయి. గ్రంథమాల ఉన్నది. సభలు, ఉపన్యాసాలు, సన్మానాలు, పోటి ఆటలు యీ నికేతనంవారు జరుపుతున్నారు. భజనకాలక్షేపములు, పండుగలు, జయంతులు జరుపబడుచున్నవి. ఈ కార్యక్రమమంతా భారత జాతీయతను కాపాడుచు జనులలో పఠనాసక్తిని గలుగజేసి యువజనులయందు ఆరోగ్యమును పెంపొందింపచేయుననుటకు సందేహంలేదు. ధనమున్నట్లైతే యీనికేతనానికి అనుబంధంగా ఒక చిన్న తెలుగుబడిని పెట్టి నిరక్షరత్వమును పొయ్యేటట్లుగూడా చేయవచ్చు. ఏపనిజరుగటానికైనా డబ్బుండవలె. ప్రభుత్వంవారు, జిల్లాబోర్డు యిచ్చేవిరాళాలుకాక ప్రత్యేకంగా ధనవంతులు, ధర్మాత్ములు ధనసహాయంచేసి యీసంస్థ అభివృద్ధి అయ్యేటట్లు తోడ్పడవలెనని ప్రార్థన.

"ఆంధ్రపత్రిక" ది 28-11-36

# తణుకుతాలూకా ద్వితీయ గ్రంథాలయమహాసభ

తణుకుతాలూకా, రేలంగిగ్రామములో శ్రీకృష్ణ గ్రంథాలయ భవనమున ది 27 9-36 తేదీని పగలు 3 గంటలకు శ్రీగాడిచర్ల హరిసర్వోత్తమరావు పంతులు, ఎం. ఏ., గారి అధ్యక్షతను తణుకుతాలూకా ద్వితీయ గ్రంథాలయ మహాసభ ఆనందదాయకముగా జరిగెను. దిగువ తీర్మానములు ఏకగ్రీవముగ అంగీకరింపబడెను.

## తీర్మానములు

i 4 11-33 నుండి 27-9-36 వరకు తాలూకా గ్రంథాలయ సంఘముచే జరుపబడినకృషినిగురించి తెలుపు నివేదికయు, జమాఖర్చులను ఆమోదింపనైనవి.

ii ఏప్రియలు 1 వ తేదీ గ్రంథాలయ సంవత్సరమునకు సాలుసరిలెక్కలకు జమాఖర్చులకు ప్రారంభదినముగా ఎంచబడును.

iii తాలూకాగ్రంథాలయమునకు ఒక రూపాయ తక్కువ కాకుండగా విరాళమిచ్చుగ్రంథాలయ ప్రతినిధులును, ఇతర వ్యక్తులును, సభ్యులగుదురు. ఈ సభ్యులే కార్యనిర్వాహకవర్గమును ఎన్నుకొందురు.

iv ముందుసంవత్సరము తాలూకాను 9 గ్రూపులుగ విభజించుటకును, ఆ యా గ్రూపులకు ఈ దిగువ నుదహరించినవారిని గ్రూపుడైరక్టరులుగా ఎన్నుకొనుటకును ఈ 9 గురును, అధ్యక్షకార్యదర్శులును గ్రంథాలయ సంఘమునకు కార్య నిర్వాహక సంఘముగా నేర్పడుటకును తీర్మానింపనైనది.

1 తణుకుఫిర్కా:—పోతాప్రగడ శ్రీరామరావు పంతులు బి. ఏ., బి. ఎల్ వకీలు (ఏ. హార్డింజిటవునుహాలు, బి. శ్రీరామ పుస్తకాలయము, సి. తణుకు సరస్వతి గ్రంథాలయము, డి. జిల్లాబోర్డు గ్రంథాలయము.) (తణుకు, చివటము)

2 దువ్వఫిర్కా:—భద్రిరాజు అచ్యుతరామరాజు (దువ్వ, తేతలి, వడ్డూరు)

3 రేలంగిఫిర్కా:—గాదె శ్రీరాములు, బ్యాంకరు, (రేలంగి, సోమరాజు, ఇల్లిందరపఱ్ఱు, వేల్పూరు.)

4 ఇరగవరముఫిర్కా:—మేడూరి మాచేశ్వరశాస్త్రి లాండ్ లార్డు (ఇరగవరము, కంతేరు, అయినపఱ్ఱు)

5 అత్తిలి, మొయ్యేరు, తిరుపతిపురము, నత్తా రామేశ్వరము.

6 కాకరపఱ్ఱుఫిర్కా:—(కాకరపఱ్ఱు, తూర్పువిప్పఱ్ఱు, వెలగదుఱ్ఱు, కౌకుల ఇల్లిందరపఱ్ఱు)

7 మోర్తేరు, నెలమూరు.

8 వడలిఫిర్కా:—మల్లపరాజు బాస్కరరామరాజు (వడలి, ఇలపఱ్ఱు, కోరాలపఱ్ఱు)

9 కొయ్యేటిపాడుఫిర్కా:—చెంగల్వల ఉమామహేశ్వరముగారు (కాకిలేరు, కొయ్యేటిపాడు)

v ముందుసంవత్సరమునకు మ॥ రా॥ శ్రీ ముదుగంటి జగన్నశాస్త్రి బి. ఏ. గారిని అధ్యక్షులుగను, మ॥ రా॥ శ్రీ పోతాప్రగడ శ్రీరామారావు పంతులు బి. ఏ. బి. ఎల్. గారిని ఉపాధ్యక్షులుగను, మ॥ రా॥ శ్రీ పామర్తి వేంకటరమణారావు, తంగిరాల కృష్ణానందతిలక్ గార్లను కార్యదర్శులుగను ఎన్నుకొననైనది.

vi కార్యనిర్వాహకవర్గ సమావేశమునకు అధమము ముగ్గురైనను హాజరుకావలయును.

vii గ్రూపుడైరక్టర్లు వారివారిగ్రూపులయందలి గ్రంథాలయములకు మాసమున కొకసారియైనను వెళ్లుచు తాలూకా కార్యదర్శులకు మాసనివేదికలు పంపుట, గ్రంథాలయనిర్వాహకులకు తోడ్పడుట, వార్షికోత్సవములు, వర్ధంతులు, సభలు, ఏర్పాటుచేయుట, గ్రంథాలయ సంఘమునకు సభ్యుల చేర్చుటయు, మున్నగు విధముల కృషి చేయుచుండవలయును.

viii జిల్లా గ్రంథాలయసంఘమువారు జిల్లాబోర్డును కోరిన ప్రణాళికను వెంటనే అమలులో పెట్టుటకు ప॥ గో॥ జి॥ బోర్డువారిని కోరుచున్నారు.

ix లోకలుబోర్డు ఇనస్పక్టరుగా రిటీవల పంచాయతీ బోర్డులకు, వార్తాపత్రికయు, సిబ్బందిజీతములయు, ఖర్చును గూర్చి, ముందు అనుమతి లేనిదే ఖర్చుచేయకూడదని జారీ చేసిన 213 సర్క్యులరు రద్దుచేయుటకు కోరుచున్నారు.

x ఆంధ్రపత్రికాధిపతులను ఈతాలూకా గ్రంథాలయ సంఘమువారు సిఫార్సుచేసిన గ్రంథాలయములకు దైనిక ఆంధ్రపత్రికను రు18ల చొప్పునను, భారతిమాసపత్రికను రు 4 ల చొప్పునను ఇప్పింప గలందులకు కోరుచున్నారు.

xi జిల్లా విద్యాశాఖాధికారిని సాలుకొకసారి నిషేధించిన గ్రంథముల జాబితానకలును ప్రతిగ్రంథాలయమునకు పంప కోరుచున్నారు.

xii 1860 సం॥ము 21వ చట్టము ప్రకారము గ్రంథాలయములురిజిస్టరుచేయుటకు అయ్యే ఫీజును రు50-0-0 ల నుండి అయిదు రూపాయలకు తగ్గించుటకు కోరుచున్నారు.

xiii 1937 సం॥రం జనవరి నెలలో ఈ తాలూకా గ్రంథాలయయాత్రను చేయుటకు తీర్మానింప నైనది.

xiv గవర్నమెంటువారిని పంచాయతీ గ్రంథాలయములకు కూడ గ్రాంటుల నిచ్చుటకు కోరుచున్నారు.

vv తృతీయగ్రంథాలయసభను కొయ్యేటిపాడు గ్రామములో జరుపుటకు తీర్మానింప నైనది.

# గ్రంథాలయ నివేదికలు

## శ్రీ సారస్వత నికేతనము - వేటపాలెము.

### పదునెనిమిదవ వార్షిక నివేదికలోని అంశములు.

ది ౧౬-౯-౩౫—ది ౩౦-౯-౩౬

హిందూయువజన సంఘముఅనుపేరుతో ౧౯౧౫ సంవత్సరములో స్థాపింపబడిన ఈసంఘము ౧౯౨౪ సంవత్సరమునుండి సారస్వతనికేతనము అనుపేరుతో పని చేయ మొదలిడెను. ప్రస్తుతము ఈ నికేతనపు ధర్మకర్త - అధ్యక్షుడు శ్రీ ఊటుకూరి జయరామదాసుగారు. గ్రంథ భాండాగారి శ్రీ అడుసుమిల్లి శ్రీనివాసరావుగారు. ఈ సంవత్సరాంతమున ఈ నికేతనమునకు రు ౯౭౪౩/-లు మూలనిధి కలదు. ఇందులో స్థిరాస్థిమీద రు౪౩౭౯-౧-౦లును, ఇతరులవద్ద వడ్డీకిరు ౫౩౬౬-౧౫-౦ లును ఉన్నవి. ఇదిగాక శ్రీ ఊ. వెం. శ్రేష్ఠిగారి మరణశాసనము ద్వారా సంక్రమించిన సుమారు రు ౩౫౦౦ల కిమ్మతు గల మరికొంత భూవసతికూడ కలదు.

### విరాళములు - ఆదాయవ్యయములు

మద్రాసు ప్రభుత్వమువారు ఈ సాలున రు౧౧౪/-లు విరాళ మొసగిరి. ఒంగోలుజిల్లా బోర్డువారు ౧౯౩౬-౩౭ సంవత్సరమునకు ఈ నికేతనమునకు రు ౧౦౦/-లు విరాళ మొసంగ అంగీకరించిరి. వేటపాలెం పంచాయతీ బోర్డువారు రు ౫౦/-లు విరాళమిచ్చుటకు అంగీకరించిరి. ఈ సాలున నికేతనమునకు వచ్చిన మొత్తము ఆదాయము రు ౧౩౪౫-౭-౬;వ్యయము రు౧౬౪౦-౨-౩. ధర్మకర్తగారగుఊటుకూరుజయరామదాసుగారురు౨౯౪-౧౦-౯ లు పెట్టుబడియిచ్చిరి.

### గ్రంథములు - పాఠకులు.

సంవత్సరాంతమున గ్రంథాలయమున ౮౦౦౦ గ్రంథములుకలవు. ఈ సంవత్సరములో ౫౭ గ్రంథములు గ్రామములకు పంపబడినవి. గ్రంథములు ఉపయోగించిన పాఠకుల సంఖ్య ౬౯౪. పాఠకుల చే ఇండ్లకు కొంపోబడిన గ్రంథములు ౧౦,౮౯౫. గ్రంథాలయమునందే పరిశీలింపబడిన గ్రంథములు ౪౫౧౬.

### సంచార గ్రంథాలయము.

బాపట్లనుండి చినగంజామువరకు రోడ్డువెంబడి గ్రామములలోని ప్రజలకు ఈ నికేతనపు నౌకరుద్వారా గ్రంథముల నందించు పుచ్చుకొనుచుండుటకై ఒక ప్రణాళిక తయారుచేసి ఆచరణలో పెట్టబడినది.

పఠనాలయమునకు మొత్తము ౩౪పత్రికలు వచ్చుచున్నవి.

వ్యాసరచన పోటీ ఏర్పరుపబడెను. శ్రీ శనివారపు సుబ్బారావుగారిచే రచింపబడిన"వయోజనవిద్య"అను కరపత్రము ప్రకటింపబడెను. పదునాలుగు ఉపన్యాసములు జరుపబడెను. భజనకాలక్షేపములు, పురాణములు, హరికథా కాలక్షేపములు జరిగెను.

## శ్రీ ఆంధ్రబాలసరస్వతీ నిలయము (రిజిస్టర్డు)

### నల్లూరు - రేపల్లెతాలూకా.

### ౧౯౩౫-౩౬ సంవత్సరపు నివేదికలోని ముఖ్యాంశములు.

పలుకుబడిగలవారితో కూడిన కార్యనిర్వాహకవర్గము కలదు. శ్రీ యార్లగడ్డ రామకృష్ణచౌదరిగారు అధ్యక్షులు; పరచూరి వెంకటబసవకుటుంబయ్యగారు కార్యదర్శి. జీతముపై నియమింపబడిన ఒక భాండాగారాధిపతి, ఒక నౌకరు కలరు. ఈసాలున ఆదాయము రు౨౫౦-౧౨-౦; వ్యయము రు ౨౪౪-౮-౦; పదిపత్రికలు తెప్పింపబడుచున్నవి. ౯౯ మంది అభిమానులును, చందాదారులును కలరు. ఈగ్రంథాలయమునకు పెనుమూడిగ్రామము ఒక కేంద్రము. చుట్టుప్రక్కల గ్రామములలోని ప్రజలకందరికి జాతిమత వివక్షతలేక చదువుకొనుటకు పుస్తకములు ఉచితముగ ఇండ్లకు ఇయ్యబడుచున్నవి. నల్లూరుగ్రామములో సాక్షులసంఖ్య ౩౧౯౦; ఇందులో పురుషులు ౧౫౦౦; స్త్రీలు ౧౦౨౦; బాలురు ౫౬౦. గ్రంథాలయమువద్ద పుస్తకములనుగాని, పత్రికలనుగాని చదువుటకువచ్చువారి సంఖ్య సగటున ప్రతిరోజు ౨౮. భవననిర్మాణమునకు ప్రయత్నములు జరుగుచున్నవి. ఈ గ్రామమందు చదువుకున్న పురుషులయు, స్త్రీలయు, పిల్లలయు లెక్క తయారుచేయబడినది. విద్యకు, వృత్తులకు, కళలకు సంబంధించిన వ్యాసములు పత్రికలనుండి తీసి ప్రత్యేకముగ పుస్తకములందు అతికించి భద్రపరుపబడుచున్నవి. ప్రతిరోజు పత్రికలలోని ముఖ్యవ్యాసములపేర్లను నల్లబల్లపై వ్రాయుచున్నారు. పై కార్యనిర్వాహక సంఘము అధికారములోనికి వచ్చినది లగాయతు ౨౦౦౦ గ్రంథములు ఉచితముగ సంపాదింపబడి గ్రంథాలయమునకు చేర్పబడినవి.

# గ్రంథాలయ వృత్తాంతములు

## అచ్యుయ్య ధర్మగ్రంథాలయము
పటమట - బెజవాడ.

ఈ గ్రంథాలయము ది ౧౪-౧౧-౩౫ తేదీని బాబు రాజేంద్రప్రసాద్‌గారిచే ప్రారంభింపబడినది. ఈ గ్రంథాలయముక్రింద శ్రీ గుత్తికొండ అచ్యుయ్యగారు ఎ.౦-౧౦౫ సెంట్ల నివేశనస్థలమును, అందులో ఉన్న చుట్టు ప్రహరీ గోడగల డాబాయున్ను ట్రిస్టువ్రాసి యిచ్చియున్నారు. వీరి సతీమణి కోటమ్మగారు ఎ ౪-౫౦ సెంట్లు సేరీ మెరక భూమి ట్రిస్టు వ్రాసియిచ్చినారు. మొత్తముస్థిరాస్తి కిమ్మతు సుమారు రు ౫౦౦౦-౦-౦. ఈభూమిపై వచ్చు అయివేజుతో గ్రంథాలయ నిర్వహణము జరుపుటకు ఏర్పాటు చేయబడినది. వర్ణమతవివక్షతలేక అందరును గ్రంథాలయమును ఉపయోగింపవచ్చును. ఒక ఉచిత రాత్రి పాఠశాలను స్థాపింపవలెనని ట్రిస్టులో వ్రాయబడియున్నది. ఇప్పుడు ఈ గ్రంథాలయ పరిపాలనము అయిదుగురు ధర్మకర్తలతో కూడిన పంచాయితీవల్ల జరుగుచున్నది. అభివృద్ధికి మంచి అవకాశములు కలవు.

## వయోజనవిద్యాప్రచారకసంఘము- అనకాపల్లి.

ఈ సంఘము ది ౧౧-౧౦-౩౬ తేదీని స్థాపింపబడెను. ఇందు 'సలహాశాఖ, ప్రచారకశాఖ' అను రెండు శాఖలు ఏర్పరుపబడెను. వయోజన విద్యాప్రచారము చేయుటకు ౬ కేంద్రములు ఏర్పడి ప్రతి శనివారము ఉపన్యసించుటకు ౬ ముఠాలు ఏర్పరచిరి. ఈప్రచారము ఇపుడు ప్రస్తుతము ౧ విజయరామరాజుపేట, ౨ లక్ష్మీదేవిపేట, ౩ కోటినవీధి, ౪ గవరపాలెము చినరామస్వామి కోవెల ౫ చాయగూడెము, ౬ కీల్పులపేటలలో జరుపబడును.

## శ్రీత్యాగకుమారపఠనమందిరము- నెల్లూరు.

ఈ మందిర ప్రథమవార్షికోత్సవము సత్యవేడు డివిజన్ సబురెజిస్ట్రారుగారైన శ్రీ ఎం. ఎస్. మునస్వామిసెట్టిగారి అధిపత్యమున ది ౧౧-౧౦-౩౬ తేది సాయంకాలము భవనమందిరమున జరిగెను. ౬ వందల ప్రజలకు పైగా సభకు హాజరైరి. గ్రంథాలయోద్యమమును గురించియు, పాశ్చాత్యదేశములలో విద్యాప్రబోధమును గురించియు పలువురు ముచ్చటించిరి. ఈ పఠనమందిరము నాశీర్వదించుచు పద్యములు చదువబడెను.

## శ్రీ రాజేశ్వరీగ్రంథాలయములు- గుడ్లవల్లేరు.

ఈ గ్రంథాలయము నూతనముగ స్థాపింపబడినది. ది ౧౫-౧౦-౩౬ తేదీని ప్రారంభోత్సవము శ్రీయుత వల్లభనేని రామబ్రహ్మంచౌదరిగారి అధ్యక్షతను జరిగెను. శ్రీయుత కొసరాజు సూర్యనారాయణ బి. ఏ. బి. ఎల్ గారు గ్రంథాలయోద్యమము గురించి ఉపన్యసించిరి.

## బెజవాడనగరగ్రంథాలయ సంఘము.

ది ౨౦-౧౦-౩౬ తేదీని అఖిల భారత జాతీయ మహాసభాధ్యక్షులగు శ్రీ జవహరిలాల్ పండితుని అగమన సందర్భమున పైసంఘపక్షమున కార్యదర్శి మల్లెల శ్రీరామమూర్తిగారిచే స్వాగతపత్రము సమర్పింపబడెను. బెజవాడ నగరమున ౨౧ గ్రంథాలయములున్నట్లును, కార్మికులలో విద్యాభివృద్ధికి పైసంఘము కృషి చేయుచున్నట్లును అందు వివరింపబడెను.

## శ్రీ వివేకానంద గ్రంథాలయము - మోర్తోట.

పైగ్రంథాలయ ద్వితీయవార్షికోత్సవము ది౧౭-౧౦-౩౬ తేదీని శ్రీయుత అయ్యంకి వేంకటరమణయ్య పంతులుగారి అధ్యక్షతను జరిగెను.

## శ్రీ దేశోద్ధారక గ్రంథాలయము
మేడికొండూరు - సత్తెనపల్లి తాలూకా

పై గ్రంథాలయము మేడికొండూరు పౌరులచే నూతనముగ ది ౨౫-౧౦.౩౬ తేదీని స్థాపింపబడెను. ప్రారంభోత్సవము శ్రీయుత వావిలాల గోపాలకృష్ణయ్యగారిచే జరుపబడెను.

## శ్రీ రామాంధ్రగ్రంథాలయము
పురిటిగడ్డ - దివి తాలూకా

ఈ గ్రంథాలయప్రారంభోత్సవము ది౨౨-౧౦ ౩౬ తేదీని ఈ గ్రామములో నూతనముగా నిర్మింపబడిన శ్రీరామ మందిరమున సహకారసంఘాధ్యక్షులగు శ్రీ నాదెళ్ళ కొండయ్య గారిచే జరుపబడెను.

## విశాఖపట్టణజిల్లాగ్రంథాలయమహాసభ.

విశాఖపట్టణజిల్లాగ్రంథాలయమహాజనసభ ది౧-౧౧-౩౬ తేదీని ఉపమాక అగ్రహారమందు శ్రీయుత గొబ్బూరు

వెంకటానంద రాఘవరావు, బి. ఏ గారి అధ్యక్షతను జరిగెను. గ్రంథాలయములు, సర్వమానవసౌభ్రాతృత్వము, చిత్రలేఖనము, ఆంధ్రభాష మొదలగు విషయములనుగురించి ఉపన్యాసము లీయబడెను. శ్రీయుత గొబ్బూరు వెంకటానంద రాఘవరావుగారు విశాఖపట్టణజిల్లా గ్రంథాలయ సంఘాధ్యక్షులుగను, శ్రీ గుంటూరు శ్రీహరిగారును, శ్రీగ్రంధి వేంకటరమణయ్యగారును కార్యదర్శులుగను ఎన్నుకొనబడిరి. కార్యనిర్వాహక సభ్యులు కూడ ఎన్నుకొనబడిరి.

## శ్రీ వేంకటేశ్వరవిలాసపుస్తకభాండాగారము.
## ఉపమాక - విశాఖపట్టణంజిల్లా.

పైభాండాగార చతుర్దశవార్షికోత్సవము శ్రీ ఉప్పల శ్రీరామమూర్తిగారి అధ్యక్షతను ది 1-11-36 తేదీని జరిగెను. కార్యదర్శి వార్షికనివేదకను నివేదించెను. పలువురు ప్రముఖులు ఉపన్యసించిరి. నూతనకార్యనిర్వాహక వర్గపు ఎన్నికలు జరిగెను.

## శ్రీ రామమోహన గ్రంథాలయము, బెజవాడ.

ది ౭-౧౧-౩౬ తేది సాయంకాలము గ్రంథాలయభవనమున శ్రీయుత పసుమర్తి సీతారామశాస్త్రి ఎం.ఏ.ఎల్ ఎల్. బి.గారి అధ్యక్షతక్రింద పౌరసభ జరిగెను. బెజవాడ మ్యునిసిపాలిటీవారు ఇదివరలో ఈ గ్రంథాలయమునకు ఇచ్చుచుండిన రు ౪౨౦/ల సంవత్సరవిరాళమును తిరిగి ఇప్పింపవలసిన దనియు, పన్ను మినహాయింపు చేసి ఒకనీటికొళాయి మంజూరు చేయవలసినదనియు, విద్యుచ్ఛక్తి దీపముల కగు ఖర్చును కోరక మినహాయింపు చేయవలసినదనియు కోరబడెను. ఇందును గురించి కృషి చేయుటకు శ్రీయుత పసుమర్తి సీతారామశాస్త్రి, గాడిచెర్లహరిసర్వోత్తమరావు, వి. ఎల్. శాస్త్రిగార్లతో కూడిన ఉపసంఘమేర్పాటు చేయబడెను. శ్రీ హరిసర్వోత్తమరావుగారిని కన్వీనరుగా నియమించిరి.

## శారదా గ్రంథాలయము - అనకాపల్లి.

పై గ్రంథాలయమహాజనసభ ది 8-11-36 తేదీని శ్రీయుత ఉప్పల శ్రీరామమూర్తిగారి అధ్యక్షతను జరిగెను. సభ్యులు తయారు చేసిన గ్రంథాలయనియమావళిని మహాజనసభవారు ఆమోదించిరి. త్వరలోనే గ్రంథాలయము రెజిష్టరు చేయించుటకు తీర్మానించిరి. ఇప్పటికి మూడుతరగతులుగ ౨౦౭ సభ్యులు చేరిరి. నెల ౧ కి రు౫౦/ల చొప్పునవచ్చు ఆదాయము పైని ఈసంవత్సరమునకు బడ్జెటు ప్లాను చేయబడెను. అందు కొంతధనము ప్రతిమాసము పుస్తకములుకొనుటకు ఏర్పాటు చేయబడెను. ఈ గ్రంథాలయము తాలూకాకు కేంద్రగ్రంథాలయముగ పనిచేయుటకు తీర్మానించిరి. పురప్రముఖులు గ్రంథాలయమునకు పోషకులుగను, సభ్యులుగను చేరునట్లు కృషి చేయుటకు తీర్మానించిరి.

శ్రీ కోరుకొండ లింగమూర్తిగారు తమజీవితకాలమంతయు గ్రంథాలయమునకు భవనమును ఉచితముగ నిచ్చిరి. శ్రీగ్రంధి వెంకటరమణయ్యగారు ఉచితముగ కొన్నిపత్రికలను తెప్పించి ఇచ్చుచున్నారు.

## యువజనసారస్వతసంఘము - అనకాపల్లి.

ది 8-11-36 తేదీని గవరపాలెము చినరామస్వామి దేవాలయమువద్ద శ్రీయుత ధర్మాల అప్పన్నపంతులు బి. ఏ. బి. ఇడి. గారి అధ్యక్షతక్రింద జరిగినసభలో ఈ సంఘము స్థాపింపబడెను. ఈసంఘమునకు శ్రీ పెంటకోట వెంకటరమణగారు అధ్యక్షులుగను వంకాయల నరసింగరావుగారు కార్యదర్శిగను ఎన్నుకొనబడిరి. మరికొందరు సభ్యులుకూడ ఎన్నుకొనబడిరి.

## శ్రీ లక్ష్మీనృసింహగ్రంథాలయము
## వల్లూరు - తాడేపల్లిగూడెము తాలూకా.

ఈ గ్రంథాలయ అష్టమవార్షికోత్సవము ది ౯-౧౧-౩౬ తేదీని డాక్టరు తేతలి సత్యనారాయణమూర్తిగారి అధ్యక్షతను జరిగెను. కార్యదర్శియగు యర్రా రామచంద్రయ్యగారు సభకు చక్కనియేర్పాట్లు గావించిరి. ఉపన్యాసము లీయబడెను. గ్రంథాలయభవన నిర్మాణమునకు వాగ్దానములు చేయబడెను.

## శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషానిలయము
## హైదరాబాదు.

ఈనిలయముయొక్క ౩౫ వ వార్షికోత్సవము శ్రీమతి సీతాకుమారిగారి అధ్యక్షతను ది ౧౦, ౧౧ నవంబరు తేదీలలో జరిగెను. ఈ నిలయరాజపోషకులలో ఒకరైన స్వర్గీయ వామననాయకుగారి ఆత్మశాంతికై ప్రార్థనసల్పిరి. కార్యదర్శి సంవత్సర నివేదిక చదివెను. ఇప్పుడీ గ్రంథాలయములో ౮౩౭౨ గ్రంథములున్నవి; ౨౦ దిన, వార, మాసపత్రికలు వచ్చుచున్నవి, ఈ సాలున సభ్యులు చదివినపుస్తకములు ౮,౫౬౮; ఆదాయము రు౭౫౯-౧౦. వ్యయము రు ౭౯౯-౧-౬ లు, ౧౧ బహిరంగసభలు,

౯ కార్యనిర్వాహకసభలు జరిగినవి. నైజాం ప్రాంతములో తెలుగు సారస్వతసేవ చేయుచున్న ప్రధానసంస్థ ఇదియే.

## శ్రీ బాలగంగాధర తిలక్ పుస్తకాలయము (రిజిస్టర్డు) - పెదపులివర్రు - రేపల్లెతాలూకా.

ఈ గ్రంథాలయ పంచదశ వార్షికోత్సవము ది ౧౪-౧౧-౩౬ తేదీని ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘాధ్యక్షులగు శ్రీ గాడిచెర్ల హరిసర్వోత్తమరావు ఎం. ఏ. గారి అధ్యక్షతను సంతోషకరముగ జరిగెను. శ్రీమతి డాక్టరు కొమర్రాజు అచ్చమాంబగారు ప్రదర్శనప్రారంభోత్సవమును జరిపిరి. గుంటూరుజిల్లాబోర్డు అధ్యక్షులగు శ్రీపాతూరి సుబ్బయ్యచౌదరిగారు మహాసభోపక్రమణమును జరిపిరి. విశ్వనాధ సత్యనారాయణ, కస్తూరి కుటుంబరావు, వావిలాల గోపాలకృష్ణయ్యగార్లు గ్రంథాలయోద్యమము, ప్రయోజనములనుగురించి ఉపన్యసించిరి.

ఈగ్రంథాలయమున అయిదుబీరువాలలో ప్రస్తుతము ౧,౯౫౫ గ్రంథములున్నవి. దిన, వార, మాసపత్రికలు మొత్తము ౮ వచ్చుచున్నవి. స్త్రీల ఉపయోగము నిమిత్తము పుస్తకములు ప్రత్యేకముగ ఇండ్లకు సప్లయి చేయబడుచున్నవి. ఈతలూకాలో బాగుగ పనిచేయుచున్న గ్రంథాలయములలో ఇది ఒకటి.

## ఇండియన్ క్లబ్ గ్రంథాలయము. ఎలమంచిలి - విశాఖపట్నంజిల్లా.

ఈ గ్రంథాలయ ప్రారంభోత్సవము ౧౯-౧౧ ౩౬ తేదీని జిల్లాజడ్జి గారగు శ్రీయుత పంచాపకేశ అయ్యరు ఎం. ఏ. ఐ. సి. ఎస్ గారు జరిపిరి; మహోపన్యాసమిచ్చిరి. జడ్జిగారు తాము వ్రాసిన ౪ పుస్తకములు బహుమానము చేసినారు.

## శ్రీనాథగ్రంథాలయము, రాజమహేంద్రవరము.

ఈ గ్రంథాలయముయొక్క మొదటి వార్షిక సభ ది ౨౦-౧౧ ౩౬ తేదీని మ॥ రా॥ శ్రీ వడ్డాది సుబ్బారాయుడుగారి యాజమాన్యమున జరిగెను. ఈక్రిందివారిని కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్నుకొనిరి.

అధ్యక్షులు:-చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు, ఉపాధ్యక్షులు: నందూరు బంగారయ్యగారు, కార్యదర్శులు:- ముడింబి శ్రీరామాచార్యులు, డి. చిట్టిబాబురావుగార్లు. ఇతరసభ్యులు కూడఎన్నుకొనబడిరి.

## శ్రీ నెహ్రూ గ్రంథాలయము గూడవల్లి - రేపల్లెతాలూకా.

ఈగ్రంథాలయ ప్రథమవార్షికోత్సవము ౨౧-౧౧-౩౬ తేదీని ఆంధ్రదేశగ్రంథాలయ సంఘాధ్యక్షులగు శ్రీయుత గాడిచెర్ల హరిసర్వోత్తమరావు ఎం. ఏ. గారి అధ్యక్షతను జరిగెను; శ్రీ తత్వానందస్వామి బి. ఎ. ఎల్ టిగారు ప్రదర్శన ప్రారంభోత్సవమును జరిపిరి. రేపల్లె తాలూకా గ్రంథాలయాధ్యక్షులగు శ్రీయుత యార్లగడ్డ శ్రీకృష్ణచౌదరిగారు సభోపక్రమణమును గావించిరి. తక్కిన పెద్దలు ఉపన్యసించిరి. అధ్యక్షులు దేశములో అన్నివృత్తులవారును విద్యనభ్యసించినగాని, ఇతరదేశముల లోని ఆయావృత్తిదారులకు పోటీగా వివిధవిషయములలో ఉత్పత్తిచేయగలశక్తి ఏర్పడదనియు, ఇతరదేశముల ప్రభుత్వములు రైతులకు వలయు విద్య గఱపుచున్నారనియు, మనము స్వశక్తిమీదనే అభివృద్ధిలోనికి రావలెననియు గంభీరముగ ఉపన్యసించిరి.

## శ్రీ రాజేశ్వర గ్రంథాలయము తేతలి - తణుకు తాలూకా

ది ౧-౧౧-౩౫ నుండి ౩౧-౧౦-౩౬ వరకు చతుర్థ వార్షికనివేదికలోని కొన్నిఅంశములు:—

ప్రస్తుత గ్రంథాలయము పంచాయతి బోర్డువారి పరిపాలన మందున్నది. శ్రీయుత పోతాప్రగడ శ్రీరామారావుగారు అధ్యక్షులు. ఈ గ్రంథాలయమునకు సుమారు రు 300/-లు విలువగల స్థలమును, అందులో సుమారు ౧౦౦/- లువిలువగల పునాదికట్టడములునుకలవు. భవనము తయారు కాలేదు. ఈ గ్రంథాలయమును ఆదర్శముగా చేయుటకు డాక్టరు తేతలి సత్యనారాయణమూర్తిగారు సర్వవిధముల కృషి చేయుచున్నారు.

ఈ గ్రంథాలయ యాజమాన్యమున రాత్రిపాఠశాల జరుగుచున్నది. ఈ గ్రంథాలయమున ఇప్పుడు ౯౩౦ గ్రంథములుగలవు. ఈ సాలున చదువరుల సంఖ్య ౬౮౦౦; ఇండ్లకిచ్చిన గ్రంథముల సంఖ్య ౨౪-౨౩. ఆదాయము రు ౩ ౨౩-౦-౦; వ్యయము రు౩౨౨-౧౩-౯; చందాదారుల సంఖ్య ౯౪. భజన కాలక్షేపములు జరిగినవి. గ్రంథములు ౧౨హరిజనులకుఉచితముగ ఇయ్యబడుచున్నవి. పరిసరగ్రామముల వారుకూడ కొందరు ఇందులో సభ్యులుగ చేరినారు. దిన, వార, మాసపత్రికలు మొత్తము ౬ తెప్పింపబడుచున్నవి. నెల ౧ కి రు ౫/-ల జీతముపై ఒక గ్రంథభాండాగారికుడున్నాడు. తగుమాత్రముగ పరికరములుకలవు. ఇప్పుడీ గ్రంథాలయము శ్రీ తేతలి వేంకటరామయ్యగారి ఇంటిలో ఉంచబడినది. గ్రంథాలయ భవనమును కట్టించుటకు జిల్లాబోర్డువారు వాగ్దానము చేసినారు. ఇది కేంద్ర గ్రంథాలయముగ చేయుటకు కృషి చేయబడుచున్నది.

# సంపాదకీయములు

ఖద్దరు సంస్థానమువారి కె. యస్. బార్టరు కంపెనీ, బెజవాడ (వస్తుమార్పిడి శాఖలో) రిజిస్టరుచేసికొన్న చందాదారులకు వస్తురూపకమగు చందామీద మాపత్రిక అందగలదు.

మేనేజరు.
గ్రంథాలయ సర్వస్వము

---

# గ్రంథాలయ సర్వస్వము

౫—౧౨—౩౬

## గుంటూరుజిల్లా తుపాను:

గతనెల 28 వ తేది పెద్ద తుపాను వీచెను. మిక్కుటముగ వాన కురిసెను. జిల్లా మూల మూలల ఈ గాలివానయొక్క చిత్రవిచిత్రపు చెయ్దములు కన్పట్టుచున్నవి. కాని ముఖ్యముగా నష్టమైన భాగము బాపట్ల మొదలు అమ్మనబ్రోలువఱకు ఉత్తర దక్షిణములు 3౫ మైళ్ళును, సముద్రతీరము మొదలు పల్నాడు వఱకు తూర్పు పడమరలు ౬౦మైళ్లునుగల రెండు వేల చతురపు మైళ్ళలో ఒకలక్ష ముప్పదివేల యెకరముల భూమితోడి 300 గ్రామములు దీనికి గుఱిఅయ్యెను. బాపట్ల రేపల్లె తాలూకాలలోని సముద్రతీరప్రాంతమున సుమారు ౫౦ గ్రామములమీద గాలివానకు తోడు ఉప్పెనకూడ వచ్చెను.

నష్టము అనేకవిధములయ్యెను: జననష్టము, పశునష్టము, పక్షినష్టము, ఆస్తినష్టము, గృహనష్టము, వృక్షనష్టము, సస్యనష్టము, ధనధాన్యనష్టము, ఆరామనష్టము, సర్వవిధముల జీవనోపాధులనష్టము ఈనష్టమంతయు కోటిరూపాయలకు మించునని సర్కారువారి అంచనా; దీనికి రెట్టింపగునని నివారణసంఘమువారి అంచనా. ఎంత అయినను, ఆయాప్రదేశములలోని జీవరాసులు కోలుకొనుటకు సంవత్సరముల కాలము పట్టును.

ఈనెల నాల్గవ తేదీని నివారణకార్యము ప్రారంభమయ్యెను. ఈనష్టనివారణసంఘమునకు నేటివఱకు సుమారు రు౫౦౦౦/- వసూలయ్యెను; రు 30000/-ల రూపాయల కిమ్మతుగల 3000 బస్తాల బియ్యమును ఆయాప్రాంతములలో కేంద్రముల నేర్పఱచి చవుకధరకు విక్రయించిరి. ౧౫౦౯౦ తాటియాకును, ౧౮౦౦౦ బొంగులును కొనియుండిరి. ౨౦౦౦ తాటియాకు ఉచితముగ దొరకెను. మఱికొంత తాటియాకును, బొంగులును వాగ్దత్తములై యున్నవి. ౨౦ బండ్ల గాతము ఉచితముగ వసూలైనది.

ఈజరిగినపని చాలస్వల్పము. ఈసంఘమువారు తాత్కాలికనివారణసదుపాయములకై రెండులక్షల రూపాయలు కావలెనని ప్రజలను వేడుచున్నారు. ఈప్రదేశములను చూచిన కుమారప్పగారును, ఠక్కరుబాపాగారును, సమీపస్థులగు మద్రాసు రాష్ట్రనాయకులును కాంగ్రెసు అధ్యక్షులగు రాజేంద్రప్రసాదు, జవహరిలాల్‌గార్లును, జాతిమతదేశ విపక్షత నెఱుంగని కరుణాపారీణుఁడగు దీనబంధువు ఆండ్రూసుగారును, పురుషోత్తముఁడగు గాంధీగారును, దీనజనసహాయముకై ద్రవ్యమొసఁగుడని ధనికులను, సేవచేయుఁడని ఉత్సాహవంతులను హెచ్చరించి యుండిరి.

ఇప్పటికి నెలరోజులైనను కోరిన పైకము దొరకకుండుటయు, ఆంధ్రదేశము తన కర్తవ్యమును గుర్తింపకుండుటయు విషాదకరము. గాలివాన ఉప్పెనలకుతోడు రోజురోజు కురియుచున్న వానయును, తత్ఫలితమైన వఱదలును, దుఃఖభాజను లగు ఆ ప్రాంతవాసుల కష్టములను ఇనుమడింపఁజేయుచున్నవి. ఇట్టితఱి ఉపేక్ష వహించుట క్రూరమే కాదు; పాపమును అగును. కాఁబట్టి శక్తిమంతు లందఱును శక్తివంచన చేయక ధన ధాన్య వస్తు వాహన సేవారూప సాహాయ్యమొనర్చి తోడివారికి ఆపత్కాలమున ఆదుకొనవలెనని మిక్కిలి కోరుచున్నాము.

సామాన్యజనులు సాయముచేసినను, ఉపేక్షచేసినను సర్కారువారుమాత్రము ఉపేక్షచేయ వీలులేదు. ఈ నష్ట నివారణము చేయవలసిన బాధ్యత అచ్చముగా ప్రభుత్వము వారిదే. అన్ని విధముల వారే సాయముచేయవలెను. పైరులు పాడైన పొలము లన్నిటికిని శిస్తు మినహాయింపవలెను. మూలధనము అవసరమగు గృహనిర్మాణాది కార్యములకు వారే ధనము ఉచితముగా ఈయవలెను. వారిదివఱకుచేసిన వ్యయము చాల స్వల్పము. వారు తమ కర్తవ్యమును మఱవకుందురుగాక! అని కోరుచున్నాము.

## రక్షణనిలయము—బెజవాడ:

గ్రామసేవకులు కాఁగోరువారికి వివిధవిషయములందు తగినశిక్షణమిచ్చి-అర్హులను సిద్ధము చేయుట, నేటి మన దేశపు స్థితులలో, అత్యావశ్యకముగ కన్పించును. అనేకులు ఉత్సాహవంతులు, దీక్షాపరులు, కార్యపరతంత్రులు ఇప్పటికే ఇట్టికార్యనిర్వహణము చేయువారున్నారని మే మెఱుఁగుదుము. తగినశిక్షణమిచ్చుటకు అచ్చటచ్చట మహోదారులు ప్రయత్నము చేయుచున్నారనుటయు మాకు తెలియును. వీరి కందరకును ఆంధ్రభూమి కృతజ్ఞమై యున్నది. కాని ఇపుడు నిరుద్యోగబాధలో పడి క్రుగ్గుచు, దారితెన్నులులేక, ఇష్టమున్నను చేయుటకు పనిలేక కష్టపడు యువకవర్గము వీరందఱప్రయత్నములకును మించిన దేర్పడిపోయినది. వీరిని పూర్ణముగ వినియోగించుటకు దేశమునందు క్రొత్త అవకాశములును పొడగట్టినవి. శ్రీగాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు మఱియొకచోట వ్రాసిన 'నిరక్షరత్వనిర్మూలనము' అను వ్యాసములో గ్రామమునకు ఒక్కరికి తక్కువ కాని దీక్షాపరులకు కర్తవ్యకార్య మున్నదని నిరూపించుట చదువరులకు గోచరింపఁగలదు. అందుచేత, బెజవాడలో కొందఱు మిత్రులుచేరి- ఆలోచించి- నిర్ణయించిన ఒక నిశ్చితప్రణాళిక ననుసరించి, శిక్షణనిలయమునందు శిక్షణ మిచ్చుటకు ఏర్పాట్లు చేయఁబడినవి. శిక్షణనిలయవ్యవస్థాపకు లగు శ్రీమారేపల్లి రామచంద్రశాస్త్రి గారి లేఖను మఱియొకచోట ప్రకటించితిమి.

శిక్షణార్థుల యోగ్యతలును శిక్షణవివరములును అందు వివరింపఁబడినవి. గ్రామసేవకు అవసరమగు ముఖ్యవిషయములను గుఱించి ఉపన్యాసము లిప్పించుటకును, కొంత అనుభవశిక్షణముకూడ ఇచ్చుటకును ఏర్పాటు చేయఁబడినది. శిక్షణముచితముగ నిచ్చుటయు, ఖర్చులు తక్కువ చేయుటయు శిక్షణార్థులకు చాల అనుకూలము కనుక గ్రామసేవకై శిక్షణము పొందఁగోరువారు ఇట్టి అవకాశమును జాఱవిడువక వినియోగించుకొనుట తమకును, దేశమునకును శ్రేయస్కరము. అచ్చటచ్చట అర్హులగువారికి స్థానికులు ప్రోత్సాహ మిచ్చి, ఈనిలయమునకు శిక్షణార్థము పంపించి, గ్రామసేవకులను హెచ్చుగ

తయారుచేయుటకు తోడ్పడ వలయునని కోరుచున్నాము. దూరపుప్రాంతముల నుండి వచ్చునట్టి విద్యార్థులకు కూడ 3 నెలలకు రు30లకంటె ఖర్చుమించుటలేదు. కావున, తగిన కృషి వెంటనే జరుగునని విశ్వసించుచున్నాము. శ్రీ మారేపల్లి రామచంద్రశాస్త్రిగారిలేఖలో ఇట్టి సేవకుల ఆవశ్యకతను గుర్తింపగల సంఘములను కొన్నిటిని పేర్కొనిరి. అట్టి ఇతరసంఘములకు కూడ ఈ శిక్షణావశ్యకత సువ్యక్తము కాఁగలదు. కాబట్టి అన్ని సంఘములవారును తగు శ్రద్ధ వహింతురుగాక!

## జీవకారుణ్యము శ్రీ లిన్‌లిత్‌గో ప్రభువు.

మనకు రాజప్రతినిధిగా నుండు శ్రీలిన్‌లిత్‌గో ప్రభువు మనవలె జీవకారుణ్యమును పరమార్థముగా నెంచని మతమునకు చెందినవాఁడే. అయినను, లోకకల్యాణహితుఁడై నందున కొన్ని ప్రశంసనీయకార్యములను చేయు చు న్నాఁ డు. ఇటీవల కలకత్తానగరమునుండి ఉత్తరహిందూస్థానములోని పశువధశాలలకు ఎగుమతి అగుచుండిన ౬ గోవులను, ౧ గేదెను కొని ఢిల్లీ పింజర్‌పోలు (పశుశరణాలయము)నకు బహుమానముచేసినాడు. పాలీయక ఎండిపోవుటతోనే ఇట్టి అవాచ్యకార్యమునకు ఆసపోతులు వడిగట్టుదురనియు, చక్కఁగ పోషించినయెడల ఈ పశువులే మరల ఈని పాడికి ఉపయోగపడఁగలవనియు ఆయన ప్రకటించినాఁడు. బాగుగా మేపుకొనుచో ఆవుకుఁగాని, గేదెకుఁగాని ముసలితనము లేదని కొంద అందురు. అట్టి స్థితిలో దురాశాపిశాచ మనునది అనేకులను దుష్టమార్గములపట్టించినది.ప్రత్యేకముచికిత్సక్రియ(ఫూకా) చేసి, గొడ్లు వంజలగునట్లు చేయు దురభ్యాసము ప్రబలినదని లిన్‌లిత్‌గో ప్రభువు ప్రకటించి నాఁడు; ఫూకాచేయు దుర్మార్గులను కనిపెట్టి దండింప వలసినదనియు ప్రబోధించినాఁడు. జీవకారుణ్యపరులకు ఈ ప్రభువుప్రవర్తనము హృదయానందము కలిగించుననుటకు సందియము లేదు. కాని, ఇట్టి దురభ్యాసము తొలగవలెనన్న దీనితో చాలదు. ఏ కారణములవలన పశుగ్రాసమునకుఁగల అవకాశములు తగ్గెనో, ఎందువలన ప్రజలు పశువులను హంతకులపాల్జేయుచున్నారో వాని మూలకారణమును తెలిసికొని, నివారణమునకుఁ గడంగుట భూతదయాపరులకే కాక ముఖ్యముగ ప్రభుత్వము వారికర్తవ్య మని వేఱే చెప్ప నక్కఱలేదు.

---

# 'స్టావ్‌లీ' ప్రాంతీయ గ్రంథాలయము

బ్రిటను దేశములోని 'స్టావ్‌లీ' పట్టణమున ఈ ప్రాంతీయ గ్రంథాలయము 1931 సంవత్సరమున స్థాపింపబడెను. ఇది యొక పెద్ద పారిశ్రామిక కేంద్రము. ౫౪ పెద్ద గ్రంథాలయములకును, ౧౬ పిల్లల గ్రంథాలయములకును ఇది జవాబుదారి వహించును. ఇందు ౩౬,౦౦౦ గ్రంథములు కలవు. ఇందు ఇతరప్రాంతములగ్రంథములను ఎరవు ఇచ్చు ప్రత్యేకశాఖ కలదు. ఈ సంచిక ముఖపత్రముపై చిత్రింపబడిన పటము ఈ శాఖదే.

బ్రిటను దేశములో 'డెర్బీషైర్' జిల్లాగ్రంథాలయ సేవనుగూర్చి రాబోవు సంచికలో వచ్చువ్యాసమందు ఈ ప్రాంతీయ గ్రంథాలయములను గురించిన వివరములు తెలుపబడును.

# ఏలూరు, అన్నదానసమాజము — Annadanasamajam, Ellore.

ఏలూరు, అన్న, వస్త్ర, వైద్య, విద్యాదానసమాజము 1913 సం॥ రమున స్థాపింపబడెను. ప్రభుత్వమువారు స్థలము ధర్మముగ నొసంగిరి. మ. రా. శ్రీ బొమ్మా రత్నంగారి ద్రవ్యసహాయమున భవనము నిర్మింపబడెను. ఇందు ప్రతిదినము అశక్తులకు అన్నదానము జరుగుచున్నది. ప్రతిసంవత్సరము 15 డిశంబరున బీదలకు వస్త్రదానము జరుగుచున్నది. వేసవికాలమున మంచినీళ్ల చలివేంద్రిలు పెట్టబడుచున్నవి. వైద్యదానము ప్రతిరోజు సాయంకాలము సమాజమువద్ద జరుగుచున్నది.

ఒకరోజు అన్నదానమునకు రు 60 లు ధర్మమిచ్చిన స్థిరాస్తులవల్ల వచ్చే ఆదాతో వారు కోరిన తేది 1 రోజున బీదలకు అన్నదానము జరుగును. వస్త్రదానము శాశ్వతనిధి ధర్మము రు 10 లు లగాయతు ఈయవచ్చును. ధర్మములకు రశీదులను, శాశ్వతనిధి ధర్మములకు రసీదులతోసహా పట్టాలను 5 గురు శాశ్వతధర్మకర్తలు (రు 500 దాతలు) సంతకములతో నిచ్చెదరు. ఎల్లరు సహాయపడ గోరుచున్నాము. ఇతర వివరములకు :—

| | |
|---|---|
| రావుబహద్దరు, మోతే గంగరాజు జమీందారుగారు | శాశ్వతధర్మకర్తలలోనివారు |
| కొత్తమాసు సీతారామయ్యగారు, ( సోల్‌ట్రస్టీలు ) | |
| పసుమర్తి పురుషోత్తంగారు, (ప్రెసిడెంటు) | |
| మద్దుల వెంకట చినరాజుగారు, (వైస్‌ప్రెసిడెంటు) | |
| నున్నా గంగరాజుగారు, (వైస్‌ప్రెసిడెంటు) | |
| కందుల రామయ్యగారు, (సెక్రిటరీ) | |

# ఏలూరు, హిందూ యువజనసంఘము

## Youngmen's Hindu Association, Ellore.

ఈగ్రంథాలయము 1904 సం॥రమున స్థాపింపబడెను. 1918 సం॥రము సంఘమురిజష్టరు అయినది. 1928 సం॥రము మ. రా. శ్రీ రా. బ. మోతే గంగరాజు జమీందారుగారి ద్రవ్యసహాయమున నూతన దివ్యభవనము (రు 50,000 లు వెచ్చింపబడి) నిర్మింపబడినది. ఇందు దిన, వార, పక్ష, మాసపత్రికలు, ఆంగ్ల, ఆంధ్రభాషలయందు వచ్చుచున్నవి. ఆంగ్ల, ఆంధ్ర, సంస్కృత గ్రంథములు సుమారు 13 వేలవరకు గలవు. మ్యాజిక్‌లాంతరు, వ్యాసరచన పోటీపరీక్షలు, విషయనిర్ధారణ సభలు, వక్తృత్వపోటీపరీక్షలు ప్రతిసంవత్సరము జరుపుచు అందు తీర్ణులకు బహుమతు లొసంగబడుచున్నవి. ఇంకను గ్రంథములు, పత్రికలు తెప్పించవలసినవి యున్నవి. ఎలక్ట్రిసిటి, రేడియో అవసరము. ప్రతిసంవత్సరము ఆదాయమునకు మించిన వ్యయమగుచున్నది. కావ ఎల్లరు శక్తికొలది సహాయపడుడు. ధర్మములకు రశీదులను శాశ్వత ధర్మములకు రశీదులతోపాటు పట్టాలను, 5 గురు శాశ్వతధర్మకర్తల (రు 500 దాతలు) సంతకములతో నిచ్చెదరు. క్యాటలాగులు అచ్చువేయబడెను.

ఇతర వివరములకు:—

రావుబహద్దరు, మోతే గంగరాజు జమీందారుగారు, (ధర్మకర్తృసభాధ్యక్షులు)

మద్దుల వెంకట చినరాజు శ్రేష్ఠిగారు, (ధర్మకర్తృసభాగౌరవకార్యదర్శి)

RSVM01A161



Grandhalaya Sarvasvam-Registered No. M 1714


# ఓ రి య ం ట ల్

## గవర్నమెంటు సెక్యూరిటీలైఫ్ అస్యూరెన్సుకంపెనీ, లిమిటెడ్.

స్థాపితము 1874. హెడ్ ఆఫీసు : బొంబాయి.

**1935** ని వే ది క — సం గ్ర హ ము.

| | | | |
|---|---|---|---|
| జారీచేసిన క్రొత్త పాలిసీలు | రూ. 8,89,89,149 | చెల్లించిన క్లయిముల మొత్తం | రూ 17,43,21,855 |
| పాలీసా ఆదాయము | ,, 3,49,16,412 | పెరిగిన ఫండు మొత్తములు | ,, 17,01,62,491 |
| అమలులోనున్న పాలసీలు | ,, 59,25,32,038 | | |

ఈ పైన తెలుపబడిన అంకెలు ఓరియంటల్ యొక్క ప్రజాదరణ,
కంపెనీస్థిరత్వమునుగూర్చి వేనోళ్ళ చాటుచున్నవి.
ప్రజాదరణబొంది దినదినాభివృద్ధిగాంచుచున్న ఈహైందవభీమాసంస్థలో మీజీవితము భీమా చేసికొనుటకు
ఆ ల సిం ప వ ల దు.

వివరములకు : పి. హెచ్. గుప్త, బార్-ఎట్-లా సెక్రటరీ, ఉత్తరజిల్లాలు,, గొడేవారివీథి, విశాఖపట్టణము,
లేక ఈక్రింది ఉదాహరింపబడిన కంపెనీ కార్యాలయములకు వ్రాయవచ్చును.
ఆగ్రా, అజ్మీర్, అహమ్మదాబాద్, అలహాబాద్, అంబాల, బెంగుళూర్, బెరియేలీ, బెల్లారి, కలకత్తా, కాలికట్, కోయంబతూర్, కొలంబో, ఢక్కా, ఢిల్లి, గౌహతీ, గుంటూరు, జల్గాను, జల్పాయిగురి, జబ్బల్ పూర్, కరాచీ, కోలాలంపూర్, లాహోరు, లక్నో, మాండలీ, మధుర, మెర్కారా, మొంబాసా, నాగపూరు, పాట్నా, పూనా, రాయపూరు, రాజసాహి, రాంచీ, రంగూన్, రావల్పిండి, సింగపూర్, సుక్కూర్, తిరుచునాపల్లి, త్రివేండ్రము, తిరువనంతపురము, విశాఖపట్టణము.

(Oriental)


# Ellore Gosamrakshana Samithi,

## ఏలూరు గోసంరక్షణ సమితి, స్థాపితము 1918.

ది 22-9-36 న ఈ సంఘము రెజిస్టరయినది.

ఈ సమితియందు దిక్కులేని గోవులు రక్షింపబడును. పాలు ఉన్న యెడల చంటిబిడ్డలకు, దైవపూజలకు, బీదలకు ఉచితముగ నిచ్చెదరు. పచ్చిగడ్డి నిమిత్తము బీడుభూమి కొనవలసి యున్నది. మంచిస్థితిలోనికివచ్చిన గోవులను గృహస్థులకు అమ్మెదరు. గోశాలనిమిత్తము స్థిరమైన స్థలము అవసరము. ధర్మములకు రశీదులు, శాశ్వతనిధి ధర్మములకు రశీదులతోసహా లయిదు గురకు తక్కువగాని శాశ్వత ధర్మకర్తల [రు 500 దాతలు] సంతకములతో పట్టాలనిచ్చెదరు. అభిమానులెల్లరు శక్తికొలది శాశ్వతనిధిధర్మములేకాక వార్షిక మామూళ్లుగను, నెల చందాలుగను పరిగడ్డి, తవుడు, విరాళములుగను సహాయపడి యీ సమితి అభివృద్ధికి తోడ్పడ గోరుచున్నాము.

గోసంరక్షణసమితి ప్రచురణములకు, రూల్సుబుక్కులకు, రిపోర్టులు మున్నగువానికి:—

ఏలూరు
5-10-1936.

రా॥ బ॥ మోతే గంగరాజు జమీందారుగారు, (ప్రెసిడెంటు, ట్రస్టి.)
మద్దుల వెంకట చినరాజు శ్రేష్ఠిగారు, (వైస్ ప్రెసిడెంటు, ట్రస్టి.)
పోలిశెట్టి గోపాలస్వామి (సెక్రటరి, ట్రస్టి)

బెజవాడ ఆంధ్రగ్రంథాలయముద్రాక్షరశాలయందు కుందా లక్ష్మీనరసయ్యగారిచే ముద్రింపబడినది.

## మనసు ఫౌండేషన్

## పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVM01A(61) |
| పుస్తకం పేరు | [illegible] |
| తారీఖు | 7/6/24 |
| ముందు అట్ట | Yes |
| వెనుక అట్ట | Yes |
| మొత్తం పేజీలు | 47 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | NO |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | Hema |
| పేజీలు విడదీసినది | Hema |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | pragathi |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | NO |
| పరిస్థితి | Good |